డిసెంబర్ 01-15, 2022
సంపుటి 03, సంచిక 4

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయ స్థాపకులలో ఒకరు,
తెలంగాణలో విద్యావ్యాప్తికి
విశేష కృషి చేసిన ప్రముఖులు...

## రావిచెట్టు రంగారావు

(డిసెంబర్ 10, 1877 - జూలై 3, 1910)



తెలంగాణ ప్రముఖ రచయిత, దిగంబర కవి...

# జ్వాలాముఖి

(ఏప్రిల్ 12, 1938 - డిసెంబర్ 14, 2008)

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor,
Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

## విషయ సూచిక


ఎక్కడో వాక్యం ఉరేసు
కుంటున్నట్టు అని పలువరిస్తున్న
**రఘువగ్గు** కవిత
**"ఒక స్కిజోఫ్రెనిక్ కథనం"** 40

ఉదాత్తమైన ఆమెను మన
ముందు పెడుతున్న **మౌనశ్రీ**
04 **మల్లిక్** కవిత **"అలరులు"...**



43

నాటి సామాజిక వ్యవస్థను
చిత్రించిన **నర్రా రాఘవరెడ్డి** కథ
**"లత్కోరు సాబ్"**



23

ఒక సాహితీ ప్రేమికుని గురించి
తన అనుభూతిని పంచిన **ఎలనాగ**
అనువాద కథ **"బికారి"**



17

తెలంగాణలో పరిమళించిన ప్రాచీన నాటక
వికాసాన్ని తెలిపే **సంగనభట్ల** వ్యాసం
**"తెలంగాణాలో ప్రాచీన నాటక రంగం"**



05

మార్క్సిజం తాత్పర్యం చెప్పిన
**సి.హెచ్. మధు** నాటికథ
**"చెదలు"**



35

అనుకోని కలయికను అందంగా
చిత్రించిన **ఐతా చంద్రయ్య** కథ
**"మిడిమిడి జ్ఞానం"**



11

కొందరిలో నాటుకుపోయిన
కులతత్వాన్ని చెప్పే **జ్వలిత** కథ
**"బతుకు నాటకం"**

అమ్మే తన దేవత
అంటున్న అరుణ్ జ్యోతి
42 కవిత **"అమ్మ ప్రేమ"**

**"రచయితగా తెలంగాణ
నాలో అంతర్భాగం"**
అంటున్న కవి అప్సర్‌తో
29 **వేణు నక్షత్రం** ఈ పక్షం
ముచ్చట...

మూకీ సినిమాల చరిత్రను తెలుపుతున్న
**హెచ్ రమేష్ బాబు** వ్యాసం..
**"హైదరాబాదులో మూకీ సినిమాలకు
వందేండ్లు"** ...పేజీ 07

చరిత్ర చేతికి దొరకని కవులను
పరిచయం చేస్తున్న **కావూరి శ్రీనివాస్**
**"చరిత్రకు తెలియని మన ప్రాచీన
కవులు"** ...పేజీ 41

**"ఘంటసాలను పాటల పాఠశాలగా
చూసిన వంశీ రామరాజు" షామీర్ జానకి
దేవి** వ్యాసం...పేజీ 45

కన్నీటి లోతుల్ని దాచుకున్న
**రాజేందర్** కవిత **"జీవితం ఒక కన్నీటి
సముద్రమై"**...పేజీ 22

కులరహిత సమాజాన్ని సృష్టిస్తున్న
**కొమ్మెట కళ్యాణి** కవిత...పేజీ 33

నీతులు వల్లించే కోతులను
ప్రశ్నించిన **కోటం చంద్రశేఖర్** కవిత
**"మీలో ఎందరో"** ...పేజీ 21

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం,
సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం..
మొదలైనవి...

# సరస్వతీ స్తుతి

**మారన**

మారన తిక్కన శిష్యుడు, తెలుగులో తొలి పురాణమును అనువదించిన కవి. ఇతను తన మార్కండేయ పురాణమనే గ్రంథాన్ని కాకతీయ సామ్రాజ్యంలో కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్రుని సేనాని అయిన గన్నయనాయకునికి అంకితమిచ్చాడు. ప్రతాపరుద్రుడు సా.శ.1295 నుండి సా.శ.1326 వరకూ పరిపాలించాడు. మారన కూడా ఆకాలం వాడే. మారన మార్కండేయ పురాణాన్ని 2547 గద్యపద్యాలుగా రచించాడు. ఇతను తెలంగాణా ప్రాంతపు గోదావరి నదీ తీరం వాడని ఇతని రచనలోని ఓ పద్యాన్ని బట్టి ఊహిస్తారు. ఆయన రచించిన 'సరస్వతీ స్తుతి' మార్కండేయ పురాణము నుండి తీసుకోబడినది.



ఉ. ఆరయ నొక్కభంగిగ రహస్యపుఁజోటను రాజసన్నిధిన్
సూరిసభాంతరంబులను జొప్పడి తప్పక గద్యపద్యముల్
దోరలు పేర్చినట్లు మదిఁ దోఁపఁగఁ జేయుట సంతతంబు నా
భారము కాదె వీని కనుభారతి మాకుఁ బ్రసన్న యయ్యెడున్.

శా తర్కింపంగ నశక్య మైనవితతోద్యద్దీప్తి జాలంబుచే
నర్కుండెట్లు వెలుంగు నట్ల బహుపుణ్య శ్రేణికావ్యాప్తి సం
పర్కస్ఫూర్తి నఘాంధకారము లడంపం జాలి లోకంబున
న్మార్కండేయ పురాణరత్న మమరు న్మాంగళ్యసంపాదియై

ఉ. కావునఁ దత్పురాణము ప్రకాశితసారకథామృతం బొగిం
ద్రావి జగజ్జనంబు లలర న్వచియింపు తెనుంగున స్వచః
శ్రీవిభవంబు పెంపు విలసిల్లఁగఁ గోవిదు లిచ్చ మెచ్చి సం
భావన సేయ జారుగుణభాస్వర! మారయసత్కవీశ్వరా!

తే. సర్గమన్వంతర ప్రతిసర్గములును
సకలనృపవంశవంశానుచరితములును
ననగ నెంతయు నొప్పు నీయౌదులక్ష
ణములఁశ బొలుపొంది సభలయం దమరుదాని

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 డిసెంబర్, 2022

సంపుటి 03 సంచిక 04



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# జాతికి ప్రేరణ జాగృతి

తంగేడు జన్మించినప్పటి నుండి రెండవ ఏడు దాటి ముందుకు వెడుతూంది. తెలంగాణ జాగృతి చేసిన సాహితీ సేవలో భాగంగా తంగేడు తల ఎత్తింది. తెలంగాణ జాగృతి తన ప్రచురణల ద్వారా, కవి సమ్మేళనాల ద్వారా, చరిత్ర నిర్మాణం ద్వారా తెలంగాణ సమాజాన్ని జాగృతపరచే కర్తవ్యం భుజాన వేసుకుంది. రాష్ట్ర సాధనానంతరం ఈ ఆవశ్యకత మరింత పెరిగింది. జాగృతి క్షణం విస్మరించకుండా ఈ కర్తవ్య నిర్వహణలో కొనసాగింది. ఇందులో భాగంగా మొలకెత్తిన 'తంగేడు' పక్షపత్రిక పూర్తి ప్రజాస్వామికంగా వ్యవహరించింది. విభిన్న అస్తిత్వాలకు, ప్రక్రియలకు వాహికగా పనిచేసింది. నాటి సాహిత్యాన్ని, నేటి సాహిత్యాన్ని తన మూల్యాంకనలో నిరంతరం నిలుపుకొంటూ కొనసాగింది. అయినా ఈ సేవలన్నీ సమగ్రం సంపూర్ణం అని చెప్పలేం. ఇంకా మరింత పునరంకితం కావల్సిన అవసరం ఇప్పుడు మనముందు కనబడుతున్నది.

తెలంగాణ జాగృతి కేవలం తెలంగాణకే పరిమితం కావడం లేదు. అది తన దృక్పథాన్ని మరింత విశాలం చేసుకోవల్సిన అగత్యం ఇప్పుడు కనబడుతున్నది. తంగేడు మొదటి సంచిక సంపాదకీయంలోనే మనది విశ్వమానవ దృక్పథం అని మనవి చేయడం జరిగింది. ప్రాంతీయ స్పృహ ప్రతిపాదికతోనే మనం జాతీయ స్పృహతో నడవాల్సి ఉన్నది. దాశరథి, జాషువా లాంటి మహాకవులు ప్రతిపాదించిన విశ్వమానవ దృక్పథాన్ని అవలోకించాల్సి ఉంది. ఏకకాలంలో తెలంగాణ సాంస్కృతిక పురోగమనానికి పాటుపడుతూనే భారతీయ జాతీయ సంస్కృతికి కూడా మనవంతు కృషి చేయాల్సి ఉంది. నిజానికి మనం మొట్టమొదట భారతీయులం. తరువాతే తెలంగాణవాదులం.

Merriam Webster Dictionary ప్రకారం జాతీయత అంటే జాతికి విధేయంగా ఉండడం. జాతిపట్ల ఆరాధనా భావాన్ని కలిగి ఉండడం. జాతీయత దేశ సంస్కృతిని, జాతికే చెందిన జీవనవిధానాన్ని ఆ జాతిలో వచ్చే అనుస్యూతమైన కళల్ని, సాహిత్యాన్ని సంస్కృతిని ప్రతిబింబిస్తుంది.

తెలంగాణకు సాంస్కృతిక స్పృహ సాహితీ సృజనకారులవల్ల ఎట్లా కలిగిందో జాతీయ స్థాయిలో కూడా సాంస్కృతిక స్పృహ ఐక్యతాభావం సాహిత్యం వల్లనే కలుగుతుంది.

1857లో భారతదేశంలో వచ్చిన సిపాయిల తిరుగుబాటు, 1835లో కైలాస్ చందర్ దత్తు రాసిన The Journal of Forty Eight Hours of the Year 1945, సుషీచందర్ రాసిన The Republic of Orisa లాంటి వ్యాసాలలోనే మూలాలున్నాయని చెబుతారు. బంకించంద్ర భారతదేశంలోని మత విధానాన్ని వలసపాలకులకు వ్యతిరేకం గావించడంలో విజయం సాధించారు. గాంధీ భావజాలంతో ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన Untouchable ఒక దళితుని ఒకరోజు జీవితాన్ని చిత్రించి వివక్షపట్ల జాగరుకత ప్రబోధించింది. కె.పి.అబ్బాస్ Tomorrow Is Ours అనే నవల కూడా జాతీయవాద స్ఫోరకమైన అస్పృశ్యతను చిత్రించింది. బహమనీ భట్టాచార్య నవల So Many Hunters బెంగాలి స్త్రీ స్థితిని, క్విట్ ఇండియా ఉద్యమాన్ని బలంగా చిత్రించింది. రవీంద్రనాథ్ ఠాకూర్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వ్యక్తం చేసిన జాతీయవాద మహాకవి. Where the Mind is Without Fear అనే Poem ఈ విషయాలను బలంగా ప్రతిఫలించింది. ఆయన జనగణమన గురించి, బంకించంద్ర వందేమాతరం గురించి చెప్పాల్సినదేమున్నది? అలాగే సరోజినీ నాయుడు ఇదే కోవలో రచనలు చేసిన జాతీయవాద కవయిత్రి. The Golden Threshold, The Bird of Tune లాంటి ఆమె పద్యాలు పేర్కొనదగ్గవి.

జాతీయ ప్రేరక రచనలు ఇవి స్థాలీపులాకం మాత్రమే. ఇట్లా పేర్కొనదగిన రచనలు ఎన్నో ఉన్నాయి.

ఇప్పుడు కూడా జాతీయ సాహిత్యం సామాజిక ప్రయాణానికి అనుగుణంగా ప్రవహిస్తూనే ఉంది. మనం తెలంగాణ సాహిత్యాన్ని సంస్కృతిని ప్రోత్సహించినట్లే భారతీయ సాహిత్యాన్ని సంస్కృతిని ప్రోత్సహిద్దాం. ఎన్ని ఆటంకాలు, అవాంతరాలు వచ్చినా ఎదురొడ్డి నిలబడుదాం.

జై తెలంగాణ - జై జాగృతి

కవిత
కల్వకుంట్ల



# అలరులు

మౌనశ్రీ మల్లిక్, 89193 38546

ఆమె పొద్దున్నే
టీ తీసుకొస్తుంది
దాంతోపాటు
ఒక చిరునవ్వు కూడా!

తను పూలు పెట్టుకొని
నా ముందు
పచార్లు చేస్తుంది
నా పని కొండెక్కుతుంది!

పూలు కోస్తూ
కూని రాగాలు తీస్తుంది
కొమ్మకు నొప్పి
తెలియకుండా!

ఆమె అడుగులు పడి
తరించిన గడ్డి పరకలు
తలెత్తుకు చూస్తాయి
కృతజ్ఞతగా!

ఆమె
జడ వేసుకుంటుంటే
గులాబీ పువ్వు
నాట్యం చేస్తుంది!

ఆమె తులసి చుట్టూ
ప్రదక్షిణలు చేస్తుంది
దయతో కొన్ని
ఓరచూపులను మర్చిపోకుండా!

వెన్నెల రేయి
అప్రమత్తంగా ఉండాలి
అసలే తనకు
కోపం ఎక్కువ!

తనతో మాటలు
మానేసిన రోజే
లేత చలి గాలులు
ఇంట్లోకి చొరపడతాయి!

అలసిపోయి
నిద్రపోయినప్పుడు
మొట్టికాయ వేస్తుంది
సుఖంగా అలసిపొమ్మని!

ఆమె శనక్కాయలు
నేను మల్లెలు తీసుకుంటాం
ఇంటికెళ్లి వస్తుమార్పిడి
చేసుకుంటాం!

# చెదలు

కుక్క కాటుకు చెప్పు దెబ్బ....



సి.హెచ్. మధు

"ఈ దేశానికి మార్క్సిజం పనికి రాదు" తాను మేధావి అనుకుంటున్న మేధావి చెప్పిన మాట గురించి ఆలోచిస్తున్నాడు ప్రకాశ్.

అసలు ఆలోచించకూడదనుకున్నాడు. అసలు ఆలోచించటానికి అందులో ఏముంది అనుకున్నాడు. కాని ఇంత తెల్సి ప్రజలను మభ్యపెట్టటానికి వీరెందుకట్లా మాట్లాడుతారో ఆయనకు అర్థం కాలేదు.

ప్రకాశ్‌కు ఈ ఆలోచన ఇవాళ్ళ ఎందు కొచ్చిందంటే - గోపయ్య చెప్పిన కథ కారణం. కథ కాదది వాస్తవం.

గోపయ్య ఏమి చెప్పాడు?-

గోపయ్య నాలుగు సంవత్సరాల క్రితం ఆయన ఊరులో షావుకారి వద్ద వెయ్యి రూపాయలు మిత్తికి (వడ్డీకి) తీసుకున్నాడు. నెలకు నూరు రూపాయలకు నాలుగు రూపాయల మిత్తి.

**"నాది దౌర్జన్యం కాదు. నిజమే కాగితాన్ని చింపివేశాను. గోపయ్య వెయ్యి రూపాయలు వడ్డీకి తీసుకున్నాడు. ఎందుకూ? ఐదు వందలు ఉద్యోగానికి లంచం, ఐదువందలు ఆరోగ్యానికి లంచం. ఇది వ్యవస్థ చేసిన దోపిడీ. ఈ వెయ్యికి వడ్డీ క్రింద రెండువేలు ఇచ్చాడు గోపయ్య. అందుకే చింపివేశాను".**

**రచయిత గురించి....**

*సి.హెచ్. మధు 1945లో రామాయంపేటలో జన్మించారు. సుమారు వెయ్యికి పైగా కవితలు, అనేక కథలు రచించారు. అనేక వామపక్ష ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. చాలాకాలంపాటు నిజామాబాద్‌లో జీవించిన వీరు ఇటీవలే మరణించారు.*

తన ఉద్యోగం కోసం లంచమివ్వటానికి ఐదు వందలు ఒకసారి, తన భార్య ఆపరేషన్‌కు డాక్టర్ అడిగితే ఐదు వందలు ఒకసారి, మొత్తం వెయ్యి ఒకే నెలలో తీసుకున్నాడు.

ఒకవేళ అప్పు తీర్చకపోతే, తన ఎకరం భూమి షావుకారి ఆస్తిగా మారటానికి వీలుగా ఒక కాగితం కూడా రాసిచ్చాడు. ప్రతి సంవత్సరం ఒకసారి మిత్తి తీసుకునేవాడు షావుకారు. పాత కాగితం చింపివేసి కొత్త కాగితం రాయించుకునేవాడు. ఈ నాల్గు సంవత్సరాలలో గోపయ్యకు ఆ అప్పు తీర్చటానికి డబ్బులు మిగులలేదు. అప్పు తీర్చలేదు. మిత్తి క్రింద మాత్రం 1960 రూపాయలు ముట్టాయి. అంటే అసలు కంటే వడ్డీ రెండు రెట్లు ముట్టింది. ఇప్పుడు షావుకారు అసలు డబ్బు చెల్లించమంటున్నాడు. లేకపోతే భూమి జప్తు చేసుకుంటానంటున్నాడు. గోపయ్య ఇప్పుడు అసలు చెల్లించలేడని, భూమి స్వాధీనం చేసుకోవటానికి ఇదే సమయమని గ్రహించాడు షావుకారు. గోపయ్య ఏమి చెయ్యాలో అర్థం కాక, జిల్లాలో ఉన్న తనకు తెల్సిన ప్రకాశ్‌కొచ్చి చెప్పుకున్నాడు.

ప్రకాశ్ ఏదో ఒకటి నాలుగు రోజులలో చేస్తానన్నాడు.

* * *

ప్రకాశ్ గోపయ్య కథ పోలీస్ స్టేషన్ కొచ్చి చెప్పాడు. మేమేమీ చెయ్యలేమన్నారు.

గోపయ్య ఊరులో తనకు చాలా మంది యువకులు తెల్సు. అక్కడే ఏదో చెయ్యవచ్చు.

ఆ ఊరుకెళ్ళాడు. గోపయ్యను కల్సి, తర్వాత తనకు తెల్సిన యువకులందరినీ ఒకచోట చేర్చి మాట్లాడాడు. వారంతా ఒకమాట చెప్పారు. "వాడు పెద్ద దోపిడీదారు ఇట్లా దోచుకోవడం వాడి పని. మిత్తీలు, ధరలు పెంచడం, ఈ కంట్రోలు వస్తువులు బ్లాకులో అమ్ముకోవడం,

ఇలాంటి వాటి ద్వారా చాలా సంపాదించాడు.

ప్రకాశ్ వానికి తగిన శిక్ష వేయాలను కున్నాడు. అందరూ కల్సి షావుకారు ఇంటికి వెళ్ళారు. అందరినీ చూచి షావుకారు భయపడ్డాడు.

"ఈ గోపయ్య నీకేదో బాకీ వున్నాడట! ఆ కాగితం ఒకసారి చూపిస్తావా?"

కాగితం తెచ్చి ఇచ్చాడు షావుకారు.

"ప్రతి సంవత్సరం మిత్తి తీసుకున్నావట కదా?"

"తీసుకున్నాను"

"నాలుగు ఏళ్ళనుండి మిత్తి రెండు వేలు అవుతుంది".

ఏమీ అనలేదు షావుకారు.

"అసలుకంటే వడ్డి రెట్టింపు ముట్టింది" ఏమీ అనలేదు షావుకారు.

"పాపం! గోపయ్య బీదవాడు. ఇది మాఫీ చెయ్యి" అన్నాడు ప్రకాశ్.

"నేను బీదోన్ని సేటూ, నీ కాల్మొక్త" అన్నాడు గోపయ్య.

"అదెట్లా అవుతుంది. మిత్తి మిత్తే. అసలు అసలే. కట్టాల్సిందే".

"కాదు షావుకారు! ప్రభుత్వం మారింది. ఆ విషయం గుర్తించావా?"

"ఆ నేను జనతానే. జనతాపార్టీకి నేను ఓటు వేశాను".

"జనతాపార్టీ ఏమంటుందో చూచావా, గాంధీజీ చెప్పిన సిద్ధాంతాన్ని చెపుతుంది. మీరంతా ఈ పైసకు ధర్మకర్తలని, ఇట్లా మీరు బీదవారిని దోచుకోవడం భావ్యం కాదు" అన్నాడు ప్రకాశ్.

"నాకదంతా తెలియదు. మీతో నాకు అవుసరం లేదు. నేను గోపయ్య దగ్గర ఎట్లా వసూలు చేసుకుంటానో నాకు తెల్సు".

"ఊరిలో ఎన్నో కుటుంబాలను నాశనం చేశాడు సార్" అన్నాడు ఆ యువకులలో ఒకడు.

"గోపయ్య పొలం జప్తు చేసుకుంటాడు సార్" అన్నారు ఇంకొకరు.

"షేటూ, మళ్ళీ చెపుతున్నాను. మాఫీ చెయ్యి" అన్నాడు ప్రకాశ్.

చేయనన్నాడు షావుకారు.



ప్రకాశ్‌కు కోపం వచ్చింది. ప్రకాశ్ తన చేతిలో ఉన్న కాగితాన్ని ముక్కలు చేసి (గోపయ్య షావుకారికి రాసిచ్చిన కాగితం) ఇది కాల్చేయ్యమని ఒక వ్యక్తికి ఇచ్చి "ఏమి చేసుకుంటావో చేసుకో. మాకిది న్యాయం" అంటూ లేచి వచ్చాడు.

★ ★ ★

దౌర్జన్యంగా కాగితాలు చింపివేశాడని ప్రకాశ్ మీద కేసు పెట్టాడు.

కోర్టులో అన్నాడు ప్రకాశ్-

"నాది దౌర్జన్యం కాదు. నిజమే కాగితాన్ని చింపివేశాను. గోపయ్య వెయ్యి రూపాయలు వడ్డీకి తీసుకున్నాడు. ఎందుకూ? ఐదు వందలు ఉద్యోగానికి లంచం, ఐదువందలు ఆరోగ్యానికి లంచం. ఇది వ్యవస్థ చేసిన దోపిడీ. ఈ వెయ్యికి వడ్డీ క్రింద రెండువేలు ఇచ్చాడు గోపయ్య. అందుకే చింపివేశాను".

"చింపివేసే అధికారం మీకు లేదు".

"ప్రభుత్వం మారిందని చింపివేశాను".

"ప్రభుత్వం మారితే మీకు స్వేచ్ఛ దొరికింది. అది మాట్లాడే స్వేచ్ఛ. ఇది దోపిడి అని చెప్పే స్వేచ్ఛ, చింపే స్వేచ్ఛ మీకు లేదు".

"ఇది పచ్చిదోపిడీ అండీ!" అన్నాడు ప్రకాశ్.

"మీరు మార్క్సిజం మాట్లాడుతున్నారు. ఈ దేశములో మార్క్సిజం పనికిరాదు" అన్నాడు వకీలు సుబ్రహ్మణ్యస్వామి.

ప్రకాశ్ నవ్వాడు.

"మా ఇంట్లో కట్టె మీద కొంచెం నీళ్ళు పోసినట్టున్నారు. నీళ్ళు కట్టె క్రింద నిలిచాయి. కట్టె చల్లగయి చెదలు పట్టింది. నేను రాగా చూచి చెప్పుతో నలిపివేశాను. లేకపోతే కట్టెను పూర్తిగా తినేవి. నీళ్ళున్న కట్టెకు చెదలు పడుతాయి. నలిపివేయుటము మన ధర్మము. ఎక్కడ దోపిడీ వుంటుందో అక్కడ మార్క్సిజముంటుంది. ఈ దేశానికి కూడా మార్క్సిజము పనిచేస్తుంది" అన్నాడు ప్రకాశ్.

*ప్రజాసాహితి, ఆగస్టు, 1977*

*మెతుకు కథలు కథాసంపుటి, 2016*

*(సంపాదకులు : వేముగంటి మురళీకృష్ణ & డా॥ బెల్లంకొండ సంపత్‌కుమార్)*

వ్యాసం

# హైదరాబాదులో మూకీ సినిమాలకు వందేండ్లు

మూకీ సినిమా చరిత్ర స్పర్శ....



హెచ్. రమేష్ బాబు
77807 36386

**1895** డిసెంబర్ 28, పారిస్ నగరం, రూస్క్రైబ్ వీధి. చీకటి పడుతున్న సమయం. చల్లని పిల్లగాలులు వీస్తున్నవి. అక్కడి 'గ్రాండ్ కేఫే' హోటల్‌కు ఎదురుగా 'లా ఆర్ట్ గ్యాలరీ' హాల్ ఒకటి ఉంది. ఇలాంటి వాతావరణంలో ఒక పాత డొక్కు కారొకటి వచ్చి ఆ వీధిలోని ఆర్ట్‌గ్యాలరీ ముందు ఆగింది. అందులోంచి ఇద్దరు యువకులు దిగారు. ఒక డబ్బా, ఒక స్టాండుతో కారు దిగిన ఆ ఇద్దరూ తమ పనిలో తాము మునిగి పోయారు. వాటిని ఒక పద్ధతిగా అమర్చు తున్నారు. వీరిని అక్కడి వారంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. డబ్బాలో నుండి తీసిన వస్తువులను ఒక్కొక్కటిని జాగ్రత్తగా స్టాండు మీద అమర్చు తున్నారు. అది 35 ఎం.ఎం. ఫిలిం తిరిగే కెమెరా.

అంతా సిద్ధమైంది. ఆ ఇద్దరిలో ఒకరు స్విచ్ వేసి ఒక దృశ్యాన్ని 'ప్రొజెక్ట్' చేశాడు. అంతే ఎదురుగా ఉన్న తెరపై "ఒక ఫ్యాక్టరీ నుండి కార్మికులు బయటికి రావడం" స్పష్టంగా కనిపించింది. తెర మీద బొమ్మలు కదలడం అక్కడ వారం దరికీ కనీ వినీ ఎరుగని దృశ్యం. అంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఆ వెంటనే "ఒక రైలు పొగలు వదులుతూ స్టేషన్లోకి రావడం" చూపించారు. అక్కడి వారంతా ఈ శతాబ్దపు అద్భుతం ఆవిష్కారమైందని చెప్పుకున్నారు. ఇదే ప్రపంచ సినిమాకు సంబంధించి తొలి సినిమా ప్రదర్శన. దీనికి ఆద్యులైన ఆ ఇద్దరు లూమియర్ బ్రదర్స్ గా ప్రఖ్యాతమైన "ఆగస్ట్ లూమియర్ (1864-1948), లూయీ లూమియర్ (1862-1954)". తొలుత 25 నిముషాల పాటు నడిచిన ఈ ప్రదర్శనలు ఆ తరువాత కళ్ల ముందు కదులుతున్న సినిమాగా సృష్టించిన సంచలనం వల్ల రోజుకు 25 ప్రదర్శనలు వేసే పరిస్థితి వచ్చింది. మొదటి షో పూర్తయిన వెంటనే పారిస్ వీధుల నిండా జనం. ఆ ప్రదర్శన గురించిన విషయాలు చెప్పుకుంటూ అంతా బారులు తీరారు. అంతే సినిమా విజయగాథ కూడా దాని ఆరంభంతోనే మొదలైంది. ఆ తరువాత తాము ప్రదర్శన ఇచ్చి కెఫేడి ఆర్ట్ (ఆర్ట్ గ్యాలరీ)ని లూమియర్ సోదరులు ఓ సినిమాహాలుగా మార్చేశారు. ఇప్పటికీ అది అట్లానే ఉండటం గొప్ప విషయం.

ఇది జరిగిన కొద్ది నెలలకు

7 జూలై 1896, బొంబాయి.

సాయంత్రం ఆరు గంటలు. భారీ వర్షం పడుతోంది. నగరంలోని వాట్సన్ హోటల్లో లూమియర్ సోదరులచే భారతదేశంలో తొలి సినిమా ప్రదర్శన జరిగింది. మొదటిసారి భారతీయులు వరస క్రమంలో ఒక అర్థాన్నిచ్చే దృశ్యాలను చూశారు. రైలు స్టేషన్లోకి వచ్చి ఆగడం, సముద్రంలో స్నానం చేయడం. గోడ కూల్చడం, పాపకు తల్లిదండ్రులు తినిపించడం, ఫ్యాక్టరీ నుండి కార్మికులు బయటికి రావడం వంటి చిన్న చిన్న సినిమాలు ఆ రోజు చూపెట్టారు. చూసిన వారంతా ప్రపంచంలోనే కొత్త అద్భుతం అని కొనియాడారు. తొలుత ధనవంతుల కోసమే ఈ ప్రదర్శన జరిగినా నాటి పత్రికలలో వచ్చిన వార్తలను చదివి సామాన్యులంతా ఈ ప్రదర్శనలు చూడటానికి ఎగబడ్డారు.

లూమియర్ సోదరుల చూపే చిత్రాలన్నీ 70 మీటర్ల పొడవుండేవి. వీటి ప్రదర్శన సమయం 30 నిముషాలు, స్క్రీన్ (తెర)పై ఇరవై అడుగుల దూరంలో ఉన్న చేతితో నడిపే ప్రొజెక్టర్ ద్వారా బొమ్మపడేది. సినిమాల రాకతో నాటకాల ఉనికి ప్రమాదంలో పడింది. సినిమాల ప్రదర్శనకు ఆదరణ పెరగనారంభించింది. నావెల్టీ తరువాత గెయిటి ఇంకా మరిన్ని థియేటర్లు బొంబాయి నగరంలో ఒకదాని వెంట ఒకటి సాయంత్రం పూట నాటకాల స్థానంలో మూకీ సినిమాలను ప్రదర్శిం చడం మొదలు పెట్టినవి.

ఆ రోజుల్లో బొంబాయితో బాటు కలకత్తా కూడా ప్రసిద్ధ వ్యాపార కేంద్రంగా ఉండింది. పైగా నాటి బ్రిటిష్ ఇండియాకు రాజధాని కూడా. చాలా మంది సినీ పరిశోధకుల మాటేమిటంటే కలకత్తాలో

వ్యాసం

1896 డిసెంబరుకు ముందే మూకీల ప్రదర్శన జరిగిందని, కానీ ఇందుకు నిరూపణగా ఏ ఒక్క ఆధారమూ లభించలేదు. 30 డిసెంబర్, 1898 నాటి అమృత బజార్ పత్రిక సంచికలో వచ్చిన ఒక ప్రకటన ఆధారంగా స్టార్ థియేటర్లో అక్టోబర్ 2న తొలి మూకీ జరిగినట్లు తెలుస్తున్నది. ఈ సినిమా షోను ప్రొఫెసర్ స్టీవెన్సన్ (అసలు పేరు స్టీఫెన్) అనే విదేశీయుడు ఏర్పాటు చేశాడు. ఈయన బెంగాలీ సినిమాకు ఆద్యుడుగా చెప్పుకుంటున్న హీరాలాల్ సేనకు ఛాయా గ్రహణంలో ఓనమాలు నేర్పిన గురువు. ఈ స్టీవెన్ సన్‌కు కలకత్తా కన్నా ముందుగానే హైదరాబాదుతో పరిచయం ఉంది.

ఇక్కడి నుండి మళ్లీ 1895లోకి వెళితే మనకు దక్షిణ భారతదేశంలో మూకీ సినిమాలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు బయటపడతాయి. వీటికి కేంద్ర బిందువుగా నిలిచిన వాడు "ప్రొఫెసర్ స్టీవెన్సన్'. ఇతనే హైదరా బాదులో తొలిసారిగా 1897లో మూకీలను ప్రదర్శించిన విషయం 80 ఏండ్ల తరబడి తెర వెనుకనే ఉండి పోయింది.

లండన్ నుండి వెలువడే సేజ్ పబ్లికేషన్స్ వారు 2010లో ప్రచురించిన "బయస్కోప్'' గ్రంథంలో సౌత్ ఆసియా స్క్రీన్ స్టడీస్ విభాగంలో రచయిత స్టీఫెన్ హ్యూస్ దక్షిణభారత మూకీల చరిత్రపై కొత్త వాస్తవాలను ఆవిష్కరించారు.

ఈ ప్రొ. స్టీవెన్సన్ 1895 నాటికే అంటే మూకీలు భారతదేశంలోకి అడుగుపెట్టక మునుపే మద్రాసు వచ్చి 167, మౌంటెడ్లో 'మద్రాస్ ఫోటోగ్రాఫిక్ స్టోర్ పెట్టాడు. ఈయన మొదట యానిమేషన్ పద్ధతిలో తయారు చేసిన స్లైడ్స్ ఒక ప్రదర్శనను మూడు రోజుల పాటు 1896 డిసెంబర్ మొదటి వారంలో నిర్వహించాడు. మద్రాస్‌లో డార్క్ రూం పరికరాలు, ఫోటోలు ప్రింట్ వేసే కాగితాన్ని విదేశాల నుండి తెప్పించి అమ్మేవాడీయన. అయితే మొన్నటి వరకు ఎం.ఎడ్వర్డ్ అనే ఆయన1897లో మద్రాస్ విక్టోరియా హాల్లో తొలి మూకీ ప్రదర్శన చేసినట్లు జరిగిన ప్రచారం దీంతో తప్పని తేలిపోయింది. ప్రొ.స్టీవెన్సన్ ప్రదర్శనల గురించి నాటి మద్రాస్ మేల్ (8-12-1896, 9-12-96), హిందూ (9.12.1896) మద్రాస్ టైమ్స్ (7.12.1896) పత్రికల్లో రివ్యూలు రాసినవి.




మద్రాసులో తన ప్రదర్శనలు విజయవంతమవడంతో స్టీవెన్సన్ బ్రిటిష్ ఇండియా మొత్తంగా పర్యటించి మూకీ షోలు వేయాలని మద్రాసు నుండి బయలుదేరాడు. ఆ పర్యటనలో ముందుగా వచ్చింది హైదరాబాదుకు. అది 1897లో వస్తూనే ఆగస్టులో హైదరాబాదు జంట నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించాడు. ఈ విషయం 1897 ఆగస్టు 31 నాటి 'మద్రాస్ మెయిల్' డైలీలో రిపోర్ట్ అయినవి. ఈ స్టీవెన్సన్ హైదరాబాదులో ధనవంతుల కుటుంబాల వారికి ప్రయివేటుగా కూడా ప్రదర్శనలు వేసి మూకీలు చూపారు. ఈ విషయాలన్నీ స్టీఫెన్ హ్యూస్ తన బయోస్కోప్ సంచికలో "వెన్ ఫిల్మ్ కేమ్ టూ మద్రాస్'' అధ్యాయంలో రాశారు. ఈ స్టీఫెన్ హ్యూస్ 2010 ఫిబ్రవరి 14 నాటి ది హిందూలో కూడా ఇన్సెర్ట్స్ ఆఫ్ బిగినింగ్స్ పేర రాసిన వ్యాసంలో హైదరాబాదులో ప్రదర్శనలు నిర్వహించిన స్టీవెన్సన్ ఆ తరువాత బెంగుళూరు తదితర ప్రాంతాల్లో లెక్కలేనన్ని మూకీల ప్రదర్శనలిచ్చాడు. ఆ తర్వాత మద్రాసు వెళ్లిన స్టీవెన్సన్ అక్కడి తన ఫోటోగ్రాఫిక్ స్టోర్ ని 1898లో కలకత్తాకు మార్చారు. ఆ తరువాత బంగ్లాదేశ్లోని "ఢాకా"లో కూడా మూకీల ప్రదర్శనలు ఇచ్చినట్లు 'ది హిందూ' వ్యాసంలో రాశాడు.

హైదరాబాదులో మూకీల సంగతులు ప్రొఫెసర్ స్టీవెన్సన్ రాక (1897) కన్నా ముందుగా సెప్టెంబర్ మొదటి వారం 1896లోనే సికిందరాబాదు నుండి చిన్న చిన్న మూకీలతో కూడిన పీప్ హౌల్ షోలు మద్రాసు మీదుగా దేశ వ్యాప్తంగా వెళ్లినట్లు 'బయోస్కోప్' గ్రంథంలో హ్యూస్ రాశారు. ఈ పీప్ హోల్ షోస్‌కు సంబంధించిన రివ్యూలను 1896 సెప్టెంబర్ 2న మద్రాస్ మెయిల్ దినపత్రికలో ప్రచురించారు. దీంతో హైదరాబాదులో సినిమా చరిత్రకు 126ఏళ్ళ చరిత్ర ఉన్నదని రుజువైతున్నది..

హైదరాబాదులో తొలినాటి మూకీలకు సంబంధించిన సందర్భాలన్నీ ఆరవ నిజాం మహబూబ్ అలీఖాన్ (1866-1911) పరిపాలనా కాలంలో జరిగినవి. మహబూబ్ అలీఖాన్ అసఫ్ జాహీ హైదరాబాదు రాజ్యంలో విప్లవాత్మక

వ్యాసం



మార్పులకు శ్రీకారం చుట్టినవాడు.

120 ఏళ్ల కిందటనే ఆధునికంగా ఆలోచించి పరిపాలన సాగించిన ఆరవ నిజాం మహబూబ్ పాషాకు సినిమాగాలి సోకకుండా ఉండదు. తప్పకుండా 1897, ఆ తరువాతి కాలంలో మూకీలు చూసే వుంటారు. ఒకవేళ ఆయన మూకీలనే చూడక పోయివుంటే 1908 సెప్టెంబర్ హైదరాబాదులో ఒక్కరోజుననే దాదాపు 17 అంగుళాల భారీ వాన కురవడంతో వరదలు వచ్చి నగరం మూడు భాగాలు కొట్టుకుపోయి జనజీవనం అస్తవ్యస్తమై నప్పుడు ఈ వరదల బీభత్స దృశ్యాలను దృశ్యబద్ధం చేయడానికి కలకత్తాకు చెందిన జె.ఎఫ్. మదన్ బృందాన్ని రప్పించేవాడు కాదు. ఆ దృశ్యాలను ప్రజల కోసం బహిరంగ ప్రదర్శనలుగా వేసి చూపారు. వీటి గురించి ఆ రోజుల్లో ప్రజలు కథలు కథలుగా చెప్పుకునేవారు. మరికొందరేమో జె.ఎఫ్ మదన్ కాదు బొంబాయికి చెందిన ఎక్సెల్సియర్ సినిమాటోగ్రాఫ్ సంస్థకు చెందిన ఒక కెమెరామెన్ వచ్చి వీటిని చిత్రీకరించారని కూడా పేర్కొంటున్నారు. అయితే జె.ఎఫ్. మదన్ బృందమే వచ్చిందనడానికి బలమైన రుజువు ఆ తరువాత 1922లో హైదరాబాదులో మూకీలు తీయడానికి కలకత్తా నుండి మదన్ శిష్యుడు ధీరేన్ గంగూలీ రావడం..

ఇంత గొప్ప పేరు ప్రఖ్యాతులున్న మదన్ సిఫారసు వల్లనే ధీరేన్ గంగూలి హైదరాబాదు వచ్చి మూకీలు తీశారు. తీసిన మూకీలకన్నా ముందు బ్రిటీష్ ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ విలియమ్స్ సికింద్రాబాద్ లో 1910లో తన కుటుంబానికి 8 ఎం.ఎం. కెమెరాతో చిన్న చిన్న సినిమాలు చూసే వసతిని సమ కూర్చుకున్న విషయం మొన్నటిదాకా చరిత్రకందనే లేదు. ఆయనే ఆ తర్వాత 16 ఎం.ఎం. కెమెరాను కూడా తన ఇంట్లో సినిమాలు చూసేందుకు ఏర్పాటు చేసుకున్నారు..

ముందుగా చెప్పుకున్నట్లు వ్యాపార వాణిజ్య కేంద్రంగా ఉండటం వల్ల బొంబాయి దానంతటదే భారతీయ సినిమాకు కేంద్రమైంది. ఫాల్కే 'రాజా హరిశ్చంద్ర' (1913) తరువాత మూకీల నిర్మాణం కోసం చాలా సంస్థలు ఆవిర్భ వించినవి. హిందుస్తాన్, ఇంపీరియల్, కోహినూర్, కృష్ణా, స్టార్ ఫిలింస్ విక్టోరియా ఫాతిమా ఫిలింస్ వంటి సంస్థలు బొంబాయిలో నెలకొన్నవి. ఇంకా పూణె, కొలహాపూర్, కలకత్తా, నాసిక్, మద్రాసుల్లో కూడా చాలా సంస్థలు వచ్చినవి. ఈ క్రమంలోనే సినిమాల పట్ల ఆకర్శితుడైన ఏడవ నిజాం 1922లో కలకత్తా నుండి హైదరాబాదుకు పిలిపించి మూకీ చిత్రాల నిర్మాణం చేయించారు. ఈ ధీరేన్‌కు 1916లోనే హైదరాబాదుతో పరిచయం. ఇక్కడి ఆర్ట్స్ కాలేజీలో ప్రిన్స్ పల్ గా పనిచేసి వెళ్ళారు. కలకత్తా బిలాత్ ఫేరాత్, యశోనందన్ వంటి మూకీలు తీసి ఉన్నారు.

హైదరాబాదుకు వస్తూనే గన్ ఫౌండ్రీలో సినిమా నిర్మాణాల కోసం లోటస్ ఫిలిం స్టూడియోను ఏర్పాటు చేసుకున్నాడు. మరోవైపు నిజాం షూటింగుల కోసం తమ భవనాలను వాడుకోమన్నారు. ధీరేన్ 1922లో "లోటస్ ఫిలిం కంపెనీ" ప్రారంభించి తొలుత "చింతామణి"మూకీ చిత్రాన్ని తీసి జూలై21న విడుదల చేశారు. ఆ తరువాత మరో నాలుగు సైలెంట్ చిత్రాలు తీశారాయన. అవి ఇంద్రజిత్, మేరేజ్ టానిక్, సాధూ ఔర్ సైతాన్, ది లేడీ టీచర్. ఆ తమ సినిమాల ప్రదర్శనకోసం














రెండు థియేటర్లు కట్టాడు. వాటిలో ఒకటి లైట్ హౌజ్. 1923లో హరగౌరి, యయాతి, స్టెప్ మదర్ లేదా బి మాత. ధీరేన్‌ను చూసి జె.ఎఫ్. మదన్ రెండు థియేటర్లు కట్టించినట్లు చెబుతారు.ఐతే వాటి వివరాలు తెలిసిరావడం లేదు. సినిమాలలో ఆడవాళ్ళు నటించాల్సిన అవసరం ఉందని తన మూకీలలో వారిని నటింప జేశారు. అన్నీ బాగా జరుగుతున్న తరుణంలో బొంబాయిలో అర్దేషిర్ ఇరానీ తీసిన మూకీ "రజియా బేగం"ను 1924లో హైదరాబాదులో రిలీజ్ చేశాడు. ఒక ముస్లిం రాణి హిందువును ప్రేమించే కథ ఇది. కానీ ఇక్కడ ముస్లింలకు ఇది నచ్చలేదు. నిజాంకు ఫిర్యాదు చేశారు. ముస్లిం పక్షపాతియైన నిజాం ఆగ్రహించి ధీరేన్‌ను 24 గంటలలోగా హైదరాబాదును విడిచి వెళ్లవలసిందిగా ఆదేశించాడు. చేసేది లేక కలకత్తా తిరిగి వెళ్లిపోయారు. హైదరాబాదులోనే ఏకబిగిన సినిమాలు తీయాలనుకున్న ధీరేన్‌కు ఇది పెద్ద ఎదురు దెబ్బ. కలకత్తావెళ్ళి అక్కడ మూకీలు, టాకీలు తీసిన ధీరేన్ భారతీయ సినీ పితా మహులలో ఒకరుగా చరిత్ర కెక్కారు. ధీరేన్ సినిమాలలోకి రావడం హైదరాబాదులో మూకీల కాలంలో సినిమా నిర్మాణపు తొలి సంగతులు తెలుస్తాయి. అంతేకాకుండా 1922-24 మధ్యకాలం ధీరేన్‌ను అధ్యయనం చేయడానికి మాత్రమే కాదు, హైదరాబాదు స్టేట్ సామాజిక పరిస్థితులను కూడా అర్థం చేసుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. ఏది ఏమైనా ధీరేన్ గంగూలీ హైదరాబాదులో తొలుత మూకీలు తీసి తెలంగాణ సినీ పితామహుడుగా కూడా చరిత్ర కెక్కారు. ఆ తరువాత 1929లో హైదరాబాదులో మహావీర్ ఫోటో ప్లేస్ సంస్థ నెలకొని వరుసగా పిత్రు ప్రేమ్ (1929), ఎ ప్రిన్స్ ఆఫ్ ద పీపుల్ అవర్రై, యాన్ ఐడియల్ ఉమెన్ (1930), బ్లాక్ ఈగిల్, కిడ్నాప్డ్ బ్రైడ్, నిర్దర్ నిరు. సరోజ్ కుమారి, (1931) చిత్రాలు తీశారు. ఆ తరువాత 1931లో నేషనల్ పిలిం కంపెనీ సంస్థ మొదలై హీరో ఇఫ్ ద వైల్డ్, థీఫ్ ఆఫ్ ఇరాక్, (1931), దేశబంధు, మేరీమా (1931) మూకీలు తయారైనవి. ఇలా మొత్తం ధీరేన్ గంగూలీ తీసిన ఎనిమిదింటితో కలిసి మొత్తం 20 సైలెంట్ చిత్రాలు హైదరాబాదులో తయారైనవి. హైదరాబాదులో సినిమాల సెన్సార్ కూడా మూకీల నిర్మాణంతో పాటే మొదలైంద నవచ్చు. 1922లో 'పతిభక్తి' సినిమా పట్ల నగరంలో అభ్యంతరాలు రావడంతో నిజాం సెన్సార్ షిప్పు ప్రారంభించారు. ఆ తరువాత రజియాబేగం, 'హీర్ రాంఝా' వంటి సినిమాలు ఇక్కడ సెన్సార్‌కు గురైనవి. ఈ నేపథ్యంలో హైదరాబాదు స్టేట్ నుండి సినిమాల్లో పని చేయడానికి ఉత్సాహపడి బొంబాయి వెళ్లడం 1925కు ముందే మొదలైనట్లు తెలుస్తున్నది. అలా హైదరాబాదు స్టేట్ నుండి బొంబాయి వెళ్లిన మొదటి వాడు ఎం.ఏ.రెహమాన్. పూర్తి పేరు మహమూద్ అబ్దుల్ రెహమాన్. ఈయన అవిభాజ్య హైదరాబాద్ స్టేట్ లోని ఔరంగాబాద్‌కు చెందినవాడు. చిన్నతనంలోనే సినిమాల పట్ల ఆకర్షితుడైన రెహమాన్ బొంబాయి రైలెక్కేశాడు. అది మూకీల కాలం, తెలిసీ తెలియని వయసు. అయినా సినిమాల్లో చేరాలనే ఉత్సాహంతో స్టూడియోలన్నీ తిరిగి చివరికి 1925లో నాడియా వారి వాడియా మూవీటోన్ ఫిలిం స్టూడియోలో లైట్ బాయ్ గా రోజుకు రూపాయి కూలికి చేరడంతో రెహమాన్ సినీ జీవితం మొదలైంది. మూకీల కాలంలోనే తన 19వ ఏటనే 1929లో 'మిలన్దినార్' అనే మూకీ సినిమాకు తొలిసారిగా కెమెరామెన్ గా పని చేశాడు. దాంతో బాలీవుడ్లో పని చేసిన తొలి తెలంగాణవాడుగా, టెక్నిషియను గా కూడా ఎం.ఎ.రెహమాన్ చరిత్రకెక్కారు.

ఈ అంశాలన్నీ కూడా బొంబాయికి తొలుత వెళ్లిన తెలుగువాడు ఎల్.వి. ప్రసాద్ కాదని, అతను అవిభక్త హైదరాబాద్‌కు చెందిన ఎం.ఏ.రెహమాన్ అని తేటతెల్లం చేస్తున్నవి. మూకీల కాలంలో ఈయనొక్కరే కాదు ఈ రెహమాన్ కాలంలోనే సరోజీదేవి చెల్లెళ్లయిన మృణాళినిదేవి, సునాళిని దేవిలు హిమాంశురాయ్ తీసిన 'ది లైట్ ఆఫ్ ఆసియా (1925)లో నటించిన విషయం ఎవరికీ తెలియదు. వీరి తరువాతనే వెళ్లిన హీరోయిన్ రాంప్యారీ, హీరో పైడి జైరాజ్ కూడా ఎల్.వి.ప్రసాద్ కన్నా ముందుగానే సినిమాల్లో నటించడానికి బొంబాయి వెళ్లారు.

ఇలా మూకీల కాలంలో హైదరాబాదులో జరిగిన చాలా విషయాలు చరిత్రకందకుండా పోయినవి. వాటిని హైదరాబాదులో మూకీల నిర్మాణానికి నూరేళ్లైన సందర్భంగా తవ్వి పోసుకుందాం.

కథ

# బతుకు నాటకం

అగ్రవర్ణంలో కూడా కులమతాల
పట్టింపు లేని వ్యక్తిత్వాలు...



జ్వలిత
99891 98943

తెల్లవారి మాములుగానే మొదలయింది. ఆటోలో రోజూలానే పనికి బయలు దేరింది గౌరి. ఆటో దిగి నడుచుకుంటూ తాను పనిచేసే భవంతి వైపు చూసింది. మసక చీకటిలో చేతులు చాచి రారా అని పిలుస్తున్న ఊడల మర్రిలా భయపెడతూ కనపడింది.

* * *

ఇంట్లో లైటు వెలుగుతున్నట్టు కిటికీల నుండి తెలుస్తోంది. కానీ గేటు తియ్య లేదు.

గౌరి వచ్చి గేటు తాళం తీసుకొని పని మొదలు పెట్టింది. నీళ్ళ శబ్దానికి, మనిషి అలికిడికి సర్వమంగళ తలుపు తీసింది. గౌరి తన పని తను చేసుకు పోతుంది మౌనంగా. సర్వమంగళ ఒక పని తర్వాత ఒకటి చెప్తూనే ఉంది. ఇల్లంతా దులిపిచ్చింది. సజ్జమీద ఉన్న పాత ఇత్తడి సామాన్లన్నీ చింతపండు పెట్టి తోమిచ్చింది. పని పూర్తయ్యేటప్పటికి పదకొండయ్యింది.

గౌరి బయిలుదేరే ముందు "సాయంత్రం ఐదింటికల్లా రావాలి గౌరీ.. మా అత్తగారు వస్తున్నారని చెప్పాను కదా! అందుకే ఈ రోజు స్కూల్ కు వెళ్ళలేదు. ఆవిడున్నన్ని రోజులు రెండు పూటలూ రావాలి! ఆవిడ విసుక్కున్నా కోపగించు కోవద్దు" చాలా జాగ్రత్తలు చెప్పింది.

గౌరి నిర్వికారంగా చూస్తూ "అలాగే అమ్మగారూ.. జాగ్రత్తగా ఉంటాను. కానీ రోజుకు రెండుసార్లు ఎన్ని రోజులు రావాలి" భయపడుతూనే అన్నది.

గౌరి సాధారణంగా 'అమ్మాయిగారూ' అని పిలుస్తది సర్వమంగళను. కానీ భయపడ్డప్పుడు 'అమ్మగారు' అంటది.

"గౌరీ.. మా అత్తగారు నెల రోజులు ఉంటారు. ఎంతో ఒకంత ఇస్తానులే" అన్నది, ఏదో దయతలచినట్లు.

"మరి నాకు కొంచెం కష్టమైతదమ్మా.. మా ఇల్లు దూరం. ఆటోలు పొద్దున్న సాయంత్రం మాత్రమే దొరుకుతయి. ఇక్కడ నుంచి మా కాలనీకి మధ్యాహ్నం రెండుసార్లు నడవాల్సి వస్తదమ్మా. డబ్బులు పెట్టినా ఆటోలు దొరకవు నాకు ఆసమయంలో" అన్నది గౌరీ.

"ఈ నెల రోజుల కోసం కొత్త వాళ్ళను పెట్టుకోలేము కదా.." సీరియస్‌గా అన్నది సర్వమంగళ.

"సాయంత్రం వరకు ఎవరినన్నా చూడండమ్మా.." బతిమిలాడింది గౌరి.

"చూద్దాంలే.." అన్నది, కానీ 'మధ్యాహ్నం పొయ్యొచ్చుడెందుకు ఇక్కడే ఉండు అనలేదు' సర్వమంగళ. అంటే బాగుండు అని ఎదురు చూసింది గౌరి.

ఆశించిన సమాధానం రాలేదు కానీ.. "మా అత్తగారు అసాధ్యురాలు. ఆవలిస్తే పేగులు లెక్క పెట్టుద్ది జాగ్రత్తగా ఉండాలి, జాగ్రత్తగా మాట్లాడాలి" హెచ్చరికలు చేసింది.

"సరెనమ్మా.. అట్లనే ఉంటా.. నేను వెళ్తున్నా.." అని దారి పట్టింది.

తన బండారం బయట పడుద్దేమోనన్న భయం, ముద్ద దిగట్లేదు. రెప్ప వాలట్లేదు..

'అంతల్నే. ఆ ఉ ఏమయితది, ఈ ఇల్లు కాకపోతే మరొక ఇల్లు దొరుకుద్ది' అనుకుంది.

అమ్మో.. సత్తెం గడప దాటకముందే, అబద్ధం ఐదూర్లు తిరిగొస్తది. నిజానికంటే అబద్ధాలనే నమ్ముతది లోకం. ఒకటికి వంద చేర్చి పరువుతీస్తరు అని భయపడింది.

మిగిలిన ఇళ్ళల్లో పని చేసుకొని ఇల్లు చేరింది దిగులుగా..

తల్లి ఏదో అడుగుతుంటే సమాధానం చెప్పకుండా "అన్నం తిన్నవా..." అని అడిగింది. అన్ని గిన్నెలు మూతలు తీసి చూసింది. తల్లి కూడా అన్నం తినలేదు. వండిందంత అట్లనే ఉన్నది. ఇద్దరికి రెండు కంచాలల్ల అన్నం పెట్టుకొచ్చి, తల్లికొకటిచ్చి, తనొకటి తీసుకుని కూర్చున్నది.

గౌరి తల్లి మౌనంగా లేచి కంచం అందుకుంది. గౌరి గబగబా రెండు ముద్దలు తిని సాపేసుకొని ఒరుగుతూ.. "ఈరోజు నుండి నెలరోజులు రెండు పూటలు పోవాలి. ఒకేళ కన్నంటుకుంటే నాలుగింటికి లేపమ్మా.." అని పండుకున్నది.

నిద్రపట్టలే.. అటు బొర్లి, ఇటు బొర్లి లేసింది. ఇల్లు వాకిలూడ్చి, ఎంగిలి గిన్నెలు కడిగి, రాత్రికి బియ్యం పెట్టింది. నాలిగింటికి ముఖం కడుక్కొని, జడేసు కొని, బొట్టు బిళ్ళ, కుంకుమ, విభూది నుదుటిన పెట్టుకొని, చూపుడేలుతో కుంకుమ పాపిట్ల రాసుకుంది. బిడ్డ తయారయితంటే చూసి "కొత్తిల్లు ఒప్పుకున్నవా బిడ్డా.." అని అడిగింది.

"కాదు పాతదే ఆ బాపనోళ్ళింటికే, సందేళ కూడ పోవాలె. ఇంటామె అత్తొస్తుందట. నెలరోజులుంటదట రెండుసార్లు పనికి రమ్మన్నది.." సమాధానమిచ్చింది.. తల్లి నిట్టూర్చింది.

నల్లపూసలేసుకుంటంటే అడిగింది బిడ్డను "గీ అబద్దం కూడ చెప్పినవా..?" అని.

"కొత్త అబద్దమేంది?".

"పెండ్లయిందని చెప్పినవా? నల్లపూసల దండేసుకుంటన్నవ్?".

"నాకు పెండ్లయిందా..? అయిన మన కులంల నల్లపూసలేస్తర్రా? కొత్త పంచాయితీ మొదలు పెట్టకమ్మా... కూటి కొరకు కోటి ఇద్దెలు" అనుకుంట చెప్పు లేసుకొని బయిటపడ్డది.

ఒక కిలోమీటర్ దూరం నడిచి మెయిన్ రోడ్డు చేరింది. కాసేపు ఆటో కోసం ఎదురు చూసింది, ఆటో రానట్టుంది నడుద్దాం అనుకుంటుండగా వచ్చిన ఆటో ఎక్కింది. మమతా మెడికల్ కాలేజీ దగ్గర దిగి, మళ్ళొక కిలోమీటర్ లోపలికి నడిచి కొత్తకాలనీ చేరుకుంది. గేటు దగ్గరకి వినిపిస్తున్నాయి మాటలు. గేటు తీసుకొని పక్కనుంచి లోపలికి పొయ్యి "అమ్మగారూ.." అని పిలిచింది.

కిచెన్ పక్కనున్న తలుపు తీసింది సర్వ మంగళ. సింక్‌లో గిన్నెలు తీసి ప్లాస్టిక్ టబ్లో వేసి, గుమ్మం దగ్గరకు వచ్చి గౌరి ముందల పెట్టింది. గిన్నెలు తోమి శుభ్రంగా కడిగి తిరిగి గుమ్మం దగ్గర పెట్టి, అరుగులు గచ్చు వాకిలి ఊడ్చి, కడిగి ముగ్గు పెట్టి, చెట్లకు నీళ్ళు పెట్టింది.

"ఇంకేమన్నా పనుందా, వెళ్ళమంటారా.." అన్నది.



* * *

"ఆ..ఆ... అత్తయ్య గారి బట్టలున్నాయి ఉతికేసి వెళ్ళు" అన్నది.

బకెట్లో ఉన్న బట్టలుతికి ఆరేసి, ఇంటిదారి పట్టింది.

* * *

రెండు రోజులు ప్రశాంతంగా తన పని తను చేసుకుని ఇంటికొచ్చింది గౌరి. ఆ రెండు రోజులు శని, ఆది వారాలు సెలవు ఉండటంతో ఇంట్లోనే ఉన్నది ఇంటామె. మూడోరోజు సర్వమంగళ స్కూల్ కు బయలు దేరింది.

**తల్లి ఏదో అడుగుతుంటే సమాధానం చెప్పకుండా "అన్నం తిన్నవా..." అని అడిగింది. అన్ని గిన్నెలు మూతలు తీసి చూసింది. తల్లి కూడా అన్నం తినలేదు. వండిందంత అట్లనే ఉన్నది. ఇద్దరికి రెండు కంచాలల్ల అన్నం పెట్టుకొచ్చి, తల్లికొక టిచ్చి, తనొకటి తీసుకుని కూర్చున్నది. గౌరి తల్లి మౌనంగా లేచి కంచం అందుకుంది. గౌరి గబగబా రెండు ముద్దలు తిని సాపేసుకొని ఒరుగుతూ.. "ఈరోజు నుండి నెలరోజులు రెండు పూటలు పోవాలి. ఒకేళ కన్నంటుకుంటే నాలుగింటికి లేపమ్మా.." అని పండుకున్నది.**

* * *

గౌరి పని పూర్తి కాలేదు. టిఫిన్ చేసినవి, లంచ్ బాక్సులు కట్టిన తర్వాత హాట్ బాక్సుల్లోకి సర్ది, గిన్నెలు రెండోసారి వేసింది. వాటిని కడిగి, బట్టలుతకాలి.

యజమానురాలు వెళుతూ "గౌరీ గేటు జాగ్రత్తగా తాళం వేసి వెళ్ళు" అని చెప్పింది.

సర్వమంగళ అత్త మామ హాలులో సోఫాలో కూర్చుని పేపర్ చదువు తున్నారు. గౌరి గిన్నెలు కడగి స్టీల్ స్టాండ్లో సర్ది గుమ్మంలో పెట్టి, బట్టలు ఉతకడానికి నీళ్ళు పట్టుకుంటుంది.

"ఓ పచ్చ చీరమ్మాయ్" అని వినపడితే వెనక్కి తిరిగింది గౌరి. తన వంటి మీద పచ్చ చీరను చూసుకున్నదొకసారి..

"ఆ పంపు కట్టేసి ఇటురా" అన్నది సర్వమంగళ అత్తగారు గాయత్రి దేవి,. 'చచ్చానురా భగవాన్ ఏం జరుగుతుందో..' అని మనసులో అనుకుంటూ.. "ఏంటమ్మ

గారూ..'' అంటూ వచ్చింది గౌరి.

"అమ్మగారూ.. అని పిలవక్కరలేదు కానీ.. పెద్దమ్మా అని పిలువు చాలు. ఆ... నీ పేరంటన్నావు'' అంది గంభీరంగా..

"గౌరీలక్ష్మి అండీ'' అన్నది.

"నీపేరు బాగుంది నీలాగే.. నీ భాష కూడా బాగుంది. గౌరీ ఇట్రా.. ఈ గిన్నెల స్టాండు వంటింట్లోకి తెచ్చి, గిన్నెలన్నీ సర్దెయ్యి. బట్టలుతికిన నీళ్ళు వాటి మీద పడతాయి కదా...'' అన్నది.

"లోపలికి రమ్మంటారా అమ్మా..''.

"రాకుండ ఎట్లా పెడ్తావమ్మా.. మాజిక్ చేస్తావా..? " అన్నది నవ్వుతూ..

గౌరి కూడా నవ్వుతూ లోపలకి పట్టుకొచ్చి గిన్నెలన్నీ సర్దేసి, వెళ్ళి బట్టలుతికింది.

"వాషింగ్ మిషన్ ఉంది కదా.. నీతో ఉతికిస్తుంది ఎందుకూ..?'' గాయత్రమ్మ ఆరా తీసింది.

'చచ్చిందిరా గొర్రె .. ఏమి చెప్పాలె ? ఏం చెప్తే ఏమి గోలో' అనుకొని.

"ఏమోనమ్మా నాకు తెలియదు'' అన్నది గౌరి వినయంగా.

"హ.. హ..హ..'' అని గట్టిగా నవ్వి, "ఈ మధ్య జీతం పెంచమన్నావా?'' అడిగింది.

"ఔనమ్మా.. సంవత్సరం అయిపోయింది కదమ్మా.. జీతం పెంచండమ్మా.. అన్నాను'' అంది.

"ఎంత పెంచింది?''

"ఐదొందలమ్మా..''.

"పెంచినంక బట్టలు ఉతకమ న్నదా..?''.

"ఔనమ్మా.. మీకెట్లా తెలిసిందమ్మా'' అన్నది. గౌరికి బెరుకు తగ్గింది.

"మా మంగళ తెలివి నాకు తెలుసు కదా..'' అంటూ మళ్ళీ గట్టిగా నవ్వింది పెద్దావిడ. గౌరి పని ఆపి మాట్లాడటం గమనించి

"సరేలే.. పని చేస్తూ మాట్లాడు. నీ సమయం వృథా కాకుండా..''

గాయత్రమ్మ సూచనతో మళ్ళీ బట్టలకు బ్రష్ వెయ్యడం మొదలు పెట్టింది గౌరి.

"గౌరీ.. ఏ ఊరు మీది..? నీ భాష కూడా తేడా ఉన్నది..'' అన్నది పెద్దావిడ.

"భద్రాచలం దగ్గర 'చెర్ల' మొత్తం అడివే ఉంటదమ్మా అటువైపు'' అన్నది గౌరి కొంచం భయం తగ్గి.

"ఆహా.. మీ నాన్న ఏం పని చేసేవాడు?''.

"గుళ్ళో పూజ..'' రెడీ చేసి పెట్టుకున్న సమాధానం.

"పూజారా..? ఏమిటోరు..?''

"బ్రాహ్మలం..'' మళ్ళీ భయం జొరపడ్డది.. "ఔనా.. మేము కూడా బ్రాహ్మలమే.. చెప్పిందా మా సర్వమంగళ..?''

"లేదమ్మ గారూ..''

"అదిగో మళ్ళీ అమ్మగారూ'' అంటున్నావు.. 'పెద్దమ్మ' అనమన్నా కదా''.

సరే అన్నట్టు తలూపింది గౌరి..

"మీ గోత్రమేమిటో..''.

"భరద్వాజ గోత్రమండి..'' తడుము కోకుండా చెప్పింది గౌరి.

ఇంతలో "గాయత్రీ నీ ఫోన్ కూస్తోంది'' పిలిచాడు పెద్దాయన. పక్షుల అరుపులను రింగ్ టోన్ పెట్టుకుందావిడ.

"ఆ వస్తున్నా.. ఎవరో చూడొచ్చు కదా..'' అంటూ ఫోన్ తీసింది.

గౌరి పనిలో పడింది.. వామ్మో పెద్దావిడ సామాన్యురాలు కాదు.. అనుకొని.. గట్టిగా గాలి పీల్చుకున్నది, గండం తప్పినట్టు.

ఫోను మాట్లాడుతూ మళ్ళీ వచ్చి డైనింగ్ టేబుల్ కుర్చీ మీద కూర్చుం దామె. గౌరికి పెద్దామె మాటలు వినపడుతూనే ఉన్నాయి.

"ఊరుకో లక్ష్మీ.. పదే పదే యాడీ.. యాడీ అని ఏడ్వకు. నీకే ఏభై ఏళ్ళొచ్చినయి. మీ అమ్మ ఇంకా నీతో ఉంటదా..'' అంటూ లంబాడీ భాష తెలుగు కలిపి మాట్లాడుతున్నది.

గౌరికి మళ్ళీ భయం మొదల య్యింది.. వామ్మో నిజంగనే ఫోన్లో మాట్లాడుతుందా.. తన మీద అనుమానం వచ్చిందా అర్థం కాలేదు..

కంగారుగా బట్టలుతకడం పూర్తి చేసి, గాయత్రమ్మ ఫోన్ మాట్లాడుతుండగా "వెళ్ళొస్తా.. అమ్మ గారు'' అని చెప్పి బయలు దేరింది.. దేవుడా ఈమె సామాన్యురాలు కాదు. కానీ ఇంటామె తల్లికి ఉన్న పట్టింపులు లేవు, కొంత సంతోషమే అనుకుంది.

మిగిలిన ఇళ్ళలో పని చేసుకొని తొందరగా ఇల్లు చేరింది. బిడ్డ ముఖంలో నిన్నటి దిగులు కనపడక పోతే గౌరి తల్లికి కూడా సంబరమనిపించింది. గౌరి కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చి, చీర విప్పి నైటీ వేసుకొని, తల్లికి తనకు అన్నం పెట్టుకొని వచ్చి కూర్చున్నది.

అన్నం తింటూ బిడ్డను గమనించింది తల్లి. కానీ ఏ ప్రశ్నలు వెయ్యలేదు. చెప్పదలుచుకుంటే తనే చెప్తుందిలే అనుకుంది.

★ ★ ★

అన్నం తిని గిన్నెలు కడిగేసి, చాప పరుచుకొని నడుం వాల్చింది.

"అమ్మా నిద్రపడితే లేపు నాల్గింటికే పోవాలె'' అన్నది గౌరి.

"సరే.. నేను లేపుతా పండుకో..'' అన్నది గౌరి తల్లి. గౌరి ప్రశాంతంగా పండుకొని నిద్రపోయింది. తల్లికి కారణం అర్థం కాలేదు. తల్లి లేపకముందే లేచి మళ్ళీ చీర కట్టుకొని రోజుట్లానే బొట్టు కుంకుమ విభూతితో పెట్టుకొని పనికి బయలుదేరింది. షరామామూలే మైన్ రోడ్డు వరకు నడిచి ఆటో ఎక్కింది. వెళ్ళేసరికి ఐదయింది. గేటు తీసుకొని లోపలికి పోయి, వాకిలూడ్చి, అరుగులు కడిగి మొక్కలకు నీళ్ళు పెట్టేటప్పటికి అర్థగంట పట్టింది.

గాయత్రమ్మ బయటకొచ్చి''ఓ భరద్వాజ గోత్రం అమ్మాయి. ఇట్రా..'' అన్నది. గౌరి పలకలేదు. అసలు పిలుస్తున్నది తననే అని ఆమెకు అర్థంకాలేదు..

"భరద్వాజ సంతతి గౌరీలక్ష్మి.. ఇటు రావమ్మా..''అన్నది.

ఆమె ఎటకారంగా పిలిచేది తననే అని గౌరికి అర్థమయింది. తన నాటకం బయట పడుద్దేమోనని భయపడుతూనే..

కథ

"వస్తున్నా అమ్మగారూ.." అంటూ వచ్చింది.

"అమ్మగారు.. అనవద్దు అన్నానా...?" అన్నది తర్జనిగా.

"సరే పెద్దమ్మా.. ఏంటో చెప్పండి" అన్నది గౌరి.

"చేతులు కడుక్కుని, నాలుగు కప్పులు మంచి అల్లం టీ పెట్టు" అన్నది.

గౌరి తెల్ల మొఖం పెట్టి చూస్తూ నిలబడ్డది..

"కదులూ.. టీ పెట్టడం రాదా నీకు?"..

"వస్తదమ్మా.." అని లోపలికొచ్చి,

"ఫ్రిజ్ తెరచి పాలగిన్నె తీసి, పనికి ఉపక్రమించింది. అల్లంవేసి చిక్కగా టీ పెట్టి, పొంగి పోకుండా స్టౌ దగ్గరే నిలబడి, పెద్దావిడను గమనించింది.

డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చొని ఎవరికో ఫోన్ చేసి మాట్లాడుతుంది.

"ఒరే బాలూ.. మీ అమ్మను నువ్వే జాగ్రత్తగా చూసుకోవాలె.. డర్ లాగొచ్చె.. కాదు. మార్ వాత్ సామ్చో.." అంటున్నది.

గౌరికి ఆశ్చర్యం, సంతోషం ఆకాశాన్నంటాయి. పెద్దామె ఈ రోజు కూడా తెలుగు, లంబాడీ, ఇంగ్లీషు భాషలు కలిపి ఎవరికో కాసేపు ధైర్యం చెప్పి ఫోన్ పెట్టేసింది.

"టీ ఇవ్వవే గాయత్రీ... ఆలస్యంగా తాగుతే నిద్ర పట్టదు.. నీ కౌన్సిలింగ్ తర్వాత చేద్దువు కానీ.." కేకేశాడు పెద్దాయన.

"వస్తున్నా.. వస్తున్నా.. జోరు తగ్గించండి " అంటూ.. వంటింటి వైపు చూసి,

" ఏమయిందమ్మా గౌరమ్మా.." అని కేకేసింది..

"అయ్యిందమ్మా.. అయి పోయింది నాలుగు కప్పుల్లో. పొయ్యమంటారా.." అన్నది గౌరి.

"ఏదీ.. మీ మంగళమ్మ ఇంకా రాలేదుగా.. తనకు ఫ్లాస్కులో పోసి, మన ముగ్గురికీ కప్పుల్లో పొయ్యి" అన్నది.

గౌరి వాళ్ళిద్దరికి కప్పుల్లో పోసి డైనింగ్ టేబుల్ మీద పెట్టింది. గాయిత్రమ్మ ఒక కప్పు తీసుకొని, ఈ కప్పు ఆ సోఫాలో ఉన్న పెద్దసారుకిచ్చిరా" అన్నది.

"నీ కప్పేది. నీకు వద్దా టీ.." అన్నది మళ్ళీ.

ఆశ్చర్యంగా గౌరి పెద్దాయనకు టీ అందించి వచ్చి, "తాగుతానమ్మా.. నా కప్పు బయటుంది తెచ్చుకుంటా .." అంటూ బయట కప్పు తెచ్చుకుంది.

"ఓ.. రెండు గ్లాసుల వ్యవహారమా. నీవు కూడా బ్రాహ్మణ పిల్లవని మా మంగళకు తెలవదా? నీకు అవమానంగా లేదా?" అన్నది గాయత్రమ్మ నవ్వుతూ.

ఆవిడ నవ్వుతూ మాట్లాడినా గౌరికి డైనమేట్లు పేలుతున్నయి గుండెల్లో.

'తన మాటలు నమ్మి ఇంట్లోకి రమ్మంటుందా.. లేదా ఎవరైనా ఆమెకు ఒకటేనా.. తన ముందు లంబాడి భాష మాట్లాడుతుంది. కావాలనే మాట్లాడు తుందా.. తన సంగతి పసిగట్టిందా' గౌరికి అర్థం కాలేదు.

"గౌరీ.. ఏంటి ఆలోచిస్తున్నావు. మా మంగళ ఆరింటికి వస్తానన్నది. ఎప్పటి లాగే, గిన్నెలు బయట పెట్టి వెళ్ళు. నేను నిన్ను లోపలికి రానిచ్చానని తెలవనవసరం లేదు. అట్లాగే నేను ఫోన్లో లంబాడి భాష మాట్లాడేది నువ్వేమి వినలేదు.." అర్థమ యిందా అన్నది గాయత్రమ్మ. ఈ ట్విస్టుతో షాకయింది గౌరి. సరే అన్నట్టు తలూపింది. ఆమె చెప్పి నట్టు గిన్నెలు తోమి బయట పెట్టి, "వెళ్ళొస్తానమ్మా.." అంటూ, గేటుకు తాళం వేసి ఇంటి దారి పట్టింది.

అంతా అయోమయంగా ఉంది. తల్లితో చెప్పాలా వద్దా తెలవట్లేదు. మౌనంగా ఇంటికి చేరి, తనపని తాను చేసుకుంటోంది.

★ ★ ★

వారం రోజులు గడిచినయి యథావిధిగా.. గౌరికి బెరుకుపోయింది గాయత్రమ్మ దగ్గర. ఆమెతో చనువుగా మాట్లాడుతోంది.

ఆ కబుర్లలో తెలిసిందేమిటంటే- గాయత్రమ్మ టీచర్‌గా పని చేసి కర్నూలులో రిటైరయ్యింది. ఆమె భర్త బ్యాంకు మేనేజర్ గా రిటైరయ్యాడు. ఆయనకు గుండె నొప్పి వస్తే స్టంట్ వేశారు కర్నూలులో.. కొన్నాళ్ళు తన దగ్గరకు రండని కొడుకు పిలిస్తే వచ్చారు. సర్వ మంగళ తల్లికున్నట్టు, ఈమెకు ఛాదస్తాలు లేవు. పైగా అందరినీ సమానంగా చూసే గొప్పగుణం గాయత్రమ్మది.

పుట్టుకతో ఎవరూ గొప్ప, తక్కువ ఉండరని నమ్మినది. ఆమెకు తన దగ్గర చదువుకున్న పిల్లలతో మంచి సంబంధా లున్నాయి. వారి కష్టసుఖాలు ఈమెతో చెప్పుకుంటారు. రిటైర్ అయినంక కూడా వారికి సాయం చేస్తుంటది. వాళ్ళలో సుగాలీల పిల్లలు కూడా ఉన్నారు.

గాయత్రమ్మ అప్పుడప్పుడు గౌరిని భరద్వాజ గోత్రం అమ్మాయని పిలుస్తుంటే గమ్మత్తుగా ఉండేది.

దాదాపు రెండు సంవత్సరాల నుండి చేస్తున్నా సర్వమంగళ దగ్గర లేని చనువు గాయత్రమ్మ దగ్గర ఏర్పడింది. గౌరి భయపడ్డట్టు ఏమి జరగకుండా.. ఆమె నాటకం రక్తి కడుతూ ఇరవై రోజులు గడిచిపోయినాయి.

★ ★ ★

ఆ రోజు ఆదివారం అందరూ ఇంట్లోనే ఉన్నారు. వాళ్ళ మాటలను బట్టి ఇంకో పది రోజుల్లో గాయత్రమ్మ దంపతులు వాళ్ళ ఊరు వెళ్ళిపోతారు. ఆ రోజు బస్సు టికెట్లు బుక్ చేసుకున్నారు.

"ఇంకొన్నాళ్ళు ఉండవచ్చు కదా.. అత్తయ్యగారూ.. ఇంకో పదిహేను రోజుల్లో మా అమ్మా వాళ్ళు కూడా వస్తారు. మీరంతా కలిసి ఉంటే నాకెంత బాగుంటుందో" అంటుంది కోడలు.

అత్తగారు నవ్వి "ఊరుకో మంగళా ఇంకెన్నాళ్ళుంటాము. మీ మామయ్య గారిని డాక్టర్ చెకప్‌కు తీసుకెళ్ళాలి కదా?" అన్నది. వాళ్ళ మాటలు వింటుంటే గౌరికి వింతగా అనిపించింది. సర్వమంగళ మాటల్లో అబద్ధం కంటే తను చెప్పే అబద్ధం చాలా చిన్నదనిపించింది. ఆమెకు అత్తగారుండటం ఇష్టం లేదు. ఆ విషయం గాయత్రికి కూడా తెలుసు.

కథ

సాయంత్రం పనికి వచ్చినప్పుడు గాయత్రమ్మతో కాసేపు కూర్చొని కష్టం సుఖం చెప్పుకునేది గౌరి. వాళ్ళు ఎల్లి పోతారంటే గౌరికి బాధగా ఉన్నది. అసలు నిజం గాయత్రమ్మకు చెప్పాలనుకున్నది. చెప్పటమెట్లా అన్నదే ఛాలెంజ్.

★ ★ ★

ఒక రోజు సాయంత్రం పని అయిపోయిన తర్వాత గాయత్రమ్మ దగ్గర కూర్చొని సన్నజాజులు అల్లుతోంది. ఆమె మొగ్గలను అటురెండు ఇటురెండు పెట్టి అందిస్తున్నది.

"అమ్మా.. పెద్దమ్మా.. మీకొక నిజం చెప్పాలండీ... మీకొక అబద్ధం చెప్పిన. మీకే కాదు మీ కోడలిగారికి కూడా అబద్ధం చెప్పిన. నాకు సిగ్గనిపిస్తోంది" అన్నది గౌరి అపరాధ భావంతో.

"ఓహో.. నువ్వు అబద్ధాల కోరు వన్న మాట. బ్రాహ్మలు అబద్ధాలు చెప్పవచ్చునా.. అందునా భరద్వాజ గోత్రస్తులు చెప్పవచ్చునా" అన్నది గాయత్రమ్మ నవ్వుతూ..

"ఔనామ్మా.. నాకు తెలవదు. మీరు క్షమిస్తానంటే నిజం చెప్తానమ్మా. మీరు నన్ను క్షమించాలి" అని పూలదండ పక్కకు పెట్టి గాయత్రమ్మ కాళ్ళు పట్టుకుంది.

"అయ్యయ్యో.. పిచ్చి పిల్లలా వున్నావు. ఇదేం పని?" అని గౌరి చేతులు పట్టుకుని కాళ్ళు వెనక్కి జరుపుకుంది. "ఎవరూ సరదాకి అబద్ధాలు చెప్పరు. నేరగాళ్ళు, మోసగాళ్ళు తప్ప. నువ్వంత బాధ పడనవసరం లేదు. ఇంతకీ ఏమిటదీ..?" అన్నది పెద్దావిడ.

"ఏం లేదమ్మా మేం బ్రామ్మలం కాదమ్మా.."

"ఓ అదా.. అది నాకు తెలిసిందే.." అన్నది గట్టిగా నవ్వుతూ..

"తెలుసా ఎట్లా తెలుసమ్మా.." ఆశ్చర్యంగా అన్నది గౌరి.

"తర్వాత చెప్తాను కానీ.. ఇంతేనా ఇంకేమైనా ఉన్నదా?" గాయత్రమ్మ నవ్వుతూ..

"ఇంకా.. మేము లంబాడీలమమ్మా.." అన్నది తలొంచుకొని.

"అది కూడా తెలుసు.. ఇంకా" అంటూ కళ్ళెగరేసింది పెద్దావిడ ఛాలెంజ్ చేస్తున్నట్టు.

"ఇంకేమి లేదమ్మా. ఈ రెండే అబద్ధాలు.. మీకెట్లా తెలుసు మేము లంబాడీలమనీ.. చెప్పండమ్మా.." బతిమిలాడింది.

"చెప్తాను.. నేను ఫోనులో మీ భాష మాట్లాడి నప్పుడల్లా.. నీ కళ్ళు వెలిగి పోయేవి.. నా మాటలు జాగ్రత్తగా వినడం గమనించాను. కొంత సందేహం ఉన్నా, తేల్చుకుందామని ఎదురు చూస్తుండగా.. నేనొచ్చినంక వారం రోజులకు తడి నేల మీద జారిపడ్డావు గుర్తుందా? ఏమన్నావు ఆరోజు?".

"పడ్డది గుర్తుంది కానీ ఏమన్నానో గుర్తులేదమ్మా.."

"పడంగానే 'యాడియే' అన్నావు... ఆపదలో అందరూ 'అమ్మా' అంటారు.. దెబ్బతగలగానే నువ్వు 'యాడియే' అన్నావు. నీకు ఆ ధ్యాస లేదు కానీ, నేను గమనించాను. బ్రాహ్మలింట్లో పనికోసం అబద్ధం చెప్పి ఉంటావు, అనుకున్నా.

★ ★ ★

"మాది గార్ల దగ్గర అంజనాపురం తండా.. మా అమ్మానాన్న కూలిపని చేసుకుంట, నన్ను మా తమ్ముణ్ణి చదివిచ్చిన్రు. నేను తొమ్మిదో తరగతిలో ఉండగా, మా ఊరిదొర పొలం కాపలాకు రాత్రిపూట పోయిండు మా నాన్న. రాత్రి చీకట్లో పాము కరిసి సచ్చిపోయిండు" అని కళ్ళ నీళ్లు పెట్టుకుంది.

"అయ్యో పాపం" అన్నది గాయత్రమ్మ.

"దొర పైసా ఇయ్యలేదు. పాము కరిస్తే నేనేం చెయ్యాలన్నడు. కావాలంటే మా తమ్ముడిని తన దగ్గర జీతముండ మన్నడు. మా అమ్మను ఉంచుకుంట అన్నడు"...

"ఓరి పాపాత్ముడా.." గాయత్రమ్మ.

"మా తమ్ముడికి కోపమొచ్చి దొర మీద తిరగబడ్డడు.

రెండ్రోజుల తర్వాత దొర మనుషులు, మా తమ్ముణ్ని బాగా కొట్టి, ఇంటి ముందట పడేసి పోయిన్రు" అని కళ్ళు తుడుచుకుంది.

"అయ్యో.. బిడ్డా" జాలిపడ్డది పెద్దావిడ.

"మా ఇద్దరికి వయసులో ఒక సంవత్సరమే తేడా, ఒకటే క్లాసు చదివేది ఇద్దరం. గద్దర్ పాటలంటే ఇష్టం వాడికి, శ్రీశ్రీ కవిత్వం చదువుతుండె. దొర మనుషులు కొట్టిపడేసినంక నెలరోజులు నవిసిండు. బాగయినంక బడికి రాలే. 'నేను అన్నల్ల కలుస్తాన్నా' అని ఉత్తరం రాసి ఇంట్ల నుండి ఎల్లిపోయిండు. మా అమ్మ కూలికి పోయినా సరిపోట్లేదని సారబట్టి పెట్టేది.. గుడుంబకు మా ఊళ్ళె బాగ గిరాకి ఉండేది. డబ్బులు బాగనే వచ్చేయి. నేను పదోతరగతి పూర్తి చేసి, ఇంట్లనే ఉంటన్నా. అప్పుడప్పుడు అమ్మతోటి కూలికి పోయేది. నా మీద దొర కన్ను పడ్డది. ఇద్దరు ముగ్గురితో కబురు పెట్టిండు, నేను ఒప్పుకుంటే రెండెకరాల పొలం నా పేరున రాస్తానని. మా అమ్మ వాళ్ళను తిట్టి పంపింది" అని గట్టిగా నిట్టూర్చింది.

"ఓరి నీ కాముపు కళ్ళు కాకులు పొడవా.. మీ అమ్మ మంచి పని చేసింది. దొర ఊరుకున్నడా.." గాయత్రమ్మకు ఆత్రుత పెరిగింది.

"మా అమ్మను దెబ్బతియ్యటానికి ఆప్కారోళ్ళను మా ఇంటికి పంపిండు. మా అమ్మను, ఇంకొందరిని పట్టుక పోయిన్రు వాళ్ళు. మా అమ్మను బాగా కొట్టిన్రు. అంజనాపురం తండ నుండి గార్లకు పోయే దారెమ్మటి నడుచుకుంట పోతంటే, మిగిలిన వాళ్ళని వదిలి పెట్టిన్రట. దొర చెప్పినట్టు ఇంటే నిన్ను కూడ వదిలి పెడ్తమన్నరట మా అమ్మతో.. ఇదంతా దొర పన్నాగమని అర్థం చేసుకున్నది. ఆప్కారోళ్ళ ఎనకెనక నడుచుకుంట మా అమ్మ అద్దాలచోళీ ఇప్పి తిరగలేసుకొని, తల మీద ముసుగు తీసి కింద పడేసి, జుట్టీరపోసుకుని నెత్తిమీద మట్టి పోసుకున్నదట, పోలీసుల మీద పోసిందట, తన నోట్ల పోసుకున్నదట. పిచ్చిలేసినట్టు అరుసుకుంట, పిచ్చి చేష్టలు చేసిందట" గాలి పీల్చుకోడానికి ఆగింది గౌరి.

కథ

"ఓహెూ.. మీ అమ్మ తెలివైందే.." గాయత్రమ్మ మెప్పుగా అన్నది.

"వాళ్ళు కొట్టిన దెబ్బలకు నిజంగనే పిచ్చిదయిందేమోనని ఇంకా కొట్టిన్రట. సోయిదప్పిన అమ్మను చచ్చిందనుకొని, రోడ్డు పక్కన పడేసి పోయిన్రట. చీకటి పడేటప్పుడు మా ఊరు స్కూల్ల పంతులు సుందర్రావు సార్ సైకిల్ మీద తిరిగి తండలల్ల సూదులు, మందులు ఇచ్చేటోడు. ఆయన చూసి సూదేసి. దెబ్బలకు మందేసి, సోయెచ్చెదాక ఉండి, లేసినంక మంచినీళ్లు తాపిచ్చి,

సైకిల్ మీద కూసోపెట్టుకొని తీసుకొచ్చి, ఇంటి కాడ దింపిండు".

"పోనీలే ప్రాణం కాపాడిండు, బుద్ధిమంతుడు" అన్నది గాయత్రమ్మ.

"అంతే కాదమ్మా.. నెలరోజులు డబ్బులు తీసుకోకుండనే ఇంటికి వచ్చి వైద్యం చేసిండు. అప్పుడే మీ కోడలు పేపర్ల యాడ్ ఇచ్చిందట. 'బ్రాహ్మణ కుంటుంబానికి బ్రాహ్మణ మనిషి ఇంట్ల పనికి కావాలి' అని. అది చూసి మాకు చెప్పిండు. ఆ ఊర్ల ఉంటె దొర ఇంకేం అఘాయిత్యం చేస్తడోనని, ఇక్కడ ఖమ్మంల వికలాంగుల కాలనీల గుడిసెలు అద్దెకుంటయని చెప్పి తోలి పోయిండు. ఆ సారు చేసిన మేలు జన్మల మర్వను. ఆయనిచ్చిన బహుమతే ఈ బతుకు. ఇక్కడ మా అమ్మ గుడిసెల నించి బయటికి రాదు. నన్ను అందరూ.. బాపనోళ్ళలాగ మాట్లాడుతవు అనేది. మా తెలుగు టీచర్, మా భాషలో - యాసలో మాట్లాడనిచ్చేది కాదు. పుస్తకాలల్ల ఉన్నట్టు మాట్లాడటం నేర్పింది. అది నాకు ఉపయోగపడింది. మా అమ్మ భద్రి - భద్రమ్మ, నేను 'గోరి' గౌరీలక్ష్మి అని పేరు మార్చుకొన్నం. మీ కోడలిచ్చిన పేపర్ యాడ్ పట్టుకొని వచ్చిన, పనిల చేరిన. భయంభయంగా బతుకుతున్న.." అని కన్నీళ్ళు పెట్టుకున్నది మళ్ళీ.

గౌరి కథ విని గాయిత్రమ్మ కూడా కళ్ళనీళ్ళు పెట్టుకున్నది.

"నాకు నా కోడలు సంగతి తెలుసు. నేను రాక ముందు నిన్ను ఇంట్లోకి రానిచ్చేదని కూడా తెలుసు. ఆమె వాళ్ళమ్మ ఆచారాలకు భయపడి, ఆ యాడ్ ఇచ్చిందనుకుంటా.. నువ్వేమి భయపడకు. నువ్వనుకున్నట్టు నిన్ను పనిలోనించి తీసేసినా.. నువ్వు చదువు కొనసాగించాలనుకున్నా, నాకు చెప్పు. నేను ఏర్పాటు చేస్తా.." అని ధైర్యం చెప్పి, తన ఫోన్ నంబర్, కర్నూలు అడ్రెస్ రాసిచ్చింది. కొంత డబ్బు చేతుల పెట్టింది. గాయత్రమ్మ ఇచ్చిన ధైర్యం గౌరి జీవితానికి అమూల్యమైన బహుమానమైంది. ఆమె సలహాతో

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో జాయిన్ అయింది గౌరి. ఇళ్ళల్లో పనిచేస్తూనే చదువు కొనసాగిస్తున్నది.

మన చదువు మనకే కాదు నలుగురి జీవితాలను నిలబెట్టాలె. కష్టాలు వచ్చినప్పుడు సరిగా ఆలోచించి బతకడానికి దిశానిర్దేశం చెయ్యాలి.

కవిత

# మాతృభాష



అక్కిరాజు స్వాతి, 98482 62843

తల్లి గర్భం నుండి తాను ఉదయించంగా
తొలి దొలుత పలికేది మాతృభాష

అమ్మమ్మ అత్త త్త మామ మామ యనుచు
ముద్దు ముద్దుగా పలుకు మాతృభాష

ఆపదందును మరియు సంపదందును కూడా
అమ్మ అమ్మంటు పలికేది మాతృ భాష

అంతరాత్మ చేసే అలజడిని
అందంగా బయటకి చిలికేది మాతృభాష

కల్వ పువ్వుల కవితా పరిమళం
యెల్ల కాలాలలో రాణించే రారాజు మాతృభాష

గుండె లోతుల నుంచి జాలువారుతుండు
గోరు ముద్దల భాష మాతృ భాష

పరమ పుజ్యంబు మనదైన మాతృ భాష
పడుతు లేచిన మనవెంట మాతృ భాష

పావన గంగా ప్రవాహంబు మాతృ భాష
మాతృ భాష కు సాటి మాతృ భాషే.

వ్యాసం

# తెలంగాణలో ప్రాచీన నాటకరంగం

వికసించిన పద్య నాటకాలు...



డా॥ సంగనభట్ల నరసయ్య
94400 73124

'అవస్థానం కృతిర్నాట్యమ్' అని భరత ఋషి నాట్యశాస్త్రంలో అనుశాసించినాడు. లోకంలో, మానవ జీవితంలో గల అనేక అవస్థల, సంఘటనలనే నాటకంలో ప్రతిఫలింప జేయడం ఈ కళారూపం ముఖ్యోద్దేశం. తన జీవితాన్ని తనకు తెలిసన నటులు, బహురూపాలు ధరించి, వేదిక మీద నటనలతో అనుకరించి, ప్రదర్శించి తనను (మనిషిని) సంతోషింపజేయడం, ఈ కళారూపం ప్రత్యేకత. ఈ కళే నాగరిక మానవుని మేధలో పుట్టి, జానపద రూపం నుండి సంస్కరణలను పొంది నాటకంగా పరిణమించింది. సుఖార్థులు, దు:ఖార్తులు, శ్రమజీవులు, వినోదార్థులు, విశ్రాంతి కాలంలో రంగస్థలమనే ప్రపంచంపై అనుకరణమనే జీవితాన్ని, మానవ సమాజ రూప కథను ఆస్వాదించారు. యవనిక శబ్దం యవనుల నాటకాన్ని మనకు అందించినట్లు కొందరు విమర్శకులు పేర్కొన్నా, యవనుల దాడికి ముందు భారతీయులకు తెలియదను కోలేం. వారినుండి తెరలు కట్టే పదములు నాటకంలో స్వీకరించి ఉండవచ్చు.

నాటకాన్ని "దాక్షషం క్రతు:" అన్నారు కాళిదాసు. ఇది ఒక రసరమ్య యజ్ఞం. రచన, ప్రదర్శన నిర్వహణ, రసావిష్కరణ దృష్ట్యా కూడా ఇది ఒక యజ్ఞమే. నాటకం ఒక అనుకరణ యజ్ఞం. ఆదిమ సమాజాల కాలం నుండి కూడా తమ వేటాడే క్రియల నుండి అనుకరణలు చేస్తూ, విచిత్ర వేషాలు ధరిస్తూ ఆటవిక జీవనాన్ని అనుకరిస్తూ ఈ ప్రదర్శన ఉండేది. నాగరిక సమాజంలో ఆ కొనసాగింపే ఇతివృత్త నిర్వహణ, మానవ సమాజ ప్రతిఫలనం, సందేశాత్మకతలతో నాటకంగా రూపుదిద్దుకొంది.

'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు. దీని రమ్యతకు కారణం నాటకేతి వృత్తివృత్తం మన సమాజమే. నటీనటులు పాత్రల రూపంలో దృశ్యమానులై కళ్ళెదుటే ఉంటారు. పాత్రల సుఖదు:ఖాలు స్వంతం చేసికొని అభినయించి, ప్రేక్షకులకు రసావిష్కరణ, ప్రత్యక్షానుభూతి ద్వారా ఇస్తారు. నేపథ్య దృశ్యం, రంగు, మంగులు, గానం అదనపు ఆకర్షణ. సంభాషణలు నిజ జీవితాల వలె పాత్రలను నిలబెడతాయి. అలాంటి బలవత్తర దృశ్యమాధ్యమం నాటకం. అందుకే ప్రతి కవీ నాటకం రాసి తన సామర్థ్యం నిరనూపించుకుంటేనే సఫలుడౌతాడని "నాటకాంతం హి సాహిత్యం" అన్నారు.

క్రీ.శ. 1వ శతాబ్దికి చెందిన కావ్యం గాథాసప్తశతి. తెలంగాణలోని కావ్యమైన దీనిలో నాటక ప్రస్తావనలున్నాయి.

గాథాసప్తశతీకారుడు ఒక గాథలో ప్రేయసీప్రియుల ఆలింగనాలు, రతి అనే నాటకాన్ని పూర్వరంగమన్నాడు. గ్రామపెద్ద కూతురు సమర్తాడితే చేసిన వేడుకల్లో నాటక రంగ ప్రస్తావన ఉంది.

నాగార్జున కొండ తవ్వకాలలో రంగస్థలం బయటపడింది. దీంతో క్రీ.శ. 2వ శకంలో నాటకాలు విరివిగా ఆడేవారని తెలుస్తుంది.

ప్రాచీన కాలంలో తెలుగునాట నేటి విధానంలో నాటకాలు ఆడినట్లు సాహిత్యాధారాలు తక్కువే. నాటకాలు రాసిన వారూ తక్కువే. తెలంగాణలో కాని, తెలంగాణేతర ప్రాంతాల్లో కాని ప్రాచీన కాలంలో నాటకాలు ఉన్నట్లు లేదు. కొద్దిగా ఉన్నా అవీ సంస్కృత నాటకాలే. తెలుగునాట అలంకార శాస్త్రవేత్తలే. ఆ తరువాత శతాబ్ది వాడైన విద్యానాథుడు తన ప్రతాపరుద్ర యశోభూషణంలో తన ప్రభువు కృతిభర్త అయిన ప్రతాపరుద్రుని పేరిట ఒక లక్ష్య నాటకం రాసినాడు.

తెలంగాణ క్రీ.శ. 8వ శతాబ్దివాడైన భవభూతి మహావీర చరిత్రమ్, మాలతీ మాధవమ్, ఉత్తర రామచరితమ్ అనే మూడు నాటకాలు రాసినాడు. ఈయన బోధన్ నివాసి. ఇతని ఈ నాటకాలు కాళప్రియనాథుని కోవెలలో ఆడించేవారని రాసికొన్నాడు. ఈ కళాప్రియ నేటి కాంధార్ (పర్భణి జిల్లా) నాడు రాష్ట్ర కూటుల రాజధాని. అక్కడి కాళప్రియ

నాథుని కోవెల నేడు మసీదుగా మారి కనబడుతుంది. ఒకటవ, మూడవ నాటకాలు రాముని కథ. రెండవది ఐతిహాసిక గాథ. ఉత్తర రామచరిత్రతో భవభూతి విశేషంగా ప్రకాశించినాడు. నా నాటకంలో తన తెలుగుదనాన్ని ప్రదర్శించినాడు. ఐతే తెలుగు నాటకాలు ఏమీ రాసినట్టు లేదు.

భవభూతి రాసిన నాటకాలు మూడింటిలో "భగవత: కాలప్రియనాథుడి యాత్రాయాం ఆర్యమిశ్రాన్ విజ్ఞాప యామి" అని కాళప్రియనాథుని జాతరలో ఈ నాటకాలు ఆడించారని చెప్పినారు. ఈ కాళప్రియనాథుడు "కంధార"లోని (రాష్ట్రకూటుల ఉపరాజధాని లేదా సైనిక కేంద్రం) చెరువు ఒడ్డున గల ఈశ్వరుడు. ఈ దేవాలయం నేడు మసీదుగా మారింది. అక్కడికి వెళ్ళి నేను సేకరించిన, శాసనంలో "కలికాలేపి సకలలోక ప్రత్యక్ష్యాది శ్రవ్యశర్మతే భగవత: శ్రీకాల ప్రియస్య ప్రాంగణే జయతుంగ సముద్రస్య పాలిప్రతిత నగరే... కాల ప్రియస్య భగవత: ప్రాంగణే వర్తిన్యాసం సత్రశాలయాం. (కంధార కాళప్రియ నాథ దేవాలయ శాసనం) ఉత్తర రామచరితం తత్ప్రణీతం ప్రయుజ్యతే అని వివరించారు. నాటిక సృష్టి జరిగిన బోధన్, ప్రథమ ప్రదర్శన నడిచిన కంధార (పర్భణి జిల్లా)ల మధ్య దూరం 100 మైళ్ళు.

ఈ మహాకవి భవభూతి ఉత్తర తెలంగాణలో చరిత్రకందిన మొదటి నాటక రచయిత. ఈయన నాటకాలు సాహిత్యంగానే కాక ప్రదర్శన కళగా నాటకంగా ప్రదర్శించబడేవనేది కూడా ఒక చారిత్రక సత్యం. ఇతని కాలం క్రీ.శ. 9వ శతాబ్దం.

భవభూతి సంస్కృత నాటకకారులలో చాలా గొప్ప ప్రతిభావంతుడైన రచయిత. ఇతడు తాను పద్మపుర నివాసినని చెప్పుకొన్నాడు.

"దక్షిణాపథే పద్మపురం నామనగరం, తత్ర కేచిత్ తైత్తిరీయ కశ్యపాశ్చ... సుగృహితనమ్నో గోపాలస్య పాత్ర: పవిత్రకీర్తి నీలకంఠస్య ఆత్మసంభవ:



భవభూతిర్నామ:"

ఈ పద్మపురం బోధన్ (నిజామాబాద్ జిల్లా) నగరం. పంప మహాకవి కూడా పద్మపురం వాడే. దీన్ని ఏలిన ఇమ్మడి అరికేసరి కొలువులో ఉన్నాడు. భవభూతికి 200 సంవత్సరాలు తరువాతి వాడు (10వ శతాబ్దం).

భవభూతి తరువాత కాకతీయ సామ్రాజ్యంలో నాటకానికి బహుళ ప్రచారం ఉండేదనే సాక్ష్యాలు అనేకం ఉన్నాయి. రుద్రమదేవి తరువాత రాజ్యానికి వచ్చిన ఆమె మనుమడు (రెండో) ప్రతాపరుద్రుని కాలంలో నాటక సాహిత్యం వచ్చింది. ఇతని కొలువులో విద్యానాథుడనే అలంకార శాస్త్రవేత్త ఉండేవాడు. అతడు అలంకార శాస్త్ర గ్రంథం ఒకటి రాస్తూ లక్ష్యంగా అన్నిటా ప్రతాపరుద్రుణ్ణే స్వీకరించినాడు. ఆ గ్రంథం పేరు ప్రతాపరుద్రీయం లేదా ప్రతాపరుద్ర యశోభూషణం. క్రీ.శ. 1320 నాటిది. దీనిలో నాటకానికి ఒక ఉదాహరణగా ఒక నాటకం 'ప్రతాపరుద్ర కళ్యాణమ'ని ప్రతాపరుద్రుని పేర రాసినాడు. ప్రతాపరుద్రీయంలో అది ఒక భాగం. ప్రతాపరుద్రునికి, ఎల్లందుల దండాధీశుడైన రాజు కూతురు విశాలాక్షి పెళ్ళి స్వయంగా యయాతి చరిత్ర 7 అంకాల నాటకం (నాటిక), ఉషారా గోదయ నాటకాలు రాసినాడు. ఈ యయాతి చరిత్ర వసంతోత్సవాల్లో ప్రదర్శించబడింది. స్వయంభూదేవని ఉత్సవాళ్ళో నాటకాలు ఆడేవారని, నాట్యవేదాచార్యుడు కులార్ణవుని కుమారుడు. అభినయ దర్పణ బిరుదాంచి తుడొకడు ఒక రూపం ప్రదర్శించినట్లు ప్రతాపరుద్రీయంలో వివరించబడింది. ఈయనకంటే 100 సంవత్సరాలు ముందే గణపతిదేవ చక్రవర్తి కొలువులో విశ్వేశ్వర శివాచార్యుడనే ఆధ్యాత్మిక గురువుండే వాడు. ఆయన గోళకీమఠాల స్థాపకుడు. అతని కుమారుడు నరసింహకవి. సిద్ధోద్వాహమున్న పేరిట ఒక సంస్కృత కావ్యాన్ని (62 శ్లోకాల గ్రంథం) రాసి, తాళపత్రాలలో రాయడానికి బదులు ఉర్సుగుట్టపై ఒక బృహచ్ఛిలపై చెక్కించిన విశిష్టకవి. ఈతడు ఒక నాటకం రాసినాడు. ఇది ఓరుగల్లు రాజ్యంలో క్రీ.శ. 1250 ప్రాంతంలో వచ్చిన నాటకం. దీని విశేషాలు తెలియరావు. విద్యానాథుని మేనల్లుడు గంగాధరుడు చంద్రవిలాసం, రాఘవాభ్యుదయ నాటకాలు రాసినాడు. గంగాధరుని కుమారుడు విశ్వనాథుడు 'సౌగంధికాపహరణం' అనే వ్యాయోగం, మరొక కుమారుడు నరసింహుడు 'కాదంబరీ కళ్యాణం' అనే నాటకం రాసినాడు. ఇది ఎనిమిది అంకాల నాటకం.

'ప్రతాపరుద్ర దేవస్య సన్నిధే సర్వశాస్త్రవిత్' అని ప్రశంసింపబడిన వీరభల్లాటి దేశికుడు ప్రతాపరుద్రుని ఆస్థానంలో నాట్యసిద్ధాంత విషయంగా సిద్ధాంతాలు చేసినట్టు పేర్కొనబడినాడు. నాడు సభల్లో నాట్యనాటక సిద్ధాంతాలు, రాద్ధాంతాలు జరిగేవని తెలుస్తోంది.

భావ ప్రకాశకారుడైన శారదా తనయుడు (క్రీ.శ. 1175-1250)

కాకతీయులు కాలం వాడైన తెలుగు అలంకారికుడు. అతడు ఆగ్రంథాదిలో 30 రకాల రూపకాలు తన కాలంలో ఉన్నట్టు చెప్పాడు. ఆయన కాలంలో దివాకరుడు అనే బ్రాహ్మణుని ఆధిపత్యంలో నాటకశాల ఉండేది.

క్రీ.శ. 1300 ప్రాంతం వాడైన వెన్నెలకంటి అన్నయ్య 'షోడశ కుమార చరిత్ర'లో తన తండ్రి సూరామాత్యుడు "నాటకముఖ కోహళాది నాట్యరహస్యో ద్ఘాటననిపుడని, 'నూతన భరతాచార్యు డని" పేర్కొనబడినాడు. నాడు ఈ విధంగా నాటకరచనా ప్రదర్శనా రీతుల ఛాయలు మనకు ఉపలభ్యం అవుతున్నాయి. పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో కూడా దేశి నాటక ప్రక్రియ పేర్కొనబడింది. అయినా దానికి నేటి నాటక ప్రదర్శనారూపానికి సంబంధం లేదు.

కాకతీయ ప్రతాపరుద్రుని కాలం వాడే అయిన యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం రాసినాడు. దాంట్లో నాటక ప్రస్తావన ఉంది.

మ. అమరంగా *స్మృట "భక్తి నాటకము" భాషాంగా క్రియాంగభిరమ్య ముగా జూసిన మెచ్చి.. నటుండై వచ్చి సంసార*
*గములోనం బహురూపమాడు*
*వెలయంగ జీవి సర్వేశ్వరా!", (20వ ప.)*

నాటకమును భాష, అంగ, క్రియాంగ, అభిరమ్యంగా ఆడేవారని 'బహురూపుల' ఆడేవారని చెప్పినాడు.

నాటకాలను రాత్రివేళ వెన్నెల్లో ఆడేవారని కూడా చెప్పినది ఇతడే.

శా. *ప్రారంభించి చకోరపోతము మహీయ జ్యోత్స్నయందువ*
*శ్రీరంజిల్లుచు వేడ్కనుండుగతి... (86వ ప.)*

అని వెన్నెలలో చకోరంలో నాటక రంజనం అయ్యేదని నిదర్శన ద్వారా చెప్పినాడు. బహుశా దివిటీల వెలుగులు సరిపోక పోవడం చేత కృత్రిమమైన వెలుగులకంటె వెన్నెల్లో ఆడితేనే బాగా కనపడేదని నాటి ప్రజలు, ప్రదర్శకులు భావించేవారనవచ్చు. ఇది నాటి తెలంగాణ రంగ ప్రదీపన పద్ధతి.

ఇక తరువాతి వ్యక్తి రాచకొండ నేలిన సర్వజ్ఞ సింగభూపాలుడు. ఈతని కాలం క్రీ.శ. 1370-1401. ఈయన తాను రాసిన రసార్ణవ సుధాకరంలో విద్యానా థుని వలెనే నాటకం రాయవలసింది. కాని అక్కడ రాయకుడా స్వతంత్రంగా 'రత్నపాం చాలికా' (కువలయావళీ) అనే నాటకం రాసినాడు. ఆయనే 'కందర్ప సంభవం' అనే భాణం రాసినాడు. భాణం అనేది పదిరకాల నాటకాలలో ఒకటి.

రత్నపాంచాలిక గాథ చాలా విశిష్టమైంది. విచిత్రమైంది. ఈ కథను నాటకీకరణ చేయడం సర్వజ్ఞ సింగని ప్రతిభ అనన్యసామాన్యంగా గోచరిస్తుంది. భాణం అనేది దశరూపకాల్లో ఒకటి. అదీ ఒక రూపక(నాటక)మే. ఇవి రెండు నాటకాలు రాసిన ఘనత (రెండవ) సర్వజ్ఞ సింగభూపాలునిది. ఈతడు కావ్య, నాటకాలంకార శాస్త్రకారుడు. గొప్ప పండితుడు. ఇతనికి సర్వజ్ఞుడనే బిరుదు ఉండేది. ఈతని కొలువును శ్రీనాథుడు దర్శించి ఈతని బిరుదాన్ని స్థిరపరచిన చాటువొకటి ఉంది.

కం. *సర్వజ్ఞయన్న బిరుదము*
*శర్వునకే రావు సింగజనపాలునకే*
*ఉర్విం జెల్లును తక్కొరు*
*సర్వజ్ఞుడనుట కుక్క సామజమనుటే*

ఈ సింగభూపాలునకే సాహిత్య శిల్పావధి అన్న బిరుదు ఉంది. రసార్ణవసుధాకరమనే అలంకారశాస్త్ర గ్రంథం. సంగీత సుధాకరమనే సంగీత శాస్త్ర గ్రంథానికి (శార్ఙ్గ దేవుని సంగీత రత్నాకరం) వ్యాఖ్య రాసినాడు. ఈతని 'రత్నపాంచాలిక' నాటకం రాచకొండ రాజధాని నగరంలో ప్రసన్న గోపాలదేవ వసంతోత్సవాలు, కళ్యాణ నారాయణ వసంతోత్సవాలు జరుగుతుండగా ఉత్సవాలలో ఆడినారు. ఈ నాటకాలు సమాజంగా రాత్రివేళ వెన్నెల్లో ఆడేవారు. నాటకాలలో ప్రదర్శన ముందు చంద్రుని పూజ ఉంది. వెన్నెల్లో నేలమీద కూర్చునే వారికి విషకీటకాల బాధ లేకుండా వెలుగు ఉండేది.

ఈ యుగంలోనే పశుపతినాథుడు మదన విలాసం అనే బాణం రాసినాడు. అలాగే ఇదే కాలానికి చెందిన రావిపాటి త్రిపురాంతకుడు క్రీ.శ. 14వ శతాబ్దివాడు. అతడు కాకతీయ ప్రతాపరుద్రునికి సమకాలికుడు. అతడు ప్రేమాభిరామం అనే నాటకం రాసినాడు. ఇది సంస్కృతం లోని దశవిధరూపకములలో 'వీధి' అనే శాఖకు చెందింది. ఈ నాటకం సంస్కృతంలో ఉంది. ప్రస్తుతం అలభ్యం. కాని దీనికి వినుకొండ వల్లభరాయుడు అనే రచయిత రాసిన క్రీడాభిరామం అనే పేరిట గల అనువాదం దొరకుతుతోంది. ఇది తెలుగులో, తెలంగాణలో లభిస్తున్న ప్రప్రథమ రూపకం అనాలి. అయితే ఇది గేయంగా కాని, వచనంగా కానీ లేదు. కేవల పద్యకావ్యం ఇది.

"నటులది దోరసముద్రము
విటులది యోర్గల్లు, కవిది వినుకొండ, మహా
పుట భేదనమీత్రయము
నిట గూర్చెను బ్రహ్మ, రసికులెల్లరు మెచ్చన్"

రెండో ప్రతాపరుద్రుని ఆస్థాన, నృత్యకారిణి మాచల్దేవి చూడటానికి మనం అక్కడికి పోదామని.

"ఈ లేమ చరిత్ర మాడుదురు నాటకంబుగ నవనిలోన, దీని జూడంగా బోదము..." అని మంచన శర్మ సంభాషణా క్రీడాభిరామంలో ఉంది.

ఈ నాటకం (వీధి) రెండే పాత్రలు. మంచన, టిట్టిభసెట్టి అనేవారు. కథాకాలం ఒకరోజు. స్థలం ఓరుగల్లు పురవీధులు. నాటకీయత కంటె వర్ణనాత్మకత మెండు.

నాటకాలు ఒకపక్క శిష్టసాహిత్యంగా ప్రచారంలో ఉంటే, సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉన్న నాటక ప్రక్రియ యక్షగానం. ఇది గేయ నాటకం. సంభాషణకంటె పాటలు ఎక్కువ. నృత్యమూ ఉంటుంది. రంగస్థలమంతా కలియ తిరుగుతారు. సంధి వచనాలు ఉంటాయి. వేషభూషణాలు ఉంటాయి.

అలాగే ఇదే కాలానికి చెందిన



శాకల్యమల్లభట్టు 'ఉదార రాఘవమ'నే నాటకాన్ని రాసినాడు. ఈయన సింభూపాలునకు సమకాలికుడు.

నాటకానికి ప్రత్యామ్నాయం యక్షగానం. యక్షగానంలో పాత్రల సంభాషణలు పాటలుగా సాగితే నాటకంలో వచనంలో సాగుతాయి. నల్గొండ జిల్లా దేవరకొండ ప్రాంతం వాడైన కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయం తెలుగులో తొలి యక్షగానం. ఇదే తొలి తెలంగాణ గేయ నాటక మనవచ్చు.

సంస్కృతంలో సుప్రసిద్ధంగా నాటక సాహిత్యం ఉంది. తెలుగులో అన్ని సంస్కృత సాహిత్య ప్రక్రియలను అనువదించిన, అభిమానించిన తెలుగు వారు రూపకాన్ని ఎందుకు స్వీకరించ లేదో అర్థం కాదు. రూపకం (నాటకం) స్థానంలో యక్షగానమే ఉండటం అనేది కారణం కావచ్చు. యక్షగానం కూడా ఒక ప్రసిద్ధ గేయరూపకమే. గేయ సంభాషణలు. నాటకీయంగా పాత్రల రంగప్రవేశం, కథా నిర్వహణం, అంక నిర్వహణం, పాత్రల వేషభాషలు, నటుల ప్రసాధనం, రంగస్థల ప్రయోగం అన్ని ఈ రెంటికి (యక్షగాన, నాటకాలకు సమానమే.

సుప్రసిద్ధ సంస్కృత నాటకాలనైనా అనువదించారా అంటే అదీ లేదు. పైగా సంస్కృత నాటకాలను కావ్యాలుగా/ ప్రబంధాలుగా తెలుగులో అనువదించు కొన్నారు. వాటలో కాళీదాసు అభిజ్ఞాన శాకుంతలం పిల్లలమర్రి పినవీరభద్రుని చేతిలో శృంగార శాకుం తలంగా, ప్రబంధంగా ఒదిగింది. రాజశేఖరుని విద్ధసాలభంజిక మంచన కేయూర బాహుచరిత్రంగా, కృష్ణ మిశ్రుని ప్రబోధ చంద్రోదయం, నంది మల్లయ్య ఘంటసింగయల జంట రాసిన ప్రబోధ చంద్రోదయంగా నాటకాలు సుప్రసిద్ధ కావ్యాలుగా రాయబడినవి. శ్రీ కృష్ణదేవ రాయలు స్వయంగా సంస్కృతంలో 'జాంబవతీ పరిణయం' నాటకం రాసినాడు. తూము రామదాసు రాసిన కాళీదాసు నాటకంలో తెలంగాణలో ఆధునిక నాటక రంగ చరిత్ర మొద లౌతుంది. ఇది క్రీ.శ. 1898 వరంగల్‌లో ఈ నాటకాన్ని సురభివాళ్ళు ఆడినారు. దీనికంటే ముందుకాలం అంతా ప్రాచీన నాటకరంగ చరిత్రగా స్వీకరించాలి.

ప్రధాన రాజ్యాలు అయిన కాకతీయ, రాచకొండ రాజ్యాల తరువాత తెలంగాణ ప్రాంతాన్ని బహుమనీలు, కుతుబ్ షాహీలు, అసఫ్‌జాహీలు ఏలిన కాలం స్వాతంత్ర్య భారతదేశం కాలంవరకు అంతా నాటకరంగానికి చీకటిరోజులే. ఏ ఆశ్రయం లేదు. అయినా ఈ సమయంలో కృషి చేసినవి చిన్న సంస్థా నాలు. వాటిలో గద్వాల సంస్థానమొకటి. ఇక్కడ ప్రతి ఏడాది కార్తీక పౌర్ణిమకు జరిగే ఉత్సవాలలో నాటకాలు ఆడేవారు. పెదసోమభూపాలుని నుండి (క్రీ.శ. 1663) రాణీ లక్ష్మీ దేవవర్మ పాలనవరకు (1712) ఈ ఉత్సవాలు ఆలయ మహాద్వారం ముందు తాత్కాలిక వేదికలు నిర్మించి సామాన్యప్రజల కోసం యక్షగానాలు ఆడేవారు. ఈ సాహిత్య సాంస్కృతికోత్సవాలకు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలనుండి కళాకారులు వచ్చేవారు. అక్కడ సంస్కృత నాటకాలు, పండితుల కోసం, రాచకుటుంబం కోసం ప్రదర్శించబడేవి.

ఆదిపూడి ప్రభాకరమాత్యుడు ఈ సంస్థానపు గొప్ప పండితుడు. ఆయన సంస్కృత నాటకాలు ప్రదర్శింపచేయ డంలో బాధ్యత తీసుకొనేవాడు. కలకత్తా నుండి ప్రచురింపబడిన కౌటుంబినీ ప్రింటర్స్‌వారి సంస్కృత నాటకాలు తెప్పించి, కళాకారులను రప్పించి నాటకాలు ఆడించేవారట.

జటప్రోలు రాజు సురభి మాధవరాయాల ఆస్థాని ఎలకూచి బాల సరస్వతి 'రంగకౌముది' అనే నాటకం రాసినాడు. వనపర్తి సంస్థానం నుండి రామచంద్రోదయం అనే నాటకం (సంస్కృతం) వచ్చింది. మిగతా సంస్థా నాలలోని నాటకరంగం గూర్చి ఎక్కువ విశేషాలు తెలియవు.

రాజ సంస్థానాల తరువాత నాటక రంగానికి సేవ చేసినవి దేవాలయాలు. ప్రసిద్ధ దేవాలయాలలో, జాతరలలో నాటకాలు ఆడేవారు. భవభూతి కాళప్రియనాథుని జాతరలో తన నాటకాలు ఆడేవారని చెప్పాడు కదా!

అలాంటి దేవాలయాల్లో అగ్రస్థానంలో నిలువదగింది ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం. ఈ ధర్మపురి గోదావరి తీరంలోని కరీంనగర్ జిల్లాలోనిది. సుమారు 12 వందల సంవత్సరాల క్రితం నుండే శాసనాలు లభిస్తున్న ఊరు. ఈ గ్రామంలో స్వామివారి కోవెల పక్క, చింతామణి చెరువు పరిసరాలు, ఇసుక స్తంభం మంటపంలో యక్షగానాలు ఆడేవారు. ధర్మపురిలో ఆడే యక్షగానాల్లో ప్రహ్లాద చరిత్ర, అల్లిరాణి ముఖ్యమైనవి. ఈ యక్షగానాల ప్రదర్శన చూసి, ఆ గ్రామవాసి అయిన సుప్రసిద్ధ కవి, నరసింహ శతకకర్త శేషప్ప ధర్మపురి రామాయణం అనే యక్షగానం రాసినాడు. ఇది ఆనాడు చాలా ప్రసిద్ధమైన యక్షగానం. దీన్ని మూడు రోజులు ఆడేవారు. దీని ప్రఖ్యాతిని చూసి మంథెన

వ్యాసం

రామాయణం వచ్చింది. ధర్మపురి వాడే అయిన శేషప్ప. అతని దౌహిత్రుడు కాకుత్థ్సం నరసింహదాసు మైరావణ చరిత్ర అనే యక్షగానం రాసినాడు. వీరిద్దరి కాలం క్రీ.శ. 1760-1830 ప్రాంతం. ఇవి ఆ ప్రాంతంలో నాటకం లేని కొరతను, యక్షగాన పుష్టిని నిర్ధారిస్తాయి. (ఈ ధర్మపురి వాసుల నాటకాభిమానం ఒక శత సంవత్సరాల తరువాత 1936లో శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి పేరుతో నాటి యువకులు ఏర్పాటు చేసిన సంస్థ ద్వారా గత 80 ఏండ్లుగా నేటికీ నాటకాలు ఆడుతున్నారు. (ఈ వ్యాస రచయిత ఇటీవల 80 వసంతాల పండుగను ధర్మపురిలో నిర్వహించాడు.)

అతి ప్రాచీనకాలంలో తెలంగాణలో గేయనాటకాలుండేవి అనేందుకు ఒక చిన్న సాక్ష్యం ఉంది. హాలుడు ధవళాలు రాసినాడు. ధవళం యక్షగానంలోని ఒక గేయవిధానం. యక్షగానాలు నాటికే ఉండేవంటే నాటకాలు ఆనాడే గేయ రూపంలో ఉండేవి. ఈ నాటకాలలోని గేయాలే తరువాత శ్లోకరనా విధానానికి దారితీసాయి. సంస్కృత నాటకాలలో, అలాగే మన తెలుగు నాటకాలలోని పద్యాలు, మరాఠీలోని నాట్యసంగీత్ గేయగతులకు అనువర్తిత రూపాలే. హాలుని కాలానికే యక్షగానం ఉందంటే నాటికే ఈ నాటక ప్రక్రియ ఉండేదన్న మాట. హాలుని కాలం క్రీ.శ. 1వ శతాబ్దం అంటే నేటికి రెండువేల ఏండ్ల క్రితం తెలంగాణలో నాటకం ఉండేదన్నమాట. అయితే ఇవి దేశి నాటకాలు. అనగా చిందు, యక్షగాన, వీధి నాటకాలన్నమాట. మార్గ నాటకాలు ఆధునిక కాలానివే.

జక్కులగానం యక్షగానం. కొద్ది పాత్రలకే పరిమితమైన ఈ గానం కథనాత్మకంగా, కాలక్రమంలో సంవాదాత్మకంగా, ఆపై వీధి రూపకంగా, ఆ తరువాత నాటకంగా పరిణమించింది. (నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతంవాడైన) కందుకూరి రుద్రకవి సుగ్రీవవిజయం లభిస్తున్నంతలో తొలి యక్షగాన నాటకమని చెప్పుకున్నాం. క్రీ.శ. 14వ శతాబ్ది ఈయన కాలం. రాపాక శ్రీరామకవి ఆధ్యాత్మిక రామాయణం, కానూరి వీరభద్రకవి బసవ మహిమామృత విలాసం, పౌరాణిక యక్షగాన నాటకాల్లో శ్రీకృష్ణ తులాభారం, చెంచులక్ష్మి, శ్రీరామాంజనేయ యుద్ధం, మైరావణ చరిత్ర, బభ్రువాహన, గయోపాఖ్యానం, ఆరె మరాఠీలు, మాయల ఫకీర్ వంటి జానపదాలు, అల్లిరాణి, కనకతార, రంగూన్‌రౌడి వంటి వైవిధ్యభరిత నాటకాలు ఉండేవి. చెర్విరాల భాగయ్య చిలకమర్తివలె బహుగ్రంథాల రచయిత, చిలకమర్తి గయోపాఖ్యానం వలె చెర్విరాల భాగయ్య 'సుగ్రీవ విజయం' లక్షప్రతులు అమ్మినది. రూపకానికి రత్నమ్మను కూడా ఈ సందర్భంగా యక్షగాన రచయిత్రిగా పేర్కొనాలి. ఈ యక్షగానాలన్నీ నాటకాలుగా రంగస్థలం మీది ప్రదర్శన కళగా రాణించినవి. ఇవి తెలంగాణలో నాటకాలు లేని కాలంలో నాటికల కొరత తీర్చి వాటి స్థానంలో ఆ పాత్ర పోషించినవి. మూడవ సింగభూపాలునికి (క్రీ.శ. 1475) పరిపాలనాంతం నుండి సుమారు 350 సంవత్సరాల తరువాత క్రీ.శ. 1799లో కిరీటి వెంకటాచార్యుల (తెలంగాణ తొలి నాటకకర్త) వరకు ఈ ప్రాంతంలో నాటక ప్రక్రియ, ప్రదర్శన, రచన లేదనే చెప్పవచ్చు. ఇంకా చరిత్ర తవ్వకం పనిలో కొత్త అంశాలేమైనా దొరకవచ్చని ఆశిద్దాం.

కవిత



# మీలో ఎందరో



**కోటం చంద్రశేఖర్, 9492043348**

(కొమ్ముల వెంకట్ కి ప్రేమతో...)

అనగనగా ఓ తల్లికోతి,
దానికి ఓ పిల్లకోతి తల్లికోతి
ఏ తోటలోనో దూరి ఏ చెట్టు మీదనో చేరి
పళ్ళు కాయలు తెచ్చి పిల్లకోతికి ఆహారంగా ఇస్తుంది.
ఆకలితో కన్పిస్తే తల్లడిల్లిపోయే తల్లికోతి
ఇలా రోజులు గడుస్తున్నాయి.
పిల్లకోతికి ఇంకా నెలలే,
ఒక రోజు తనతో వస్తానని మొండికేసింది.
ఇద్దరూ కలిసి ఒక పార్కులో దూరారు.
కాపలావాడు కనిపెట్టి కర్ర విసిరాడు
తప్పించుకొనే ప్రయత్నంలో
గాయపడ్డది పిల్లకోతి.
కోతులు జీవించే హక్కును గౌరవించేవాళ్ళు
లేరా చిన్న పెద్ద చూడరా?
ప్రకృతి మాది, పెత్తనం మీది
మేం కోతులం నీతులు వల్లించే
కోతులు మీలో ఎందరో!

కవిత



విప్పుకోవడానికి మాటలుంటాయే కానీ
కప్పుకోవడానికి దేహాలుండవు

గాలివాటంగా తరిమే తరంగాల్లో రాగాలుంటాయే కానీ
ఒకింత చినుకై తడిపే మేఘాలుండవు

జీవితం
ఒక అనిశ్చింత అన్వేషణ
గమ్యం తెలియని పరుగు

పిడికిట్లో విజయకేతనముంటుందే కానీ
గగన వీధుల్లో ఎగరవేయడానికి ఆసరా ఉండదు

సమూహ
కరతాళ ధ్వనుల మధ్య
ఏకాంత విజయం

సంఘర్షణ అనునిత్యం
ఎవరితోనో అర్థం కాకుండా యుద్ధం
అడిగి అందుకున్నావో...
పోరాడి పొందావో...

నా ....
వచ్చిందేదీ వరంలా వరించదు
శాపంలా పరిణామం చెందుతుంది



# జీవితం ఒక కన్నీటి సముద్రమై...

రాజేంద్రరాజు కాంచనపల్లి, 9849 22 6423

విసిగిపోయానని మనసంటోంది
అలసిపోయానని శరీరమంటోంది

ఓపిక లేదని మేధస్సంటోంది
తీరిక లేదని కాలమంటోంది

ఈ విశాల విశ్వం
ప్రేమకు అర్రులు చాపిన అనంతం

అన్నీ ఎదురుచూపులే ...
ఎక్కడా ప్రత్యక్షత ఉండదు

అంతటా ప్రేమలే ...
ఎక్కడా ఆత్మీయత వుండదు

ఆ తీరంనుంచి వల
చాకచక్యంగా ఈ తీరంపై కప్పుకుంటుంది

అంత చేసింది...
ఇంతకేనా..?!
అనిపించే అయోమయం
విశ్వంలా..
నీ ముందే దాపరికం లేకుండా పర్చుకుంటుంది...

అంతా స్పష్టమే అయినా
విచిత్రంగా....

జీవితమే అస్పష్టమైపోతుంది
ఎవరికైనా సరే
ముగింపు ఎప్పుడూ

అసంపూర్తిగానే గడ్డ కట్టుకు పోతుంది
వేవేల కన్నీటి సముద్రాల్ని
మట్టిలో దాచుకొని.....

# బికారి

తనకి విచిత్రమైన అనుభవం కలిగించిన ఒక అతను....



అనువాదం: ఎలనాగ
98669 45424

ఆంగ్లమూలం: సోమర్సెట్ మామ్

నేను చేయదల్చుకున్న పనులకు అవసరమైన సమయంలో నాలుగోవంతు కూడా దొరికేది కాదు నాకు. ఈ విషయం గురించి నేనెంతగా దిగులు పడేవాడినో ఆ భగవంతునికే తెలుసు. నాకంటూ ఒక్క క్షణం తీరిక దొరికి ఎన్నాళ్లైందో జ్ఞాపకం లేదు. ఒక్క వారం రోజులు నాకు పూర్తి తీరిక దొరికితే ఎట్లా ఉంటుంది అనే పిచ్చి ఊహతో ఎన్నోసార్లు వినోదించేవాణ్ని. పనితో బిజీగా లేనప్పుడు ఆటలతో బిజీగా ఉంటారు చాలా మంది గుర్రపు స్వారీ, టెన్నిస్, గోల్ఫ్, ఈత, పేకాట... ఇట్లాంటి ఎన్నో పనులతో. కానీ నేనైతే ఇవేవీ చేయను. ఉదయం పూట హుషారుగా తిరిగేసి, పగలంతా బద్ధకంగా గడిపి, సాయంత్రమంతా పిచ్చిగా తిరుగుతాను. నా మెదడు ఒక పలకై కూర్చుంటుంది. దాని మీద నా జ్ఞానం రాసే రాతలను అది ప్రతి గంటా తడిగుడ్డ లాగా తుడిచేస్తుంది. కాలం ఎంతో త్వరగా గడిచేదీ మళ్లీ తిరిగిరానిదీ కావడం వల్ల, మానవజాతికి గల సరుకులలో సమయం అనేది ఎంతో విలువైనది. దాన్ని వృథా చేయడం అన్ని పనుల్లోకెల్లా ఎక్కువగా నిరసించతగినది. అమూల్యమైన వజ్రాన్ని మధువులో కలిపింది క్లియోపాత్రా. కానీ దాన్ని తాగమని ఆంటొనీకి ఇచ్చింది. బంగారం లాంటి సమయాన్ని వృథా చేయడం వజ్రాన్ని కరిగించిన ద్రవాన్ని నేలమీద పారబోయడానికి సమానం. ఈ వాదం గొప్పదీ, అన్ని గొప్పవాదాల్లాగా వింతైనదీనూ. నాకు నేను కేటాయించుకున్న వారం రోజుల్లో సహజంగా అయితే చదవాలి నేను. ఎందుకంటే, చదవడం ఇష్టపడేవారిని పుస్తకపఠనం బానిసలుగా చేసుకుంటుంది. అక్షరాలు కనబడకుండా చేస్తే నిరుత్సాహ పడిపోయి, కోపంతో చిరబురలాడుతారు వాళ్లు. తాగుబోతుకు బ్రాందీ దొరక్కపోతే కల్లు, సారా తాగినట్టు ఐదేళ్ల కిందటి అడ్వర్టైజ్‌మెంట్ పేపరునూ, టెలిఫోన్ డైరెక్టరీనీ తిరగేస్తారు. కానీ రాయడమే వృత్తిగా పెట్టుకున్న రచయితకు చదవడం ఇష్టం లేక పోవడమనేది చాలా అరుదు. చదవడం బద్ధకపు పనిలా ఉండాలనిపిస్తుంది నాకు. తీరికగా ఆనందించే సమయం దొరికితే నాకు వ్యామోహం కలిగించే ఆ సాహస కార్యాన్ని పూర్తి చేయాలని నిశ్చయించుకున్నాను నేను. కనుగొనబడని దేశాన్ని అంచనా వేసే పరిశోధకునిలాగా నిక్ కార్టర్ రచనలన్నీ చదివేయాలనుకుని, ఆ పనికి పూనుకున్నాను.

కానీ పరిసరాలు నాకిష్టమైనవిగా ఉన్నప్పుడే నేను పని మొదలు పెడతాను. రికామీగా ఉండి సమయాన్ని సద్వినియోగం చేసుకోవలసినప్పుడు, చాలా ఆశ్చర్యం కలిగించే సంఘటన ఒకటి జరిగింది. ఎక్కడో సముద్రం మీద ఓడలో పరిచయమైనవాణ్ని ఆహ్వానిస్తే చెప్పా పెట్టకుండా పెట్టే బేడాతో అతడు మద్రాసులోని మన ఇంటికి వచ్చేసినట్టు యుకాటన్ పోయే వార్డ్ కంపెనీ ఓడను పట్టుకోవడానికి మెక్సికో నుండి వెరాక్రుజ్ కు వచ్చిన నేను, ఓడరేవువాళ్లు సమ్మె చేయాలని నిశ్చయించుకున్నారనీ, నా ఓడ ప్రయాణం రద్దు కాబోతున్నదనీ తెలిసి హతాశుణ్నయ్యాను. ఆ విధంగా వెరాక్రుజ్ లో చిక్కుకుపోయాను. ప్లాజా (ఒకే భవనంలోని దుకాణాల సముదాయం) మీదుగా కనబడే డిలిజెన్సియా హోటల్లో ఒక గదిని అద్దెకు తీసుకుని, ఉదయం అంతా నగరం వైపు చూస్తూ గడిపాను. తర్వాత, పురాతనమైన కోర్టుభవనాలను చూస్తూ వీధుల్లో తిరిగాను. నిదానంగా నడుస్తూ, అక్కడి చర్చిని మొత్తం చూశాను. ఫౌంటెన్ పంపులతో, పైకి వచ్చిన పెద్దపెద్ద స్తంభాలతో అందంగా ఉంది ఆ చర్చి. ఉప్పుగాలీ ఉజ్వలంగా ప్రకాశించే సూర్యుడూ కలిసి, బలమైన ఆ పెద్దగోడలకు సౌకుమార్యాన్ని ఆపాదించాయి. గోపురం మీద తెల్లనివీ నీలివీ రాతిపలకలు కప్పి ఉన్నాయి. చూడవలసినవన్నీ చూసివచ్చింతర్వాత వసారాలో చల్లగాలిలో కూర్చుని డ్రింక్ కు ఆర్డరిచ్చాను. ప్లాజాను ఉజ్వలంగా ప్రకాశింపజేస్తూ నిర్దయగా దంచేస్తోంది ఎండ. కొబ్బరిచెట్లు దుమ్ముతో

క
థ

నిండిపోయి భారంగా వంగి ఉన్నాయి. వాటిమీద నల్ల గద్దలు కొంచెంసేపు అసహనంతో కూర్చుని, బొమికలకోసం నేలమీదికి పల్టీలు కొడుతూ, ఆ పైన భారంగా కదిలే రెక్కలతో చర్చి గోపురం మీదికి ఎగిరిపోయాయి. వసారాలో ఎదురుగా కూర్చున్న జనాన్ని చూశాను. కారునలుపు నుండి పాలరాతి తెలుపు దాకా వివిధ వర్ణాల్లో నీగ్రోలు, ఇండియన్లు, క్రియోలీయులు, స్పెయిన్ దేశస్థులు కూర్చుని ఉన్నారు. పొద్దు కొంచెం గడిచి మధ్యాహ్నం కాగానే, నా చుట్టూ ఉన్న కుర్చీలు డ్రింక్ కోసం వచ్చిన వాళ్లతో నిండిపోయాయి. చాలా మంది తెల్లదుస్తుల్లో ఉన్నారు. ఎండ చాలా తీవ్రంగా ఉన్నా కొంతమంది మాత్రం నల్లని దుస్తులు తొడుక్కున్నారు. గిటారు వాయించే ఒకతను, ఫిడేలు వాయించే ఒక గుడ్డిమనిషి, ఇంకా మరో వాద్య కారుడు... వీళ్లందరు ఒక చిన్న బ్యాండుమేళంగా తయారై కొంతసేపు బ్యాండు వాయించారు. గిటారు వాయించే అతను పాటకు పాటకు మధ్య ఒక పళ్లెం పట్టుకుని డబ్బుకోసం చుట్టూ తిరుగుతున్నాడు. ఆనాటి వార్తాపత్రికను అప్పటికే కొనేశాన్నేను. దానివే ఎక్కువ

**'బికారీ, నీకివ్వడానికి నాదగ్గర ఏమీ లేదు,' అన్నాను స్పెయిన్ దేశస్థునిలాగా. కానీ నేనన్న మాటల మీద అతడు ధ్యాస పెట్టలేదు. మిగతా టేబుళ్ల దగ్గర నిలబడినంత సేపే నా ముందూ నిలబడి, దీనమైన కళ్లతో చూశాడు నన్ను. మనిషి అంతగా ధ్వంసం అవడం ఎప్పుడూ చూడలేదు నేను. హృదయాన్ని కలచివేసేదేదో ఉంది అతని వాలకంలో. ఆ తీరును చూస్తే అతనికి మతిస్తిమితం లేదనిపించింది. చాలా సేపైన తర్వాత కదిలి పోయాడు.**

కాపీలు కొనమని పేపరు కుర్రాళ్లు మొండిపట్టు పట్టారు కానీ, వద్దని వాళ్లను గట్టిగా మందలించాను. నిగనిగ మెరుస్తున్న నా బూట్లను పాలిష్ చేస్తామని జిడ్డు కారే కుర్రవెధవలు చేసిన అభ్యర్థనల్ని కనీసం ఇరవైసార్లైనా తిరస్కరించి ఉంటాను. చిల్లరడబ్బుల కోసం పదేపదే చేయి చాపి వేధించే బిచ్చగాళ్లకు తల అడ్డంగా ఊపడం తప్ప ఏమీ చేయలేకపోయాను. చిన్నపిల్లల్ని గుడ్డతో వీపుమీద కట్టుకుని చిరిగిన బట్టల్లో ఇండియన్ స్త్రీలు చిక్కిపోయిన తమ చేతుల్ని చాపి రాగాలు తీస్తూ చిన్నగా శోకాలు పెట్టసాగారు. గుడ్డివాళ్లను వెంటబెట్టుకుని చిన్నచిన్న కుర్రాళ్లు నా టేబులు దగ్గరికి వచ్చారు. భయంకరమైన పుండ్లతో వికలాంగులు, కుంటివాళ్లు, వికృతంగా కనిపించే మనుషులు, అర్ధనగ్న శరీరాలతో బక్కచిక్కిన పిల్లలు చిల్లర డబ్బుల కోసం అదేపనిగా బతిమిలాడటం మొదలు పెట్టారు. కానీ వీళ్లంతా బెల్టుతో వీపు మీద బాదే లావుపాటి పోలీసు మీద ఓ కన్నేసి ఉంచారు. పోలీసు రాగానే పరుగెత్తి పారిపోతూ కొంచెం సేపటికే మళ్లీ తిరిగిరావడం... ఇట్లా ఆఖరుకు ఆ పోలీసువాడు విసిగిపోయాడు.

నా దృష్టి అకస్మాత్తుగా ఒక బిచ్చగాని మీద పడింది. మిగతా బిచ్చగాళ్లలాగా, నా చుట్టూ కూర్చున్నవాళ్లలా కాకుండా అతని జుట్టు, గడ్డం ఎంత ఎర్రగా ఉన్నాయంటే, ఒక్కక్షణం సేపు నేను కొంచెం అదిరి పడ్డాను. గడ్డం బాగా పెరిగి ఉంది. పొడుగ్గా ఉన్న తలవెంట్రుకలను కొన్ని నెలలుగా దువ్వినట్టు లేదు. చిరిగి పేలికలై జిడ్డుతో కంపు కొడుతున్న ప్యాంటూ, పొట్టి బనీనూ తొడుక్కుని ఉన్నాడు. అంతగా చిక్కిశల్యమైపోయిన మనిషిని నేనెప్పుడూ చూడలేదు. అతని కాళ్లకు చేతులకు ఎముకలు, చర్మం తప్ప మరేవీ లేవు. ఆ వడలిన శరీరపు ఒక్కొక్క ఛాతీఎముక బనీను చిరుగుల్లోంచి స్పష్టంగా కనబడుతోంది. దుమ్ము నిండిన అతని పాదాల ఎముకలు సులభంగా లెక్కపెట్టగలిగే విధంగా ఉన్నాయి.

అక్కడున్నవాళ్లలో అందరికన్న ఎక్కువ బక్కపలుచని వ్యక్తి అతనే. అంతగా వయసు మీరినవాడేమీ కాదు. నలభై దాటి ఉండడు. అంతటి నికృష్ట స్థితికి ఎట్లా వచ్చాడా అనుకున్నాను. చేసేందుకు పని దొరికితే అతడు పని చేయడనుకోవడం వెర్రితనమే అవుతుంది. అక్కడున్న బిచ్చగాళ్లందరిలో మాట్లాడనిది అతడొక్కడే. మిగతావాళ్లు తమ విషాద గాథల్ని ఏకరువు పెడుతూ, తరిమి కొట్టేదాకా డబ్బులు అడుగుతున్నారు. అతను మాత్రం ఏమీ మాట్లాడటం లేదు. తన నికృష్టమైన వాలకం కంటె వేరే అభ్యర్థన అవసరం లేదనుకున్నాడేమో. ఊరికే చూస్తున్నాడే తప్ప చేయి కూడా చాపడం లేదు. కానీ దైన్యం నిండిన ఆ కళ్లలోని నిస్పృహను చూసి నా మనసు వికలమైంది. ఒక్కొక్కరి దగ్గరికి వచ్చి, కదలకుండా చాలా సేపు నిశ్శబ్దంగా నిలబడుతున్నాడు. ఎదుటివాడు గమనించకుంటే మెల్లగా పక్కటేబులుకు కదులుతున్నాడు. డబ్బు ఇవ్వకపోతే నిరాశపడటం కానీ, కోపగించుకోవడం గానీ చేయడం లేదతడు. ఎవరైనా ఓ నాణేన్ని ఇవ్వబోతే కొంచెం ముదుకు జరిగి, పంజా లాంటి చేయిని చాపి డబ్బు తీసుకుని, ఎలాంటి కృతజ్ఞతా తెలుప కుండా నిర్లిప్తంగా కదిలిపోతున్నాడు. నా దగ్గరికి వచ్చాడు. కానీ నా దగ్గర చిల్లర లేదు. అనవసరంగా అతణ్ని ఎక్కువ సేపు నిలిపి ఉంచడమెందుకని తలను అడ్డంగా ఊపాను.

'బికారీ, నీకివ్వడానికి నాదగ్గర ఏమీ లేదు,' అన్నాను స్పెయిన్ దేశస్థునిలాగా. కానీ నేనన్న మాటల మీద అతడు ధ్యాస పెట్టలేదు. మిగతా టేబుళ్ల దగ్గర నిలబడినంత సేపే నా ముందూ నిలబడి, దీనమైన కళ్లతో చూశాడు నన్ను. మనిషి అంతగా ధ్వంసం అవడం ఎప్పుడూ చూడలేదు నేను. హృదయాన్ని కలచివేసేదేదో ఉంది అతని వాలకంలో. ఆ తీరును చూస్తే అతనికి మతిస్తిమితం లేదనిపించింది. చాలా సేపైన తర్వాత కదిలి పోయాడు.

**కానీ కొద్దిసేపటికే మెలకువ వచ్చింది. మళ్లీ నిద్ర రాలేదు. గదిలో ఉక్కగా ఉంది. కిటికీ తలుపులు తెరిచి, చర్చి వంక చూశాను. ఆకాశంలో చంద్రుడు లేడు కానీ, మెరిసే చుక్కల వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్నది చర్చి. గోపురం మీది శిలువ పైనా, గోపురపు అంచుల మీదా కాకులు దగ్గరదగ్గరగా కూర్చుని అప్పుడప్పుడు కొంచెం కదులుతున్నాయి. ఆ దృశ్యం వింతగా తోచింది.**

మధ్యాహ్నం ఒంటిగంట అయింది. భోజనం చేశాను. పగటి కునుకు నుండి లేచేసరికి ఇంకా వేడిగానే ఉంది వాతా వరణం. సాహసించి కిటికీ తలుపులు తెరిచాను. సాయంత్రపు చల్లగాలి వీచేసరికి ఉండబట్టలేక ప్లాజాలోకి దూరాను. వరండాలో కూర్చుని డ్రింక్ కు ఆర్డరిచ్చాను. పక్కవీధుల్లోంచి జనం పెద్దసంఖ్యలో బిలబిలమంటూ వచ్చి చుట్టుపక్కల హోటళ్లలో నిండిపోయారు. వసారా మధ్యలో బ్యాండువాళ్లు బ్యాండు వాయించడం మొదలు పెట్టారు. జనసమ్మర్దం బాగా పెరిగింది. నల్లద్రాక్షల గుత్తి లాగా బెంచీల మీద ఒరిగి కూర్చున్నారు జనం. మాటల కలకలంతో అక్కడ ఆహ్లాదం నిండింది. పైన ఎగిరే గద్దలు గట్టిగా అరుస్తూ మధ్యమధ్య కిందికి పల్టీలు కొడుతూ, నడిచే మనుషుల కాళ్లసందుల్లోంచి దూరి పోతున్నాయి. సాయంత్రం అవగానే నగరంలోని గద్దలన్నీ చర్చిగోపురం మీద గుమిగూడి గట్టిగా అరుస్తూ అసహనంగా సర్దుకున్నాయి. పాలిష్ చేసే కుర్రాళ్లు బూట్లు తుడుస్తామని, పేపరబ్బాయిలు పేపరు కొనమని వేధించసాగారు. ఆ ఎర్రగడ్డపు వ్యక్తి మళ్లీ నిశ్చలంగా, జాలిగా ఒక్కొక్క టేబులు దగ్గర నిలబడటం గమనించాను. ఈసారి అతడు నా టేబులు ముందు ఆగలేదు. ఉదయం నన్ను చూసిన సంగతి జ్ఞాపకం వచ్చి, అప్పుడు నేనేమీ ఇవ్వలేదు కనుక మళ్లీ ప్రయత్నించడం దండగ అనుకుని

ఉంటాడు. ఎర్ర వెంట్రుకలున్న మెక్సికన్లు చాలా అరుదు. అంత దీనమైన స్థితిలో ఉండే మనుషుల్ని కేవలం రష్యాలోనే చూశాను నేను. ఇతను రష్యన్ కాదుగదా అనుకున్నాను అయాచితంగా. ఎందు కంటే, తనను తాను అంతటి హీనస్థితికి దిగజార్చుకోవడం రష్యన్ల నిరర్థకతకు సరిపోయే విధంగా ఉంది. కానీ అతని ముఖం రష్యన్ ముఖంలా లేదు. బక్కచిక్కినా ఆ రూపురేఖలు స్పష్టంగా తీర్చిదిద్దినట్టున్నాయి. ఆ నీలికళ్లు రష్యన్ల కళ్లలాగా తలలో కూరుకుపోయినట్టు లేవు. ఓడ ధ్వంసమై అంచెలంచెలుగా ఇంతటి దీనస్థితికి దిగజారిన ఇంగ్లిష్, స్కాండినేవియన్ లేక అమెరికన్ నావికుడేమో ఒకవేళ అనుకున్నాను. ఇంతలో అతను అదృశ్యమైపోయాడు. చేయవలసిందేమీ లేకపోవడం వల్ల, ఆకలి పుట్టేదాకా అక్కడే కూర్చున్నాను. భోజనం చేసింతర్వాత మళ్లీ వచ్చానక్కడికి. జనం పల్చబడి బాగా చీకటయ్యేదాకా కూర్చున్నాను. దినం భారంగా గడిచింది. ఇట్లాంటి రోజులింకా ఎన్ని గడపాలో ఇక్కడ, అనుకుని దిగులుతో నిద్ర పోయాను.

కానీ కొద్దిసేపటికే మెలకువ వచ్చింది. మళ్లీ నిద్ర రాలేదు. గదిలో ఉక్కగా ఉంది. కిటికీ తలుపులు తెరిచి, చర్చి వంక చూశాను. ఆకాశంలో చంద్రుడు లేడు కానీ, మెరిసే చుక్కల వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్నది చర్చి. గోపురం మీది శిలువ పైనా, గోపురపు అంచుల మీదా కాకులు దగ్గరదగ్గరగా కూర్చుని అప్పుడప్పుడు కొంచెం కదులుతున్నాయి. ఆ దృశ్యం వింతగా తోచింది. ఉన్నట్టుండి ఎర్రవెంట్రుకల ఆ వికృతాకారం నా మనసులో మెదిలింది. అంతకు ముందె క్కడో అతణ్ని చూసినట్టు హఠాత్తుగా ఒక వింత అనుభూతి కలిగింది నాకు. ఇక రాత్రి నిద్ర వచ్చే ఆస్కారమే లేనంత స్పష్టంగా, గాఢంగా ఉంది ఆ అనుభూతి. అంతకు ముందే నేనతణ్ని ఎక్కడో చూశాననేది నిశ్చయమనిపించింది. కానీ



ఎప్పుడు, ఎక్కడ అనేది తట్టడం లేదు. అతడెట్లాంటి పరిసరాల్లో ఉండివుంటాడో వాటిని నా మనసులో నిలుపుకునేందుకు ప్రయత్నించాను. కానీ మంచుపొర వెనుక మసక ఆకారంలా తప్ప మరేమీ కనబడలేదు నాకు. తెల్లవారబోతుంటే చలి కొంచెం ఎక్కువై నిద్రలోకి జారుకున్నాను.

వెరాక్రుజ్ లో నా రెండవ రోజు మొదటిరోజు లాగే గడిచింది. ఆ ఎర్ర వెంట్రుకల బికారి కోసం కలయచూశాను. నా పక్కటేబుల్ల దగ్గర నిలబడి ఉన్నాడతను. పరీక్షగా గమనించాను. అంతకు ముందెక్కడో నేనతణ్ని చూసిన సంగతి ఖాయమనిపించింది నాకు. అంతే కాకుండా అతడు నాకు పరిచయస్థుడైనట్టూ, అంతకు ముందు నేనతనితో మాట్లాడినట్టూ నిశ్చయంగా అనిపించింది. కానీ ఆ సందర్భాలను గుర్తు తెచ్చుకోలేక పోయాను. మళ్లీ అతడు ఆగకుండా నా టేబులు ముందుగా నడిచి పోయాడు. మెరుపు లాగా ఏదైనా జ్ఞాపకానికి వస్తుందేమోనని అతని కళ్లల్లోకి సూటిగా చూశాను. ఉహుఁ... నా అంచనా తప్పు కాదు కదా అనుకున్నాను. ఏదో ఒక సమయంలో అతడు నా జీవితంలో ప్రవేశించాడనే భావాన్ని నా మెదడులోంచి తీసివేయలేకపోయాను. నా మస్తిష్కం లోపలి పొరల్ని విదిలించి ఆలోచించిన తర్వాత, అతడు ఆంగ్లేయుడు లేక అమెరికన్ అయివుంటాడని కచ్చితంగా తేలిపోయింది. కానీ అతనితో మాట్లాడటానికి బిడియపడ్డాను. అతణ్ని నేను కలిసిన సందర్భాలేవో ఆలోచించడం మొదలు పెట్టాను. నాలుక మీదనే ఉండి గుర్తుకు రాకుండా తికమక పెట్టే పేరులాగా అతణ్ని సరిగ్గా జ్ఞాపకం చేసుకోలేకపోవడంతో నాకు చిరాకు కలిగింది. దినం గడిచిపోయింది.

మళ్లీ ఒక రోజు వచ్చి ఒక ఉదయమూ, ఒక సాయంత్రమూ గడిచి పోయాయి. ఆ రోజు ఆదివారం. ప్లాజా ఎప్పటికంటె ఎక్కువ జనంతో నిండి పోయింది. ఆరుబయట టేబుళ్లు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఎప్పటిలాగానే చిరిగిన పోగుల్లో మౌనంగా, దయనీయమైన స్థితిలో, ఒళ్లు జలదరింపజేసే ఆకారంతో వచ్చాడు ఆ ఎర్రవెంట్రుకల బిచ్చగాడు. నాకు రెండు టేబుళ్ల దూరంలో నిలబడి కదలకుండా మౌనంగా అర్థిస్తున్నాడు. ఈ బిచ్చగాళ్ల వేధింపుల బారినుండి జనాన్ని కాపాడేందుకు ప్రయత్నించే పోలీసు, పెద్ద చప్పుడయ్యేలా అతణ్ని బెల్టుతో ఫెడీలున బాది పోయాడు. ఆ దెబ్బతో అతని బక్కపలుచని శరీరం విలవిల్లాడింది. అయినా అతడు వారించడం కానీ, ఎదురు తిరగడం కానీ చేయలేదు. చర్మం చిట్లేలా తగిలిన ఆ దెబ్బను అతడు సాధారణ విషయం లాగా తీసుకున్నట్టనిపించింది. మెల్లగా చీకట్లోకి జారుకున్నాడు. కానీ ఆ క్రూరమైన దెబ్బ ఏర్పరచిన చారతో నా జ్ఞాపకశక్తిని కొరడాతో ఛళ్లున చరచినట్టై, ఆ మనిషెవరో హఠాత్తుగా గుర్తుకొచ్చింది నాకు.

అతని పేరు జ్ఞాపకం రాలేదు కానీ, మిగిలిందంతా గుర్తుకొచ్చింది. ఇరవై ఏళ్లలో నాలో అంతగా మార్పు రాలేదు కాబట్టి నన్నతడు గుర్తు పట్టే ఉంటాడు. ఆ కారణంగానే మొదటిరోజు తర్వాత నా టేబులు ముందు ఆగలేదతను. అవును, ఇరవై సంవత్సరాల క్రితం అతడు నాకు పరిచయమయ్యాడు. రోమ్ నగరంలో నేనొక చలికాలాన్ని గడిపినప్పుడు, వయా సిస్టినా అనే హోటల్లో ప్రతి సాయంత్రం భోజనం చేసేవాణ్ని నేను. మంచి మాకరోనీకీ, అద్భుతమైన మద్యానికీ ఆ హోటలు పెట్టింది పేరు. అక్కడికి ఇంగ్లీష్, అమెరికన్ కళాకారులు, ఒకరిద్దరు సాహిత్యకారులు తరచుగా వచ్చేవాళ్లు. పెయింగ్ మీదా సాహిత్యం మీదా ఎడతెగని వివాదాల్లో పడి, రాత్రి బాగా పొద్దు పోయేదాకా అక్కడే గడిపేవాళ్లం మేము. తన స్నేహితుడైన ఒక పెయింటర్ తో అక్కడికి వచ్చేవాడతడు. అప్పుడు అతను చాలా చిన్నవాడు. ఇరవై రెండు సంవత్సరాలు దాటి ఉండడు. నీలికళ్లు, చక్కగా తీర్చిదిద్దిన ముక్కు, ఎర్రవెంట్రుకలు... వీటితో చూడటానికి ఆకర్షణీయంగా ఉండేవాడు. సెంట్రల్ అమెరికా గురించి అతడు ధారాళంగా మాట్లాడటం గుర్తుకొచ్చింది నాకు. అమెరికాలోని ఒక పండ్ల కంపెనీలో అతనికి మంచి ఉద్యోగం ఉండింది. కానీ తాను ఒక రచయిత కాదల్చుకున్న కారణంగా ఆ ఉద్యోగాన్ని అతడు వదిలేశాడు. అతనికి తలబిరుసుతనం బాగా ఉండేది. దాన్ని ఓర్పుతో సహించడానికి మాలో వయసు మీరినవాళ్లెవరూ లేకపోవడం వలన, మా కూటమిలో అతనికి గుర్తింపు దొరకలేదు. మమ్మల్ని అతడు ఎందుకూ కొరగాని వాళ్లుగా ఎంచి, ఆ విషయాన్ని ఎలాంటి సంకోచం లేకుండా మా ముఖం మీదనే చెప్పేవాడు. తన రచనల్ని మాకు చూపించేవాడు కాదు. ఎందుకంటే, అతనికి మా మెప్పంటే లెక్క లేదు. మా విమర్శను ధిక్కరించేవాడు. అతనిది అమితమైన ఆత్మాభిమానం. అది మాకు చిరాకును కలిగించేది. కానీ మాలో కొందరికి అతని ఆత్మాభిమానం సమంజసమైనదని అనిపించేది కనుక, లోలోపలే అశాంతిగా ఉండేవారు తప్ప ఏమీ అనేవారు కాదు. తన అద్భుతమైన తెలివి పట్ల అతనికి గల విశ్వాసం భూమ్మీద నిలిచేది కాదు. రచయిత కావడానికి అన్నింటినీ త్యజించాడతడు. తన తెలివి గురించి అతడెంత మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఉండేవాడంటే, ఆ గుణం అతని స్నేహితుల్లో కొందరికి తగులుకుంది.

అతని ఉద్వేగాన్నీ, శక్తినీ, భవిష్యత్తు మీద అచంచల విశ్వాసాన్నీ, ఇంకా అతని నిర్లక్ష్యాన్నీ జ్ఞాపకం తెచ్చుకున్నాను. ఆ మనిషే ఈ బికారి కావడం అసాధ్యమనిపించింది. అయినా మళ్లీ నిస్సందేహంగా అతడే ఇతడనిపించింది. లేచి బిల్లు కట్టి, అతణ్ని వెతికేందుకని ప్లాజాలోకి వెళ్లాను. నా ఆలోచనలు ఉధృతం అవసాగాయి. అప్పుడప్పుడు అతడు నాకు జ్ఞాపకానికి వచ్చి, ఏమై ఉంటాడా అని ఆలోచించే

కథ

వాణ్ని. ఇంతటి భయంకరమైన నికృష్ట స్థితికి చేరుతాడని కలలో కూడా ఊహించలేదు నేను. ఉన్నతాశయంతో కళాప్రపంచంలో అడుగు పెట్టే యువకులు వందలు వేలు ఉన్నారు. కానీ వారిలో చాలా మంది తమ సాధారణ ప్రజ్ఞతో రాజీ పడి, బతుకుతెరువు కోసం ఏదో ఒక వ్యాపకాన్ని వెతుక్కుంటారు. కానీ ఇతని విషయం మాత్రం హృదయవిదారకం. ఏం జరిగి ఉంటుందా అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఏ ఆశయాలు అతని ఉద్వేగాన్ని తునాతు నకలు చేసి ఉంటాయి? ఎట్లాంటి నిరాశా నిస్పృహల మూలంగా అతడింతగా చితికిపోయి ఉంటాడు? ఏ విధమైన వ్యర్థభ్రమలు అతణ్ని ఈ స్థితికి తెచ్చివుంటాయి? దీనికి పరిష్కారమే లేదా అనుకున్నాను. ప్లాజా చుట్టు తిరిగి చూశాను. ఆరుబయటి వసారాలో అతడు కనబడలేదు. చుట్టూ మూగిన మూకలో కనబడతాడనే ఆశ లేదు. వెల్తురు పల్చబడిపోతుంటే ఇక నాకతడు దొరకడేమోనని దిగులు కలిగింది. చర్చి దగ్గరికి వెళ్లి చూస్తే మెట్లమీద కనిపించాడతడు. ఎంత దీనంగా ఉన్నాడో వర్ణించలేను. జీవితం అతడిని కృశింపజేసి, ఇనుపమేకులతో పొడిచి పొడిచి, ఒక్కొక్క అవయవాన్ని చీల్చి, రక్తసిక్తమైన శరీరపు ముద్దను మెట్లమీదికి విసిరిపారేసినట్టు ఉన్నాడు. అతనికి దగ్గరగా వెళ్లాను.

'రోమ్ జ్ఞాపకముందా,' అడిగాను.

అతడు కదలలేదు, జవాబివ్వలేదు. నేనక్కడ లేనే లేనట్టు, నన్ను గమనించ నట్టు ఊరుకున్నాడు. నావైపు చూడలేదు. అతని నీలికళ్ల లోని ఖాళీ చూపులు, మెట్లకింద అరుస్తూ దేన్నో చీల్చుతున్న కాకుల మీద నిలిచాయి. ఏం చేయాలో తోచలేదు నాకు. జేబులోంచి ఒక పెద్దనోటును తీసి అతని చేతిలో పెట్టి అదిమాను. అతడు దానివంక చూడనే లేదు. కానీ చేయిని కొద్దిగా కదిలించాడు. సన్నని వేళ్లను మూసి ఆ నోటును నలిపి, చిన్న ఉండ చేశాడు. దాన్ని పెద్దవేలి అంచుమీద నిలబెట్టి, గోల చేస్తున్న కాకుల గుంపులో పడేలా గాల్లోకి విసిరేశాడు. ఉత్కంఠతో తల తిప్పి చూశాను నేను. ఒక కాకి ఆ ఉండను తన ముక్కుతో కరచిపట్టుకుని ఎగిరిపోతుంటే, మరో రెండు కాకులు అరుస్తూ దానివెంట ఎగిరిపోయాయి. వెనక్కి తిరిగి చూస్తే అతడక్కడ లేడు.

వెరాక్రుజ్‌లో మరో మూడు రోజులు గడిపాను నేను. అతడు నాకు మళ్లీ కనపడలేదు.

కవిత

# చెలియలి కట్ట దాటని కన్నీరు



నస్రీన్ ఖాన్

ఏనాడైనా చూసావా
నీరింకిన బావులను
ఎండిపోయిన చెరువులను
చూసినా హృదయాన్ని అదిమిపట్టి
శుష్క చూపులను సారించి ఉంటావు

పోనీ యాభై ఏళ్ళుగా
నిన్నంటి పెట్టుకునే
సంచరించే మౌన జీవి
కళ్ళలోకి ఏనాడైనా
చూసే ప్రయత్నం చేసావా

కోడి తన రెక్కల కింద
తన పిల్లలను పొదువుకున్నట్లు
నీకంటూ సృష్టించుకున్న
సామ్రాజ్యాన్ని
పేరునూ ప్రతిష్ఠనూ
ఎంత నిశ్శబ్దంగా రక్షిస్తుందో
ఏనాడైనా గమనించావా

గుండె గదులకు
వేసి ఉన్న తాళాలు తెరు
ఒక్కసారి తరిచి చూడు
నీకంటూ ఇంత చెమ్మ
మిగిలే ఉంటుంది

కేవలం నీకోసమే అంకితమై
నీ అడుగులకు మడుగులు ఒత్తుతూ
నీ మార్దవపు చూపులకోసం
ఎదురు చూసీ చూసీ
పొడిబారిన మసక కళ్ళలో
ప్రతిష్ఠించుకున్న నీ ప్రతిబింబం
నీకే కొత్తగా కనిపిస్తుంది

ఎన్నేళ్ళుగా దాగి ఉన్నాయో
చెలియలికట్ట వెనుక
బతుకు పరమార్థపు మర్మం
ఆ కళ్ళలోనే చాలు కదా!

సాహితీ శిఖరం

# జ్ఞానపీఠం పై వెలుగులీనిన తెలుగు కవి సామ్రాట్...

# విశ్వనాథ

1970 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

**1895** సెప్టెంబరు 10న జన్మించిన విశ్వనాథ సత్యనారాయణ 20వ శతాబ్దపు తెలుగు రచయిత. “కవి సామ్రాట్” బిరుదాంకితుడు. అతని రచనలలో కవిత్వం, నవలలు, నాటకం, చిన్న కథలు, ప్రసంగాలు ఉన్నాయి. చరిత్ర, తత్వశాస్త్రం, మతం, సామాజిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, భాషాశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, స్పృహ అధ్యయనాలు, జ్ఞాన శాస్త్రం, సౌందర్యం, ఆధ్యాత్మికత వంటి అనేక రకాల విషయాలను ఆయన సాహిత్యం ప్రతిఫలిస్తుంది. ఆయన ప్రసిద్ధ రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం, కిన్నెరసాని పాటలు, నవల వేయిపడగలు ఉన్నాయి. ఆయన 1971లో భారత ప్రభుత్వ పద్మభూషణ్ పురస్కారం, తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డును అందుకున్నారు. 20వ శతాబ్దంలోని తెలుగు సాహిత్యానికి , ప్రత్యేకించి సంప్రదాయ సాహిత్యానికి విశ్వనాథ వారు పెద్ద దిక్కు. అతను చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు - కావ్యాలు, కవితలు, నవలలు, నాటకాలు, పద్యకావ్యాలు, ప్రయోగాలు, విమర్శలు, వ్యాసాలు, కథలు, చరిత్రలు ఇలా అన్ని ప్రక్రియలలో ఆయనది అందెవేసిన చేయి. ఆయన ప్రతిభ గురించి తన మాటలలోనే “నేను వ్రాసిన పద్యాల సంఖ్య , ప్రకటింపబడిన సంఖ్య, సుమారు ఇరువది వేలుండ వచ్చును. నేను చింపివేసినవి ఏబది వేలుండవచ్చును”.

“విశ్వనాథ మాట్లాడే వెన్నెముక” అని శ్రీశ్రీ, “ఆధునికాంధ్ర జగత్తులో విశ్వనాథ ఒక విరాణ్మూర్తి” అని జి.వి. సుబ్రహ్మణ్యం చెప్పిన మతాలలో కొంచెం కూడా అతిశయం లేదు. వచన కవిత్వం ఐనా అతను చేపట్టని సాహితీ ప్రక్రియ లేదు. పట్టింది బంగారం చేయని పట్టూ లేదు. గేయం వ్రాసినా, పద్యం రచించినా, ముక్తం వ్రాసినా, మహా కావ్యాన్ని రచించినా విశ్వనాథ కృతిలో అతనిదైన ఒక వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది.

వాక్కులో, వాక్యంలో, శబ్దంలో, సమాసంలో, భావంలో, భావనలో, దర్శనంలో, విమర్శనంలో, భాషణంలో, భూషణంలో ఒక వైలక్షణ్యం వెల్లివిరుస్తుంది. మహాకవిగా మనుగడ సాగించడానికి ఉండవలసిన మొదటి లక్షణం - ఈ వ్యక్తిత్వం. “విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి - ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి అతను మొదటి రచనలలోనివి. విశ్వనాథ రచనలలో



అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి.

తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు లభించినది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని ఆయన స్వయంగా చెప్పుకున్నారు. ఎందరో కవులు వ్రాసినా మళ్ళీ రామాయణం ఎందుకు వ్రాయాలంటే “రోజూ తింటున్నామని అన్నం తినడం మానివేయడంలేదుగదా” అన్నారు. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపథ్యంలో వచ్చిన నవల “ఏకవీర”ను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఏకవీర సినిమా కూడా వచ్చింది. వేయిపడగలు నవలను మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు “సహస్రఫణ్” పేరుతో హిందీ లోకి అనువదించారు. భారతీయ సంస్కృతి, ఆచారం, విశేషాలు, మధ్య తరగతి జీవన విధానాలు ఈ నవలలో విశేషంగా చూపబడ్డాయి.

కోకిలమ్మ పెళ్ళి, కిన్నెరసాని పాటలు యువతరాన్ని ఆకట్టుకొనే వ్యావహారిక భాషలో వ్రాశారు. విశ్వనాథ నవలలలో పురాణవైర గ్రంథమాల క్రింద వచ్చిన 12 నవలలు మహాభారతానంతర పూర్వయుగ భారతదేశ చరిత్రను మరొకవిధంగా చూపుతాయి. అయితే వీటిలో ప్రతి నవలా ఉత్సుకతతో నిండిన కథ, అనితరమైన అతను శైలి, విశేషమైన పాత్రలతో పాఠకులను ఆకట్టుకొంటాయి. “నీవు కవివయితే ఆ శబ్దము వ్యంజకమై కావ్యత్వాన్ని పొందుతుంది. కవివయితే నంటే ఏమిటి? కవియైనవాడు లోకాన్ని చూచే దృష్టివేరు వానికి కనిపించే లోకము అందరు చూచే లోకమే” అంటూ కవిని గురించి విశ్వనాథ ఇచ్చిన నిర్వచనం సదా అనుసరణీయం. 1957లో విశ్వనాథ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగానూ, 1958లో శాసనమండలికి నామినేటెడ్ సభ్యులుగానూ విధులు నిర్వర్తించారు. హృదయ సంబంధమైన ఇబ్బందులతో ఆయన 1976 అక్టోబర్ 18న ఆయన గుంటూరు ప్రభుత్వ దవాఖానలో తుది శ్వాస విడిచారు.

ముఖాముఖి

# రచయితగా తెలంగాణ నాలో అంతర్భాగం...

## - అఫ్సర్

అఫ్సర్ కవిగా, రచయితగా, సారంగ పత్రిక సంపాదకునిగా ఎన్నో సాహిత్య సేవలు అందించారు. ఇతని బాల్యం అంతా ఖమ్మంలో జరిగింది. వీరు తండ్రి ద్వారా సాహిత్య రంగానికి పరిచయం అయ్యారు. వీరికి చిన్నప్పటి నుండే దాశరథి, శ్రీశ్రీ లాంటి మహా కవులతో మాట్లాడే అవకాశం దక్కింది. అఫ్సర్‌తో తంగేడు పక్షపత్రిక ఈ వారం ముఖాముఖి మీ కోసం...

**మిమ్మల్ని వెంటాడుతున్న మీ బాల్యంలోని ఏదైనా సంఘటన ?**

అయిదో తరగతి చదువుతున్నప్పుడు ఒక ఆదివారం మా వూరు చింతకానిలో (ఖమ్మం జిల్లా) చెరువొడ్డుకి వెళ్ళాను స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి. అప్పటికే అక్కడ చెరువులో ఈత కొడుతున్న మా సీనియర్లు అక్కడి నించి మమ్మల్ని తరిమేశారు. "చిన్నపిల్లలకు అప్పుడే ఈత ఎందుకు?" అని. మేం వెనక్కి తిరిగివచ్చిన కొద్దిసేపట్లో ఊరంతా పెద్ద వార్త. ఆ సాయంత్రం ఈత కొడుతున్న వాళ్ళల్లో వొకరు చెరువు నాచులో చిక్కుపడిపోయి, మునిగి పోయారు. ఆ చనిపోయిన వ్యక్తి నా మిత్రుడు కృష్ణమూర్తి. చాలా మంచి వ్యక్తి. అందరికీ అభిమానపాత్రుడు. ఇప్పటికీ ఎక్కడైనా చెరువు దగ్గిరకి వెళ్తే, ఈ సంఘటన వెంటనే గుర్తొచ్చి కళ్ళ నీళ్లొస్తాయి. నా లేత మనసు మీద ఆ మరణం చెరగని ముద్ర. అప్పటికి నేను దగ్గిరవాళ్ళ మరణాలేమీ చూసిన వాణ్ని కాదు. ఇప్పటికీ ఏ మరణం గురించి అయినా వింటే, అదే గుర్తొస్తుంది.

**మీరు ఇంగ్లీషు సాహిత్యం చదువు కున్నారు, గోల్డ్ మెడల్ కూడా పొందారు. తెలుగులో మంచి ప్రావీణ్యత సంపా దించుకున్నారు. ఇండియాలో మీ ఉద్యోగ విశేషాలు, అమెరికా లో స్థిరపడటం గురించి క్లుప్తంగా మా పాఠకులకి?**



ఇంగ్లీషు నవలలు, కవిత్వం అంటే మొదటి నుంచీ ఆసక్తి. నేనొక పల్లెటూరి నుంచి వచ్చాను. ఖమ్మం రాగానే నన్ను కాన్వెంటు స్కూల్లో చేర్పించారు. ఇంగ్లీషు మాట్లాడడం రాదని తోటివాళ్లు వెక్కిరించే వాళ్ళు. ఆ కసితో ఇంగ్లీషు చదవడం అలవాటు చేసుకున్నాను. ముఖ్యంగా ఇంగ్లీషు నవలలు విపరీతంగా చదివే వాణ్ని. అప్పట్లో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో అమెరికన్ రిసోర్స్ సెంటర్ వుండేది. అక్కడ సభ్యత్వం తీసుకుంటే, వాళ్ళే పుస్తకాలు పోస్టులో పంపించేవాళ్లు. తిరుగు పోస్టేజీ కూడా వాళ్ళే పెట్టుకునే వాళ్ళు. అంతేకాకుండా, ఎవరైనా అమెరికన్ రచయితలూ కవులూ వస్తే, కలవడానికి ఆహ్వానం పంపించేవాళ్లు. ఆ విధంగా చాలా మంది విదేశీ రచయితల్ని కలుసుకున్నాను నా డిగ్రీ పూర్తయ్యే లోపు- బహుశా, అమెరికన్ సాహిత్యం మీద వున్న ఆసక్తి నన్ను అమెరికా దాకా లాక్కు వచ్చిందేమో అనిపిస్తుంది. కానీ, అదొక చిన్న ప్రేరణ మాత్రమే అనుకుంటాను. యూనివర్సిటీలో పనిచెయ్యాలనేది పెద్ద కోరిక. ఇండియాలో నాకు ఆ

ముఖాముఖి

అవకాశం దక్కలేదు. అప్పటికే ఇంగ్లీషులో కొంత కవిత్వం రాయడం, పెద్ద పత్రికల్లో అది అచ్చు వేయడం వల్ల అమెరికాలో కొన్ని పరిచయాలు అయ్యాయి. ఆ సమయంలోనే వెల్చేరు నారాయణరావు పరిచయ మయ్యారు. అమెరికన్ యూనివర్శిటీల పనితీరు నచ్చింది. ఇక్కడి వాళ్ళకి కూడా నా పనితీరు నచ్చడం వల్ల, అధ్యాపకుడిగా గుర్తింపు దక్కడం వల్ల అది అమెరికన్ పౌరసత్వం దాకా తీసుకువెళ్ళాయి.

**ఇప్పుడు మీ వృత్తి, ప్రవృత్తి అయిన సాహిత్య రచన - రెండూ సాహిత్య రంగం తోనే ముడి పడి ఉన్నాయా?**

కొంత మేరకు మాత్రమే వున్నాయని చెప్పాలి. కానీ, నేను బోధించే కోర్సులలో కొన్ని మాత్రమే సాహిత్యానికి సంబంధించినవి. ఎక్కువగా నేను సాంస్కృతిక రంగాలూ, వాటి సామాజిక అస్తిత్వాల గురించిన కోర్సులు చెప్తాను. ఆ రంగాలలో పనిచేసే పరిశోధకులే నా దగ్గరకి విద్యార్థులుగా వస్తారు. ఆ విధంగా వృత్తి ప్రవృత్తీ వేర్వేరు అయ్యాయి. అయితే, రచయితగా నా కృషి మీద ఇక్కడి వాళ్ళకి ఆసక్తీ, గౌరవం వుండడం వల్ల నన్ను సాహిత్య విషయాలలో కూడా సమానంగానే స్వీకరిస్తారు.

**మీ సాహిత్య ప్రస్థానం, ఇప్పటి వరకూ ప్రచురించిన పుస్తకాలు. ఈ విషయాలు ఇప్పటికే చాలా ఇంటర్వ్యూలో చెప్పారు, కానీ మా కోసం మరొక్కసారి....**

కొత్తగా చెప్పాల్సింది తక్కువే వుంది. ఇప్పటిదాకా రాసిన కవిత్వమంతా పెద్ద సంపుటిగా అందుబాటులో వుంది. కథల సంపుటి "సాహిల్ వస్తాడు" , అంతకు ముందు రెండు విమర్శ పుస్తకాలు వెలువడ్డాయి. Evening with a sufi శీర్షికతో ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ద్వారా ఇంగ్లీషులో కవిత్వం మొన్ననే వచ్చింది. ఇంకా కవిత్వం రాసే శక్తి వున్నట్టే వుంది. కానీ, కథల వైపు దృష్టి మళ్లుతోంది. రాయాలి కానీ, సమయమే తక్కువ.

**మీకు అటు ఇంగ్లీష్ లోనూ, ఇటు తెలుగులోనూ మంచి ప్రావీణ్యం ఉంది. ఇంకా మీరు అమెరికా లాంటి ఆంగ్ల దేశంలో ఉన్నారు. మీరు భారతదేశంలో కాకుండా అమెరికాలో ఉన్నందువ సాహిత్య పరంగా, లేదా వ్యక్తిగతంగా మీకు ఏదైనా ప్రయోజనం కలిగింది అనుకుంటున్నారా? అయితే ఏవిధంగా?**

అమెరికాలో వుండడం వల్ల నాకు కొత్త పాఠకులు కనిపిస్తున్నారు. నా రచనలు తెలుగులోనే కాకుండా ఇంగ్లీషులో కూడా చదవాలన్న ఆసక్తి వాళ్ళకి వుంది. ముఖ్యంగా ఇప్పటిదాకా కొన్ని వందల మంది విద్యార్థులు నా దగ్గర చదువుకున్నారు. వాళ్ళల్లో ఎక్కువమంది సాహిత్యాభిమానులే కాబట్టి వాళ్ళ నించి కూడా ఇంగ్లీషు రచనల కోసం చాలా వొత్తిడి వుంది. ఇట్లా ఇంగ్లీషు అనేది నా సాహిత్య వ్యక్తిత్వంలో కలగలసి పోయింది. అట్లాగే, నేను చెప్పే కోర్సులలో కూడా ఇంగ్లీషు నుంచి అనువాదమైన తెలుగు రచనలు కొంత ప్రవేశ పెడుతూ వుంటాను. నా కోర్సులలో వాటిని చూసి, తమ కోర్సులలో తెలుగు అనువాదాలు పెట్టే ప్రొఫెసర్ల సంఖ్య కూడా పెరుగుతూ వుంది. ఇది చాలా పెద్ద ప్రయోజనం. ఆ విధంగా కొత్త తరానికి మన సాహిత్య సంస్కృతులు తెలుస్తున్నాయి.

**పోయెట్రీ రీడింగ్ సెషన్ లో ఇతర భాషల్లోని కవులతో కలసి కవిత్వ పఠనం చేసినప్పుడు మీరు పరిశీలించిన అంశాలేమి? మన తెలుగు సాహిత్యానికి ఉపయోగకరంగా.. మనము ఇది మిస్సవుతున్నాయి అనిపించిన అంశాలు ఏమైనా ఉన్నాయా?**

ఇండియాలో వుండగా కూడా నేను చాలా సార్లు ఇతర భాషల కవులతో కలసి కవిత్వ పఠనం చేశాను. కానీ, అమెరికాలో ఇది భిన్నమైన అనుభూతి. అమెరికన్ సాహిత్య సమూహాలు మనల్ని అంత తేలికగా దగ్గిరకి రానివ్వవు. ఉన్నత సృజనాత్మక ప్రమాణాల పేరుతో చాలా మటుకు అక్కడ మనకి ప్రవేశం దొరకదు. అయితే- మొదటి నించీ నేను ఈ సమూహాలకు దగ్గిరగానే వుండే వాణ్ని. అమెరికన్ సాహిత్యం తగినంత చదువుకొని వుండడం వల్ల నాకు ఆ ఎంట్రీ పాస్ దొరికిందేమో అనిపిస్తుంది. వీళ్ళ సాహిత్య సమావేశాల నుంచి నేర్చుకోవాల్సినవి చాలా వున్నాయి.



ముఖ్యంగా- వీళ్ళ ప్లానింగ్. ఆరు నెలల ముందు ప్లాన్ చేస్తారు. ఈవెంట్ నూటికి నూరు పాళ్ళు సఫలం కావడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తారు. తక్కువమందినే ఆహ్వానిస్తారు. ఈ సాహిత్య సభలు రాజకీయ బహిరంగ సభల మాదిరిగా వుండవు. రాశి కంటే వాసి ముఖ్యం అనుకుంటారు.

**"ఈవెనింగ్ విత్ ఏ సూఫీ" ఆంగ్ల అనువాదం మీరూ, శామల గల్లఘా Shamala Gallagher - చేశారు కదా. మీ కవిత్వం చదివిన ఇతర భాషల్లోని పాఠకుల/కవుల స్పందనలు ఎలా ఉన్నాయి?**

ఇప్పటిదాకా మంచి సమీక్షలు వచ్చాయి. అంతకంటే ఎక్కువగా, అమెరికాలో వివిధ ప్రాంతాలలో పొయెట్రీ రీడింగ్/ చర్చలకు ఆహ్వానాలు వస్తున్నాయి. వచ్చే ఆరునెలలలో ప్రతి నెలా దాదాపు ఒక నగరంలో కవిత్వ పఠనం చేస్తున్నాను. తెలుగు కవిత్వం గురించే కాకుండా, సమకాలీన భారతీయ సాహిత్యం గురించి చర్చలకు ఈ అనువాదం ప్రేరణ ఇస్తోంది.

**మీ ఇంకొక గ్రేట్ అచీవ్‌మెంట్ Festival of pirs ప్రస్థానం ఎలా జరుగుతుంది? వాటి ఆసక్తికర గురించిన విషయాలు తెలియజేస్తారా?**

ఈ పుస్తకం తాజా ఎడిషన్ ఇటీవలనే వెలువడింది. దాదాపు అరవై యూనివర్శిటీలలో ఇది పాఠ్య పుస్తకం. దక్షిణ భారత దేశంలో సాంస్కృతిక చరిత్ర గురించి ఇంగ్లీషులో ఇప్పటికీ మనకి సరైన పుస్తకాలు లేవు. ఆ వైపుగా చర్చలకు ఈ పుస్తకం నాంది పలికింది.

**ఎప్పుడూ ఏదో ఒక పుస్తకంతో సోషల్ మీడియాలో, సాహిత్య రంగంలో సందడిగా ఉండే మీరు 'సాహిల్ వస్తాడు' తర్వాత 'ఫెస్టివల్స్ ఆఫ్ పీర్'. ఇప్పుడు 'ఈవెనింగ్ విత్ ఏ సూఫీ' తర్వాత రాబోయేది?**

వచ్చే ఏడాది అంటే 2023 లో "సాహిల్ వస్తాడు" ఇంగ్లీషు అనువాదం ఓరియంట్ లాంగ్మన్ ప్రచురణ సంస్థ నుంచి రాబోతోంది. హైదరబాద్/



తెలంగాణ సాహిత్య చరిత్ర గురించి ఇంగ్లీషులో రాసిన కొత్త పుస్తకం కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి ప్రచురణ అవుతోంది. ఇవి రెండూ వచ్చే సంవత్సరమే వెలువడుతున్నాయి.

**మీ రచనల్లో ఎక్కువగా మానసిక సంఘర్షణ, జీవన సంఘర్షణ కనిపిస్తుంది. కానీ ఆర్థిక సమస్యలు, కుటుంబపరమైన సమస్యలు, ఉద్యోగ సమస్యలు లాంటివి కనపడవు అని మీకు ఎప్పుడయినా అనిపించిందా?**

చాలా మంచి ప్రశ్న అడిగారు. నిజంగా నేను ఆ కోణం నుంచి పెద్దగా ఆలోచించలేదు. అయితే, నేను కథల్లో చెప్పే అనేక మానసిక సంఘర్షణలకు కుటుంబమూ, ఆర్థికమూ, ఉద్యోగ వ్యవస్థ చాలా మటుకు పునాది అనుకుంటున్నా. అవి వాచ్యంగా చెప్పకపోయినా, ఆ కథల్లోని పాత్రల జీవితంలోంచి వాటిని గమనించవచ్చు.

**అమెరికాలో మీ చుట్టూ ఎన్నో జరుగుతున్నాయి. ఇమ్మిగ్రేషన్, విద్య, ఉద్యోగాలు స్ట్రెస్ వల్ల అకాల మరణాలు domestic violence (women and men) వాటి గురించి మీ రచనలేమైనా ?**

వచ్చే ఏడాది కొన్ని కథలకు రాసుకున్న నోట్సులో ఈ విషయాలు కనిపిస్తాయి. వివరాలు మీకు ఆ కథలు బయటికి వచ్చినప్పుడే తెలుస్తాయి.

**తెలంగాణ ఉద్యమ కాలంలో సాహిత్య పరంగా, ఒక తెలంగాణ ఉద్యమ కారుడిగా (ఒక వ్యక్తిగా, ఒక రచయితగా) మీరు చేసిన కార్యక్రమాలు?**

నా వ్యక్తిత్వం నిర్మాణంలో, రచయితగా, అధ్యాపకుడిగా, చరిత్ర పరిశోధకుడిగా నాలో తెలంగాణ అంతర్భాగం. ఇప్పుడు నేను ఆ వూళ్ళల్లో లేకపోయినా, తెలంగాణ నాలోపలే వుంది. ఉద్యమ కాలానికి ముందే సాహిత్య పరంగా, ఉద్యమ పూర్వ దశ (తెలంగాణ ఉద్యమం 2000 తరవాతే మొదలు కాలేదు కదా!)లో నా పాత్రా, ముఖ్యంగా మా కుటుంబం పాత్రా నన్ను ముందుకు నడిపిస్తూనే వున్నాయి, వుంటాయి. ఇటీవలి ఉద్యమ కాలంలో తెలంగాణ గురించి అమెరికాలోని చాలా నగరాల్లో మాట్లాడాను. నిరసనల్లో పాల్గొన్నాను. పత్రికల్లో రాశాను.

**అమెరికాలో కూడా ఎందరో ఎన్నారైలు తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్నారు కదా, (అమెరికా నేపథ్యంలో) ఉద్యమంలో మీ పాత్ర?**

అమెరికాలో ఇప్పుడు తెలంగాణ ప్రాముఖ్యం పెరుగుతూ వుంది. యూనివర్సిటీ కాంపస్ లలో కూడా తెలంగాణ నినాదాలు వినిపిస్తూనే వున్నాయి. తెలంగాణ ఉద్యమం తరవాతి ప్రవాస చరిత్ర ప్రత్యేకించి రాయాల్సిన/ పరిశోధించాల్సిన విషయం. తెలంగాణ వాదిగా, అధ్యాపకుడిగా, చరిత్రకారుడిగా ఈ ప్రతి సన్నివేశంలో నేనూ వున్నాను.

**Telangana ఉద్యమంలో మీరు ఆక్టివ్ పాత్ర పోషించారు కదా.. నాకు తెలిసి మీకు అన్ని ప్రాంతాల నుండి పాఠకులు ఉన్నారు. మీ కవిత్వాన్ని మెచ్చుకున్న ఇతర ప్రాంతాల పాఠకుల స్పందన ఉద్యమ రీత్యా ఎలా ఉంది?**

**ఏవన్నా చేదు జ్ఞాపకాలు? ఉదాహరణకు సైబాబ విజయవాడ బుక్ ఫెయిర్‌కి వెళ్ళినపుడు తీవ్రమైన వ్యతిరేకత, దాదాపు భౌతిక దాడికి సిద్ధమయ్యారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఏమన్నా చర్యలు తీసుకున్నారా?**

నేను సాహిత్యవ్యాసంగం మొదలు పెట్టిన కాలంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆందోళన లేదన్నది మనం ఇక్కడ గుర్తుపెట్టుకోవాలి. కాబట్టి, నా పాఠకులు 1980ల నుంచీ వుంటారు. వాళ్ళు వేర్వేరు ప్రాంతాల నుంచే కాకుండా, వేర్వేరు దృక్పథాల నుంచి కూడా వస్తారు. నాలోపలి తెలంగాణ, ముస్లిం అస్తిత్వాలు నచ్చని పాఠకులు కూడా వుంటారు. వాళ్ళు బహిరంగంగానే నా కొన్ని రచనల మీద నిరసన ప్రకటించిన సందర్భాలున్నాయి. వాటిని నేను మనఃస్ఫూర్తిగా ఆహ్వానిస్తాను. నా లోపల తీవ్ర వ్యక్తీకరణా, మృదువైన వ్యక్తీకరణా రెండూ వుంటాయి- సందర్భాన్ని బట్టి! కానీ, మౌలికంగా కొంచెం నెమ్మదిగా వుండే తత్వమేమో! దూకుడు తక్కువ. అందుకే, రచయితగా కూడా నా ప్రోగ్రెస్ నెమ్మదిగానే వుంటుంది. భిన్నాభిప్రాయాల్ని గౌరవిస్తాను. చదువుతాను. అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాను. అన్నిటికీ మించి, మానవ సంబంధాలలో స్నేహానికి కాస్త ఎక్కువ విలువ ఇస్తాను. ఇవన్నీ నాకు తెలీకుండానే చేస్తూ వుంటాను. పనికట్టుకొని ఏమీ చెయ్యను.

**ఈ మధ్య మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిన అంశం? ఒక సినిమా, ఒక సంఘటన, ఒక రచన ఏదైనా లేదా?**

చాలా వున్నాయి. Black Lives Matterతో పాటు ప్రపంచ వ్యాప్తంగా వివిధ నిరసన ఉద్యమాలు నాకు కొత్త స్ఫూర్తి. ఇరాన్ సినిమాలకు పిచ్చి అభిమానిని. స్థానికత ఇరుసుగా వచ్చే ప్రతి రచనా వెంటనే చదివేస్తాను. వీటి నుంచి చాలా నేర్చుకుంటున్నాను. నా కోర్సులకు భిన్న దేశాల నుంచి, భిన్న భాషల నుంచీ విద్యార్థులు వస్తారు. వాళ్ళతో దాదాపు రోజూ కలుస్తూనే వుంటాను కాబట్టి, వాళ్ళ



నుంచి చాలా నేర్చుకుంటున్నాను. రోజువారీ కనీస అవసరాలు కూడా లేని స్థితిలో వాళ్ళు జీవితాన్ని ఎదురీదే తీరు నాకు పెద్ద పాఠం.

**కొందరు రచయితలు చాలా వేగంగా సాహిత్యరంగంలో తమకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటుచేసుకుంటున్నారు. అలాంటి వారిపైన ఈ మధ్య కొందరు సీనియర్ రైటర్లు బాహాటంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. మీ దృష్టికి కూడా వచ్చే ఉంటుంది. విశ్వనాథ సత్యనారాయణ గారు లాంటి ప్రముఖ కవులు కూడా ఎందరో క్రొత్త రచయితలని ప్రోత్సహించారు. ఇలాంటి అసహనం వ్యక్తం చేస్తున్న రచయితలకి మీరిచ్చే సలహా ఏంటి?**

అసహనం ఎందుకు? అక్కర్లేదేమో! ఇంతకుముందు కంటే ఇప్పటి తరానికి ఎక్కువ సవాళ్ళు వున్నాయి. ఎక్కువ బాధలున్నాయి. కొంతమంది కనీసం చిరుద్యోగులు కూడా కాదు. అయినా, రచన మీద దృష్టి పెడుతున్నారు. రాస్తున్నారు. తమకి న్యాయంగా రావాల్సిన గుర్తింపు రావడం లేదన్న బాధలోంచి కొంత అసంతృప్తి కూడా వుండచ్చు. తాము ఎలాంటి స్థితిలోంచి వచ్చి, ఈ మాత్రం పేరూ, పలుకుబడి సంపాదించుకున్నారో మరచిపోతున్నారు కొందరు సీనియర్లు. బానిసల్లాంటి శిష్యుల్ని తయారుచేసుకునే రందిలో పడిపోయి, సమతూకం తప్పుతున్నారు. వాళ్ళ పట్ల జాలిపడదాం. కొత్త తరం నుంచి నేర్చుకుందాం. కొత్త జీవిత పాఠాలు ఎప్పుడూ వుంటాయి కదా!

**అమెరికా తెలుగు రచయితల సమావేశం, ఇటీవల డల్లాస్ లో జరిగింది. అన్నీ డిసైడ్ చేసిన తర్వాత ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారని, కొందరు రచయితలకు ఫేస్బుక్ అక్కౌంట్ కూడా లేదని, చాలా మంది రచయితలకు కనీసం ఇమెయిల్ ద్వారా గానీ, ఫోన్ ద్వారా కూడా తెలుపలేదు అని ముందు చెపితే మేము కూడా ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకునే వారం కదా అని అసంతృప్తి తో వున్నారు. మీరు అందులో ఒక నిర్వాహకులు కదా? మీ సమాధానం?**

ఈ సమావేశాలు కొత్త ఆలోచన. కొన్ని నిర్వహణపరమైన ఇబ్బందులు ఉన్నాయి. వాటిని మేం కూడా గమనిస్తున్నాం. క్రమంగా అమెరికా తెలుగు రచయితలందరికీ ఎలాంటి వివక్షా లేకుండా ఇందులో భాగస్వామ్యం దక్కుతుంది. కొంచెం ముందు ప్లాన్ చేయడం ద్వారా ఈ లోపాల్ని దాటుకొని వెళ్తామని ఆశ వుంది.

**మీరు ప్రపంచ సాహిత్యాన్ని చదువుతున్నారు, అమెరికాలో ప్రపంచ సంస్కృతిని చూస్తున్నారు. తెలుగులో ఇంకా ఎలాంటి సాహిత్యం, సంస్కృతి వస్తే బాగుంటుందని అనుకుంటున్నారు?**

ముఖాముఖి

భిన్నత్వం పెరగాలి. భిన్నసంస్కృతుల పట్ల అవగాహన పెరగాలి. పీడితుల పక్షపాతం పెరగాలి. ఈ మూడూ ప్రస్తుతానికి గట్టిగా చెప్పాలనుకున్నవి.

**మీరు సాహిత్యం రాసేటప్పుడు సవాలుగా అనిపించిన సందర్భం?**

ఒకటి కాదు, చాలా సందర్భాలు న్నాయి. అసలు భాషే పెద్ద సవాలు కదా! ఆ తరవాత నేను ఎవరికోసం రాస్తున్నాను అన్నది ఇంకో సవాలు.

**కొందరు కవులు, రచయితలకు కొన్ని అంశాలు వారి రచనల్లో చర్చించడం అస్సలు ఇష్టం ఉండదు. ఈ అంశం మాత్రం రాయొద్దు అనే అంశాలు మీకు ఉన్నాయా?**

లేనే లేవు. ఎంత జీవితాన్ని చూస్తున్నానో, అంత జీవితమూ రచనల్లోకి రావాల్సిందే. కొన్ని సందర్భాలు లోపంగా అనిపించినా, ఆ లోపంతో సహా చెప్పాల్సిందే.

**మీగురించి, మీ రచనల గురించి చాలామంది పాఠకులకి తెలియని నిజమేదైనా చెప్పగలరా?**

చదవమని చెప్పడం కంటే ఇంకేం చెప్పగలను?! నా ప్రతి రచనా ఉనికి సంఘర్షణ. రాజకీయ ప్రకటన. అంతే!

**కవిత్వం, కథ కాకుండా ఇంకా మీరు రాయాలనుకుంటున్న సాహిత్య ప్రక్రియలు ఏమన్నా ఉన్నాయా?**

అంత పకడ్బందీగా పనిమాలా రాసే రచయితని కాదు. ఏం రాస్తానో తెలీదు. ప్రస్తుతం కవిత్వమూ, కథలూ అంతే! విమర్శ రాయలేకపోతున్నాను, నాకున్న పని ఒత్తిళ్ల వల్ల.

**మీరు శ్రీ,శ్రీ లాంటి వారితోనూ, దాశరథిలాంటి వారితోనూ కలిసి మాట్లాడిన సందర్భాలున్నాయన్నారు. అది మీ జీవితంలో ఒక మంచి జ్ఞాపకం అన్నారు. అమెరికా నేపథ్యంలో అలాంటి జీవితాంతం గుర్తిండిపోయే జ్ఞాపకం ఏదన్నా ఉందా?**

అనేకం వున్నాయి. నేను వెళ్ళిన చోటల్లా పనికట్టుకొని ఒకరిద్దరు అమెరికన్/ ఇతర విదేశీ రచయితల్ని కల్సుకుంటాను. చానాళ్ళ కిందట గూగీ ని కలిశాను. ఇప్పటికీ మాట్లాడుకుంటూనే వుంటాం. వెండెల్ బెర్రీ నాకు నచ్చిన కవి. ఉద్యమజీవి. అనేక మంచి జ్ఞాపకాలున్నాయి.

**చివరగా క్రొత్త తరం కవులకి, రచయితలకి ఏమి చెప్పదలచుకున్నారు?**

ఇప్పుడే రాయడం మొదలెట్టిన రచయిత నుంచి గొప్ప పేరున్న రచయిత దాకా ఎవరికైనా చెప్పేది ఒక్కటే. రాయండి. అదొక్కటే మనం బతికి వున్నామని చెప్పుకోడానికి దాఖలా!



ఇంటర్వ్యూ...
**వేణునక్షత్రం**
+1 (703) 861-8368

కవిత

# నను బాధిస్తుంది



**- కొమ్మెట కళ్యాణి**



ఎప్పుడూ ఒక ప్రశ్న నీడలా నను
వేటాడుతూ ఉంటుంది.
నా కలలకు సంకెళ్ళు వేస్తుంది.
నను బంధిస్తుంది, నను బాధిస్తుంది.
నా కనులకి కన్నీళ్ళను మిగులుస్తుంది
అసలెందుకీ వివక్ష, అసలెందుకీ అసమానత...?
మనిషికీ, మనిషికీ మధ్య అడ్డుగోడలా వచ్చి
అందనంత దూరంలో నిలబెడుతుంది
కులం పేరుతో మానవత్వాన్ని మరణింపజేస్తుంది
ఇంకెక్కడుంది కులరహిత సమాజం
ఇంకెక్కడుంది కులాన్ని కూల్చివేసే సమాజం
కులరహిత సమాజం అంటారు
కులాంతర వివాహాలు వద్దంటారు.
కుల రహిత సమాజం అంటారు
కలల్ని కొన్ని జాతులకు మాత్రమే పరిమితం చేస్తారు
కనులలోని కలల్ని కాలరాసే కులం ఇది.
కళలని కలంతో రాయనీయని కులం ఇది.

సాహితీ శిఖరం

1971 సాహిత్య నోబెల్ విజేత...

# ఎర్ర శాంతికపోతం...
# పాబ్లో నెరుడా



పాబ్లో నెరుడా శాంతి కొరకు అక్షరాన్ని ప్రేమించి, అక్షరాన్ని ఆయుధంగా ప్రయోగించిన కవి, రాజకీయవేత్త. అతని అసలు పేరు నెఫ్తాలీ రికార్డో రేయెస్ బసోల్టో. 12 జూలై, 1904న చిలీలోని పర్రల్ పట్టణంలో జన్మించాడు. అతని తండ్రి రైల్వే ఉద్యోగి. కవి తన బాల్యాన్ని మరియు యవ్వనాన్ని టెముకోలో గడిపాడు. పదమూడు సంవత్సరాల వయస్సులో అతను "లా మనానా" దినపత్రికకు కొన్ని వ్యాసాలను అందించాడు. 1920లో, అతను చెకోస్లోవాక్ కవి జాన్ నెరుడా (1834-1891) జ్ఞాపకార్థం స్వీకరించిన పాబ్లో నెరుడా అనే కలం పేరుతో "సెల్వా ఆస్ట్రల్" అనే సాహిత్య పత్రికకు కంట్రిబ్యూటర్గా విధులు నిర్వహించాడు. 1923లో, అతను తన మొదటి పుస్తకం క్రెపస్క్యులారియో ("ట్విలైట్") ప్రచురణ చేయడానికి తన ఆస్తులన్నింటినీ విక్రయించాడు. అతను తన వృత్తిని అంగీకరించని తన కుటుంబంతో విభేదాలను నివారించడానికి "పాబ్లో నెరుడా" అనే మారుపేరుతో సంపుటాన్ని ప్రచురించాడు. "ఎంటుసియాస్మో వై పెర్సెవెరాన్సియా" అతని మొదటి ప్రచురణ మరియు అదే అతని మొదటి కవిత. ఆ సమయంలో నెరుడా వ్రాసిన కొన్ని పద్యాలు అతని మొదటి ప్రచురించిన పుస్తకం "క్రెపస్కులారియో" (1923)లో కనబడతాయి. తర్వాత "వెయింటె పొయెమాస్ డి అమోర్ వై ఉనా కాన్సియోన్ డెస్పెరాడా" ప్రచురించబడింది, ఇది అతని అత్యంత ప్రసిద్ధ మరియు అత్యధిక భాషలలో అనువదించబడిన రచనలలో ఒకటి. అతని సాహిత్య కార్యకలాపాలతో పాటు నెరుడా శాంటియాగోలోని చిలీ విశ్వవిద్యాలయంలో ఫ్రెంచ్ మరియు బోధనా శాస్త్రాన్ని అభ్యసించాడు. 1927 మరియు 1935 మధ్య, ప్రభుత్వం అతనిని బర్మా, సిలోన్, జావా, సింగపూర్, బ్యూనస్ ఎయిర్స్, బార్సిలోనా మరియు మాడ్రిడ్లకు తీసుకువెళ్లిన అనేక గౌరవ కాన్సులేషిప్‌ల బాధ్యతను అప్పగించింది. ఆ క్లిష్ట కాలంలో అతని కవితా నిర్మాణంలో, ఇతర రచనలతోపాటు, రహస్య అధివాస్తవిక కవితల సేకరణ "రెసిడెన్సియా ఎన్ లా టియెర్రా" (1933) ఇది అతని సాహిత్య పురోగతిని సూచిస్తుంది. నెరూడా 1938లో చిలీకి తిరిగి వచ్చాడు, అక్కడ అతను తన రాజకీయ కార్యకలాపాలను పునరుద్ధరించాడు మరియు విస్తారంగా రాశాడు. 1939లో మెక్సికోకు చిలీ కాన్సుల్‌గా పేరుపొందిన నెరుడా మళ్లీ నాలుగు సంవత్సరాలకు చిలీని విడిచిపెట్టాడు. 1943లో చిలీకి తిరిగి వచ్చిన తరువాత, అతను సెనేట్‌కు ఎన్నికయ్యాడు మరియు కమ్యూనిస్ట్ పార్టీలో చేరాడు. చిలీ ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వం కమ్యూనిజం చట్టవిరుద్ధమని ప్రకటించారు. కమ్యూనిజం ప్రతినిధి అయిన నెరుడాను సెనేట్ నుండి బహిష్కరించారు. అప్పుడు అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఆ సమయంలోనే అతను "కాంటో జనరల్" (1950) వ్రాసి ప్రచురించాడు. 1952లో ప్రభుత్వం వామపక్ష రచయితలు మరియు రాజకీయ ప్రముఖులను అరెస్టు చేయాలనే ఉత్తర్వును ఉపసంహరించుకుంది. తరువాత ఇరవై ఒక్క సంవత్సరాలు, అతను ప్రైవేట్ మరియు ప్రజా సమస్యలను ఏకీకృతం చేసే వృత్తిని కొనసాగించాడు మరియు ప్రజల కవిగా పేరు పొందాడు. ఈ సమయంలో, నెరూడా 1950లో అంతర్జాతీయ శాంతి బహుమతి, 1953లో లెనిన్ శాంతి బహుమతి మరియు స్టాలిన్ శాంతి బహుమతి మరియు 1971లో సాహిత్యానికి నోబెల్ బహుమతితో సహా అనేక ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నాడు. ఫ్రాన్స్‌లో రాయబారిగా రెండేళ్లపాటు సేవలందిస్తున్నప్పుడు క్యాన్సర్‌తో బాధపడుతున్న నెరుడా తన దౌత్య వృత్తిని ముగించి తన పదవికి రాజీనామా చేశాడు. పాబ్లో నెరూడా 1973 సెప్టెంబరు 23న చిలీలోని శాంటియాగోలో మరణించాడు. పాబ్లో నెరూడా గొప్ప లాటిన్ అమెరికన్ కవిగా శాశ్వత కీర్తికి పాత్రుడయ్యాడు.



కథ

# మిడిమిడి జ్ఞానం

**తన తన బావ అని తెలిసిన కాల మహిమ....**




**ఐతా చంద్రయ్య**
93912 05299


"ఇవి ఎర్రగులాబీ పువ్వులనుకున్నవా లేక మెత్తని చేగోడీలనుకున్నవా?"

దోరవయసుల కోరచూపుల తిరుపతికి మూరెడు దూరం జరిగింది మానస. ముఖాన్ని అరచేతులతో కప్పుకుంది. చెంపలమీద తచ్చాడుతున్న సిగ్గు వానపాములా పెదాల మీదికి పాకింది. గదిల మంచమ్మీద కూచున్నరు భార్యా, భర్తలు. ఎద పొదల్లో చిలిపి చిరుగాలులు.

ఒప్పుల కుప్పా, వయ్యారి భామా! పాట గుర్తుకొచ్చింది తిరుపతికి. మానస అరమోడ్పు కన్నులు అయస్కాంతాల్లాగున్నై. కిలకిలా నవ్వుతూ తీగనుండి రాలిన పూవులా ఒడిలో వాలింది. నవ్వు నయగారా జలపాతం సవ్వడిలాగుంది. నున్నని భుజాలు ఒరుసుకుని సన్నని వేడి రగిలిస్తున్నై. భర్త చిలిపిచేష్టలు కష్టంగా తోచినా ఇష్టంగానే వున్నాయి. "నువ యాడాదికోసారి వచ్చి నెలరోజులుండి చెంగోబిల్ల చేతికి రూపాయి అన్నట్టు మల్లా షోలాపూర్‌కు ఉరుకుతవు. అత్తనేమో ఓ పాపను కని ఇవ్వుమంటుంది" బుంగమూతిని మూడువంకలు తిప్పింది. కనురెప్పలు టపటపలాడినై.

"పొట్టతిప్పలుకు జెర్రిపోతులాడించినట్టు మన ఆకలి తీరాలంటే షోలాపూర్‌ల సుతారి పని చెయ్యక తప్పదాయె. అయినా నువ్వేమీ ఫికర్ పెట్టుకోకు. జెరన్ని పైసలు కూడవెట్టి ఈసారి వచ్చినప్పుడు ఇక్కడనే ఉండిపోతా" చెంపలందుకోబోయాడు.

"ఆహా? ఎడపట్టపగలు ఎల్లమ్మ శిగమన్నట్టు గిందేందయ్యా? అత్తనో, వదిననో చూస్తే..." కనుబొమ్మలెగరేసింది.

"మా అమ్మ, అక్క ఆ మాత్రం ఇంగితజ్ఞానం లేనోల్లు కాదులే" చేతులెక్కడెక్కడో తడుముతున్నై.

"అబ్బా... సిగ్గులేదా? దేవుడు లేడు, దెయ్యం లేదా? దబుక్కున లేచి నుంచిని

"పేరు తిరుపతి గాని ఒక్కసారన్నా తిరుపతికి పోయినవా? నన్ను తోలుకపోయినవా?" దెప్పిపొడిచింది.

ఖంగు తిని వెంటనే సర్దుకున్నడు. "ఇంతకు ముందు పంపిన పైసల్తోని ఎకరం భూమి కొన్నం గదా! ఈసారి రెండేండ్లదాకా రాను. నెలనెలా పైసలు పంపిస్తుంటా. మన రెండెకరాల భూమిల బోరుబాయి వేయించి కరంటు మోటారు పెడితే బేఫికర్‌గుంటది. అందరం కలిసి తిరుపతి ఎంకన్న దర్శనానికి పోదాం... సరేనా?" చిరునవ్వుతో ఆమె కొంగు సర్దుకుంది.

పోయినసారి సొంతూరు కెళ్ళినప్పుడు సంసారంలోని సరిగమలు మనసు తెరమీద కదుల్తాంటె తిరుపతి బీరిపొయ్యి కూచున్నడు. రోడ్డుమీది వాహనాల రయ్ రయ్ వినబడుతూంది.

సిద్దిపేట పట్నం దగ్గరి సీతారంపల్లి తిరుపతి ఊరు. పసిప్రాయములో తండ్రి మరో లోకంలోకెళ్ళగానే లోకమంతా చీకటిగా కనబడింది. నిరాటంకముగా సాగుతోన్న చదువు అక్కడే ఆగిపోయింది.

తాతల నుండి సంక్రమించిన ఎకరం భూమి, పాతిల్లు ఉన్నా రెక్కాడితేనే డొక్కాడుతుంది. వానదేవుని కరుణ కరువైన కారణంగా వరుసగా కరువుల కాకులాడినై. అప్పుల కుప్పలు అతకంతకూ పెరిగిపోయినై. అక్క ఇంటి మీదుంది. ఆమె భర్త పరిస్థితులకు తట్టుకోలేక ఎవరితో చెప్పకుండా ఇంటినుండి పారిపోయిండటా. తనకప్పుడు బుద్ధి తెల్వదు. అక్క ఏడ్చుకుంట దుఃఖ భాగీరథి అయిందంట. వచ్చి అమ్మ ఒడిలో వాలిపోయిందంట. తల్లిదండ్రులు బావకోసం చెప్పులరిగేలా తిరిగినా దొరకలేదట. తల్లి రంగవ్వ కడుపు కాలి కావైందట.

"పిడికెడు మెతుకుల కోసం నువు ఫికరుపడకు బిడ్డా! తీగకు కాయ బరువా? నా కన్నకడుపుకు నువ్వు భారమా? మాలెక్క నువు కలో, గంజో తాగుకుంట ఇక్కడనే వుండు. ఖర్చుల పైసల కోసం బీడీలు చేసుకుందువులే" ధైర్యం నూరిపోసిందట రంగవ్వ.

కొన్ని సంవత్సరాల నుండి వానలు

కథ

వరదలను రానీయకుండా కరువు నిర్దాక్షిణ్యంగా రాజ్యమేలుతుంది. భూములు ఎండలకు నోర్లు తెరిచినై. ఊరిలో బోరుబావి కరెంటు మోటర్లు వాడుతున్నడు. వాడు జీతగాడి చెమట పారించి పంటలు పండిస్తున్నరు. సన్నకారు రైతులు, రైతు కూలీలు పొట్ట చేత పట్టుకుని దుబాయ్‌కి, ముంబైకి బతికి పోతున్నరు. తానుగూడా పక్క ఊరు మేస్త్రీ సహాయంతోని షోలాపూర్ కొచ్చిండు. తాటాకుల గుడిసెల రాందేవ్‌తో కలిసి వున్నాడు. రోజూ అతన్తో కలిసి సుతారి పనికి పోతున్నడు. షోలాపూర్ కొచ్చి ఆరు సంవత్సరాలైంది...

"తిరుపతీ! ఓ తిరుపతీ!" రాందేవ్ దగ్గరికొచ్చి భుజమ్మీద చెయ్యేసిండు. అప్పుడే తలస్నానం చేసిండేమో జుట్టు నుండి నీటిబొట్లు ముత్యాల్లా రాలిపడుతున్నై" ఇంటి సమస్యలు బుర్రల బొంగురాలాడుతున్నయా? తానం చేసొచ్చి ఫరాకత్‌గ కూచుని బీరగింజోలె బీరిపోయినవు!"

తిరుపతి ఉలిక్కిపడ్డడు. "మనసు ఊరకుక్కలెక్క మా ఊరి కురికింది. పద! హొటల్ల రోజువారీ అమృతం సేవించి పనిమీదికి పోదాం" లేచి నుంచున్నడు.

ఇద్దరూ తయారై గుడిసెకు తాళం వేసి యుద్ధానికెల్తున్న యోధుల్లా బయలు దేరిండ్రు.

"తిరుపతీ! నెలనెలా ఇంటికి పైసలు పంపిస్తున్నవు. అయినా నీ మనసు అటే గుంజుతుంది గదా!"

"నా సంగతి అటువెట్టు. నీ గురించి చెప్పుమంటే చెప్పవు"

"నా గురించి ఏం జెప్పాలె? నా సంగతి వొదిలెయ్" రాందేవ్ వాలకం పేలబోతున్న అగ్నిపర్వతం లెక్కయింది. రెండు నిమిషాలు మౌనం తచ్చాడింది.

"సరే... పద హొటల్‌కు".

ఆబగా బన్ను తిని ఆబగా చాయదాగి బయలుదేరిండ్రు. మనిషి మంచిచెడ్డలతో సంబంధంలేని కాలచక్రం రికాము లేకుండా తిరుగుతనే వుంది.

ఆరోజు ఇంటికి పైసలు పంపి రాంగనే తిరుపతి "రాందేవన్నా! నువ్వు లగ్గమెందుకు చేసుకోలేదు? నాకంటే పెద్దోనివి గదా" సందేహాన్ని కక్కేసిండు.

"తమ్మీ!" రాందేవ్‌కు తప్పలేదు. మొహంల రంగులు మారినై. అది విచారమో, విషాదమో అర్థం కాలేదు. "పెండ్లాన్ని సాకగలిగితేనే పెండ్లి జేసుకోవాలె. లేకపోతే పెండ్లాం పెంట



**"తిరుపతీ! ఓ తిరుపతీ!" రాందేవ్ దగ్గరికొచ్చి భుజమ్మీద చెయ్యేసిండు. అప్పుడే తలస్నానం చేసిండేమో జుట్టు నుండి నీటిబొట్లు ముత్యాల్లా రాలిపడుతున్నై" ఇంటి సమస్యలు బుర్రల బొంగురాలాడుతున్నయా? తాన చేసొచ్చి ఫరాకత్‌గ కూచుని బీరగింజోలె బీరిపోయినవు!"**

ఐతది. సంసారం చావగొడ్తది. గీ సంగతి మల్లా ఎప్పుడూ అడగొద్దు సుమా".

తిరుపతికి "నొప్పించక తానొవ్వక..." పద్యం గుర్తుకొచ్చింది.

"పెండ్లి జేసుకుని నువు మాత్రం ఏమి సుఖపడుతున్నవ్" రాందేవ్ మాటల్లో దెప్పిపొడుపు దాగున్నట్టుంది.

ఏదో గాలిపురుగు అంటురోగం చైనాల పుట్టి అన్ని దేశాలకు ఎగవడిందట. షోలాపూర్‌లో గూడా చాలమందికి జ్వరాలొస్తున్నై. ఆ రోగం గాలి దేశమంతా చుట్టుకపోయింది. పరేషాన్ చేస్తుంది.

ఆరోజు ఓ బిల్డింగ్ పైకప్పు నిర్మాణమవుతూంటే పనిచేసి అలసిపోయిండ్రు. సాయంత్రం చీకటి తరంగాలు దిగుతున్నై. మేస్త్రి పనోల్లందరికి కూలిపైసలు పంచిండు.

"అందరూ వినుండ్రి. మన దేశంల కంటికి కనబడని కరోనా రోగం ముదిరిపోతుందంటా. దానికి మందు లేదట! డేంజరట. రోగి దగ్గరుండి దగ్గుతూంటే గూడా అంటుకుంటుందట. గందుకే గవర్నమెంటు రేపటినుండి లాకౌట్ పెట్టింది. అంటే... మనుషులెవ్వరూ బయటకు రావద్దు. అత్యవసరాల కోసం పొద్దుగాల్ల రెండు గంటలపాటు లాకౌట్ ఉండదట. మన పని గూడా బంద్. బస్సులు, రైళ్ళు, బడులు అన్నీ బంద్ అట" ముందు జాగ్రత్తలు చెప్పి పంపించిండు.

"అయ్యల్లా! ఎట్ల రాందేవన్నా?!" తిరుపతి అయోమయం.

"మనం గూడా పనికి పోవద్దు తమ్మీ!

ఇంత ఉడికేసుకుని తిని, తడక పక్కన పడుకోవాలి. ఎక్కడెక్కడి నుంచో కూలిపని చేసుకుని బతుకుతున్న మన అసోంటోల్లకు కష్టమే. లాక్‌డౌన్ ఉన్నన్ని రోజులు తిప్పలే" రాందేవ్ యధాలాపం.

మర్నాడుదయం... రోజూ జాతర లెక్కుండె రోడ్లు కర్ఫ్యూ విధించినట్టున్నై. ఎవరన్నా అనవసరంగా బజార్ల కనబడితే పోలీసోల్లు పట్టుకుని వాయిస్తున్నరు. దేశమంతా వున్న ఈ లాక్‌డౌన్ జంతర్ మంతర్‌లాగుంది. ఊర్లె అమ్మ, మానస, అక్క ఎట్లున్నరో! ఇంటికి పోదామంటే ప్రయాణసాధనాలన్నీ బందాయె. అదే ఎత రాందేవ్ ముందు ఎల్లవోసుకున్నడు. తిరుపతి మొహం వాడిపోయిన వంకాయ లెక్కుంది.

"ఈ లాక్‌డౌను 20 రోజులుంటది. అంతవరదాకా మన దగ్గరున్న పైసలు ఖర్చువెట్టుకుంట", తినుకుంట కూచుందాం. అటెన్క ఎప్పటిలెక్క కూలిపనికి పోదాము" అదో మామూలు విషయమన్నట్టు తేల్చిపారేశాడు రాందేవ్.

వచ్చిన కూలి పైసల నుండి తిరుపతి సగం ఇంటికి పంపించిండు. మానసకి ఫోన్‌చేసి పరిస్థితి అంతా చెప్పేసిండు. అంతా విని మానస "మా గురించి రందిపడకు. అక్కడ అంగట్ల అవ్వా! అంటే ఎవనికి పుట్టినవు బిడ్డా? అన్నట్టుగుంటది" చెప్తాంటె గొంతు వణికింది. అక్క, అమ్మతో గూడా మాట్లాడిండు. ఫోను బాలెన్సు తగ్గిపోతూ దగ్గరికొచ్చింది.

ఇద్దరూ నాలుగ్గోడల మధ్య రోజా బాతాకాని వేసుకుంటున్నరు. పుంజీత మాడుకుంటున్నరు. పక్క గుడిసెల తమలాంటి తెలుగు వలస కూలీ వున్నడు. అప్పుడప్పుడు అతడొచ్చి గడుపుతుంటడు. వీళ్ళు  అతని గుడిసెకెళ్ళి చిన్న టీ.వీ.ల సినిమాలు చూస్తున్నరు. వాళ్ళది నల్లగొండ జిల్లాలో ఏదో ఊరు.

ఓసారి తిరుపతి "రాందేవన్నా! మా ఊరు సిద్ధిపేట దగ్గర సీతారాంపల్లి. మీది ఏ ఊరు?" ఆసక్తిగా అడిగిండు.

రాందేవ్ చిన్నగా నవ్వుతూ "మాది గూడా సిద్ధిపేట దగ్గరి ఊరే. సిద్ధిపేటకు కూతపెట్టు దూరంలున్న పుల్లూరు తమ్మీ!" మాటల్లో నిర్వేదం తొంగి చూసింది.

"అయితే మనం దగ్గరోల్లమే" తిరుపతి ఖుషీ.

ప్రతినెలా రాందేవ్ కూలీపైసల్ని చాలామట్టుకు గరీబోళ్ళకి దానధర్మాలు చేస్తుంటాయి. ఆ నెలగూడా అదే జరిగింది. ఇరవై రోజుల్లో ఇద్దరి దగ్గరున్న పైసలు ఖర్చయిపోయినై. ఇరవై రోజులైపోతున్నయి" ఇన్ని రోజులు జైల్ల ఉన్నట్లు గడిపితిమి. అడుగుచ్చాడును బియ్యం ఇయ్యాల్ల వండుకుంటం. రేపట్నుంచి ఏం చేద్దామన్నా?" తిరుపతికి నడిగంట్ల నాగలి విడిచినట్టుంది.

"నువ్వేం భయపడకు తిరుపతీ! రేపొక్కరోజుఎల్లవనుకుంటే లాక్‌డౌన్ ఖతమైతది. ఎల్లుండి కూడా పని పొయ్యి గుత్తేదారును కొంత అడ్వాన్సు ఇవ్వుమని అడుగుదాం" పైపై సమాధానమిచ్చిండు రాందేవ్.

లాక్‌డౌన్ ఆఖరురోజు అర్ధాకలితో గడిచింది. కాని గుడిసె మీద పిడుగు పడ్డట్టు లాక్‌డౌను పొడగించింద్రు. రాందేవ్ మామూలుగున్నా తిరుపతి పరేషాన్ల మునిగిండు. ఒంటిమీద గొడ్డుకారం రాసినట్టుంది. "నీయవ్వ! తిండికెట్లా అని ఏడుస్తుంటే నువ్వేమో గమ్మునున్నవ" గదిరిచ్చిపెట్టిండు.

"జీవితమన్నప్పుడు కష్టసుఖాలు కలిసుంటై గదా! ఏడ్చుకుంట కూకుంటే ఏమోస్తుంది?"

"అమ్మో! నీకు గన్నిగానం అనుభవాలున్నయా?"

"నా అనుభవం సామాండం గాదు రామాండం. గా కరోనా పీనుగెల్ల. మనసోంటోల్ల పరేషాను జెయ్యవట్టె. మనలెక్క దేశముల లక్షల కూలీలున్నరట. చూద్దాం. తమాషా!"

"రాత్రి తిరుపతికి నిద్ర రాలేదు. తేనెతుట్ట చుట్టూ తేనెటీగల్లా ఆలోచనలు ఎగురుతున్నై. ఆకలెట్లా చల్లారాలె? ఇంటికి ఏమి పంపాలి? బస్సులు, రైళ్ళు గూడా లేవు. జైల్ల ఉపవాసాలన్నట్లుంది. రాందేవ్ ఎప్పట్లాగా నిద్రబోతున్నడు. రాందేవ్ రంది లేని మనిషి. అడవి కాలుతుంటే తాను అందులో తపస్సు చేస్తానంటాడు.

తెల్లారంగనే రాందేవ్‌నడిగిండు "ఇయ్యాల్ల ఏం చేద్దామన్నా? దినదినగండం నూరేళ్ళాయుష్షు లెక్కుంది".

"ఏదన్నా దొరికితే తిందాం లేకపోతే మల్చుక పందాం".

"నీకిదో పోరగాండ్ల ఆటలెక్కుందన్నా! ఇన్నిరోజులు దానధర్మాలు చేసినవు. ఇప్పుడు నువ్వే అడుక్కోవాలె. ఎవలన డుగుతవు? ఎట్లడుగుతవు?" తిరుపతి ప్రశ్నాబాణాలు.

"నా దగ్గర చిల్లెర పైసలున్నై. పండ్లు కొనుక్కొని తిందాం".

"మరి రేపెట్లన్నా?" తిరుపతికి కాలే కడుపుకు మండే గంజిలాగుంది.

"రేపటికి రూపము లేదు".

"మర్నాడు ఉపవాస వ్రతమైంది. తర్వాత రోజు ఇద్దరి సెల్‌ఫోన్లు అమ్మింద్రు. రెండొందలొచ్చినై. ఐదారు రోజులు గడిచినై.

అటుపక్క గుడిసెలున్న నల్లగొండ మిత్రుడు కూతురు, భార్యతో సహా సొంతూరికి కాలినడకన బయలుదేరిండు.

**"రాత్రి తిరుపతికి నిద్ర రాలేదు. తేనెతుట్ట చుట్టూ తేనెటీగల్లా ఆలోచనలు ఎగురుతున్నై. ఆకలెట్లా చల్లారాలె? ఇంటికి ఏమి పంపాలి? బస్సులు, రైళ్ళు గూడా లేవు. జైల్ల ఉపవాసాలన్నట్లుంది. రాందేవ్ ఎప్పట్లాగా నిద్ర బోతున్నడు. రాందేవ్ రంది లేని మనిషి. అడవి కాలుతుంటే తాను అందులో తపస్సు చేస్తా నంటాడు. తెల్లారంగనే రాందేవ్‌నడిగిండు "ఇయ్యాల్ల ఏం చేద్దామన్నా? దినదినగండం నూరేళ్ళాయుష్షు లెక్కుంది".**

"రాందేవన్నా! మనం నడిచి మనూర్లకు పోదాం. మనం ఆడోళ్ళకంటే అన్యాయమా?" ఛాలెంజి విసిరిండు.

"అయితే... అండగా కాళ్ళుండగా, బండెందుకూ ఇక దండగ".

అప్పుడే సామానులు సర్దేసుకున్నరు.

నునులేత కిరణాలు భూమాతను ముద్దాడక ముందే ఇద్దరు పిక్కబలమ్మీద బయలుదేరిండ్రు. ఇండ్లు, బంగళాలు దాటిపోతుంటే తిరుపతిని ఆలోచనలు ముసురుకుంటున్నై. ఐనా ముందు కడుగేసిండు.

సిటీ చివర్లో ఎవరో బన్ను, చాయ దానం చేస్తున్నరు. వెళ్ళి గబగబా బన్ను తిని, వేడి చాయ తాగి సందూకలతో బయలుదేరిండ్రు. ఆదిశూరత్వం ఉరుకు లాడుతుంటే రాత్రి పదివరకు సుమారు వంద కిలోమీటర్లు నడిచిండ్రు. మర్నాడు మధ్యాహ్నం తిండి దొరకలేదు. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నై. కాళ్ళు పీకుతున్నై. ఏదో ఊరి బయట పెట్రోలు బంకు కనపించింది. అక్కడ పడుకునేందుకు మేనేజర్ అనుమతిం చుండు. "గంత దూరం నుండి నడిచా స్తున్నరు గదా! మధ్యాహ్నం ఏమన్నా తిన్నరా, లేదా?" ఆత్మీయంగా అడిగిండు. అతడు ఖమ్మం జిల్లా వాడైనా అక్కడ భార్యతో ఉంటుండట.

ఇద్దరి చూపులు నకారాత్మకంగా నేలకు వాలినై.

"అంటే... తినలేదన్నమాట" మేనేజర్ కాశ్చర్యం.

"నేను నైటు డ్యూటీకొచ్చేప్పుడు క్యారేజి భోజనం తెచ్చుకున్న. ఇది మీరిద్దరూ సరిపెట్టుకోండ్రి" క్యారేజి చేతి కందించాడు.

"మరి మీకెట్లా సార్?" తిరుపతి సందేహం.

"నేనింతకుముందే మక్కకంకులు తిన్న. మధ్యాహ్నం సుష్టుగా భోంచేసిన. సాటి తెలుగువారు, మీకు ఉపవాసముంటే నాకు బాధ.

క్యారేజి అన్నము ఇద్దరి కడుపు నింపింది. ఇంకా మానవత్వం బతికున్నట్ట నిపించింది. ఉదయం తయారై కాల్చిన మక్కకంకులు కొనుక్కున్నారు. పది రూపాయలు మేనేజరు ఇచ్చిన పైసలవి. ఇరవయ్యైదు కిలోమీటర్లు నడవగానే మక్కకంకులు గుర్తుకొచ్చినై. రోడ్డు పక్క పొలంలో కరంటు మోటరు నడుస్తుంది. అక్కడనే విశ్రమించి కంకులు తిని నీళ్ళు తాగి బయలుదేరిండ్రు. రాను రాను నడక వేగం తగ్గిపోతుంది. ఆరోజు రాత్రి ఉపవాసమే.

ఆరోజు ఉదయం జహీరాబాదు పట్టణం చేరుకున్నరు. మెత్తబడిన ప్రాణం తెలుగు గాలి పీల్చి గట్టిబడింది. కూరగాయల మార్కెట్‌కెళ్ళి దుకాణాల వారికి తమ బాధలె చెప్పిండ్రు. ఒక దుకాణం యజమాని చెరో మూడు దోసకాయలిచ్చిండు. పండ్ల దుకాణం యజమాని చెరో మూడు అరటిపండ్లు ఇచ్చిండు. దోసకాయలు తిని బయలు దేరిండ్రు.

సంగారెడ్డికొచ్చి అరటిపళ్ళు తిన్నరు. రోడ్లమీద వాహనాలు లేవు. మనుషులు లేరు. రాత్రి గజ్వేల్ బస్టాండులో పడుకున్నరు. సిద్దిపేట పట్టణం గుండా పాడుబడినట్టుంది. పోలీసులు అడ్డుకుని కరోనా టెస్టు పరీక్షలు చేయించిండ్రు. నెగెటివ్ రావడంతో వదిలేసిండ్రు. ఓ కానిస్టేబుల్ "సంతోషిమాత గుడిల అన్నదానం చేస్తున్నరు" అని చెప్పిండు. అలసటను మరిచి సంతోషిమాత గుడికి చేరుకున్నరు. అక్కడందరూ మొహాలకు మాస్కులుండాలన్నారు. ఇద్దరు చేతిరు మాళ్ళను మాస్కులుగా కట్టుకున్నరు. చేతులకు సానిటైజర్ రాయించిండ్రు. కడుపునిండా అన్నం పెట్టిండ్రు.

సీతారాంపల్లి కెల్తుంటే మధ్యన పుల్లూరు గేటు వచ్చింది. కుడివైపు తిరిగి ఒక కిలోమీటరు నడిస్తే పుల్లూరు ఊరు. గేటువద్ద రాందేవ్ పుల్లూరు వైపు తిరగలేదు. రోడ్డుపక్కన కూచుండి తల నేలకు వేళ్ళాడేసిండు.

"గదేందన్నా! మీ ఊరికిపోవా?" పక్కన తిరుపతి అనుమానంగా కూచున్నడు. గదవబట్టితలపైకి లేపిండు. తెగిన హారము నుండి ముత్యాల్లా రాందేవ్ కళ్ళనుండి నీటిబిందువులు రాలుతున్నై. బాధతో ఉన్నట్టుంది.

"అరరే! ఇదేందన్నా, వందల కిలోమీటర్లు నడిచొచ్చినం. ఇంకొక్క కిలోమీటరు నడువలేవా? మెల్లగవోదాం పద. నేను గూడ మీ ఇంటికొస్త" దస్తీతో కన్నీళ్ళు అద్దిండు.

రాందేవ్ గట్టిగా ఊపిరి పీల్చుకున్నడు. "తిరుపతీ! నా ఊర్లె నాకెవ్వరూ లేరు. ఇల్లు గూడా లేదు". అని ఒడిలో తల ఉంచిండు. తిరుపతి పొదివి పట్టుకున్నడు. "అయితే మా ఊరికి పోదాం. పదా!" చెయ్యిపట్టి లేపిండు.

సీతారాం పల్లెకు పోతే ఎటు బొయ్యి ఎటొస్తుందో! అయినా అటుగాకపోతే ఇంకెటుపోవాలె? బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు... ఆలోచనల మధ్య రాందేవ్ నోటినుండి మాట రాలేదు. పసిపిల్లవాన్ని చెయ్యి పట్టి నడిపిస్తున్నట్టు తిరుపతి రాందేవ్ చెయ్యి పట్టుకుని నడిపిస్తున్నడు.

కాళ్ళు నిజాయితీ కార్మికుల్లా సమ్మె నోటీసిచ్చినై. మనసు యజమానిలా రంగప్రవేశం చేసి నచ్చజెప్పి మాన్పించింది.

సీతారాంపల్లి గ్రామంలో ప్రవేశిస్తుంటే రాందేవ్ కాళ్ళు వణుకుతున్నై. మనోసాగరం అల్లకల్లోలమైంది. తిరుపతి తన ఇంట్లో ప్రవేశిస్తుంటే రాందేవ్ గుమ్మం వద్దనే ఆగిపోయిండు.

"కొడుకా, తిరుపతీ!" కొడుకును చూసిన తల్లి రంగవ్వలో ఆత్రం పొంగింది. కళ్ళముందుకు రంగుల లోకం కదిలి వస్తున్నట్టుంది. అంగలేస్తూ తిరుపతికి ఎదురొచ్చి ఆబగా గుండెలకు హత్తుకుంది. "ఎక్కడున్నావ్? ఎట్లున్నవ్? ఎట్ల వచ్చినవు కొడుకా! నీ ఫోన్ పలుకుతలేదు. తల్లి కన్నీరు కొడుకు భుజాలను తడిపేస్తుంది.

"అమ్మా! బాగనే వున్న. షోలాపూర్ నుండి నడిచొస్తున్న" ఆత్మీయత కన్నీరై కరిగింది. లోపలినుండి మానస, తులసి దబదబా నడిచి వస్తూంటే కాలిమువ్వల సవ్వడి లయబద్ధంగా వినిపించింది.

"హబ్బా! మా తమ్ముడు" తులసి సంతోషంతో తిరుపతి చేతులు పట్టుకుని కళ్ళకద్దుకుంది. "నీ కోసం రోజూ ఎదిరిచూసుకుంట ఏడుస్తున్నమురా!" కళ్ళు మంచుపూలైనాయి.

మానసనైతే భర్త ఒడిలో ఒదిగిపోయి, వెక్కివెక్కి ఏడుస్తూ "గీ లాక్‌డౌన్ టైముల నువు ఫోన్ చెయ్యకపోతే ఏమనుకోవాలయ్యా?" విడిపోయి పెద్దపీట మీద కూచోబెట్టింది.

"గిట్లనే మీ బావ గూడా వస్తే ఎంత బాగుండేదో!" తులసి మనోస్వరాల్లో ఆవేదన రాగము.

అప్పుడు గుర్తుకొచ్చింది రాందేవ్ సంగతి... అతన్ని ఇంట్లనే ఉంచి అక్కనిచ్చి పెళ్ళిచేస్తే బాగుంటుందనే ఆలోచన గూడా మెరిసింది. "బావ సంతగేమో కాని, షోలాపూర్‌లో నా రూములున్న దోస్తును తోలుకొచ్చిన" అటూ, ఇటు చూసిండు. తిరుపతి గడప అవతలున్న రాందేవ్ చెయ్యి బట్టి తోలుకొచ్చిండు. రంగవ్వ కళ్ళు ఇంద్రధనుస్సులైనాయి.

"రాములూ! గన్నేండ్ల కింద ఎక్కడికి పోయినవు అల్లుడా? మా తులసినేం చేస్తాననుకున్నవు?" దు:ఖానందాశ్చర్యాలతో నెత్తికొట్టుకుంది. రాందేవ్ చేతులందుకుని కళ్ళకద్దుకుంది.

తులసికైతే బొందిలో కైలాసం పోయినంత ఆనందమైంది. కొద్దిసేపు నోటిమాట రాలేదు. అయ్యా! ఎటు వోయినవయ్యా?" గుండెల మీద ఒరిగింది. దు:ఖానందము పొంగు కొచ్చింది. "నేనేం కావాలను కున్నవు? నువ్వెక్కడికి పోయినవు?" కాళ్ళకు మొక్కబోయింది కాని, రాందేవ్ భుజాలు పట్టి లేపి గుండెలకు హత్తుకున్నడు.

తిరుపతికి ఎదలో అయోమయ తరంగాలు "నీయవ్వ ఈయన రాందేవ్. రాములంటరేందీ? వీళ్ళ సొంతూరు పుల్లూరు".

తల్లి కూతుళ్ళు మొహాలు చూసుకుని నోరెళ్ళబెట్టింద్రు. తులసి రాందేవ్‌ను మరోసారి పరిశీలనగా చూసింది. దమ్ముదీసింది. కాదు తమ్మీ! ఈయన మీ బావ రాములే. నేను గుర్తుబట్టనా?" పట్టుదలగా అంది.

రాందేవ్ పెదాలమీద విరిసిన మల్లెపూవులాంటి చిరునవ్వు "నిజమే తిరుపతీ! నువు నా బామ్మర్దివే. నేను నీ బావనని నీకు దెల్వదు. నువ్వు బామ్మర్దివని నాకు తెల్వదు. గన్నేండ్లు కలిసున్నం".

"మరి పేరెట్లా మారింది బావా?"

"మిడిమిడి జ్ఞానంతో ఇంటినుండి పారిపోయి చాలా బాధలు పడిన. కొత్తగా పెళ్ళైనా వెనకా ముందు ఆలోచించకుండా మీ అక్క నొదిలిపెట్టి వెళ్ళిన. అప్పుడు నువ్వు చిన్నపిల్లగానివి. హైద్రాబాద్ గుత్తేదారు ఒకాయన నా పేరును రాందేవ్‌గా మార్చి షోలాపూర్ తోలుకపొయ్యి కూలిపని ఇప్పించిండు".

అందరి కళ్ళల్లో ఆనందభాష్పాలు మెరిసినై.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికకనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కవిత

# ఒక స్కిజోఫ్రెనిక్ కథనం



**రఘు వగ్గు, 9603245215**

ఎలా నవ్వేది ఊరికే పైకి
ఆ మాట నీ నుంచి రాందే
ఏ లోతుల్లో ఏ చిక్కుల్లో
వుందోమరి
మొహంపై కనిపిస్తది చేతల్లో
ప్రస్ఫుటమైతది
కాని తప్పిపోతది
మాటిమాటికి
లోపలికి లోలోపలికి...
నేనో శాపగ్రస్తునిలా
అనిపిస్తా
కనిపించే రేఖలు అదృశ్యపు
జాడల్లా
పడిన వెంటనే స్పష్టంగా
తెలియవు ఏంటివో అవి
అనుభూతి మాత్రమే కలుగుతది
లీలగా
అదీ ఒక కలత నిద్ర కల్లోల
కలలా
కళ్ళు మొహం చేతులు చేతలూ
మారిపోతున్నాయి రోజూ
కన్నీళ్ళు
వెతుక్కుంటున్నాయి
కారణాలు
ఎక్కడో ఆ వాక్యం
ఉరేసుకుంటున్నట్టు
ఎవరో దాన్ని మెడ
విరుస్తున్నట్టు
మెలేస్తున్నట్టు
అది దూకుతున్నట్టు
ఆహుతవుతున్నట్టు
బతుకు బహు దుర్భరమైపోయింది
కలలు కనీ కనీ
ఏది వాస్తవమో ఏది అవాస్తవమో
ఆ ఆధీనరేఖ తుడుచుకుపోయింది
ఏమీ తాగనక్కర్లేదు వేరేమీ
తీసుకోనక్కర్లే మత్తు
తూలుతున్నాను నా మరణ
వాంగ్మూలంపై
రాస్తున్నాను చరమ
సంహితాలను
ప్రోది చేస్తున్న
ఒక్కొక్కటిగా
అడుగుతా ప్రశ్నలనే
ప్రశ్నలువేస్తూ
అల్లుతా ఒక స్కిజోఫ్రెనిక్
కథనాన్ని
అది నిజమో కాదో దాన్నలా
చేశారో లేక
అదలా తయారయ్యిందో తెలియదు
ఎందరో గాయపడ్డ దగాపడ్డ
దీనులు
చెట్టుకొకరు పుట్టకొకరు
శతాబ్దాల చరిత్ర
కత్తిమొనకు
కనికరపు హృదయాల కరువుల
కంచెల పరుపులో
లేస్తే కానరాదు.. కనిపిస్తే
గుర్తుకురాదు
గుర్తుంచుకుంటే
ముక్కలవృద్ధి
ఏది దేని అతుకో తెలియనంతగా
వ్యథల వెతుకుల గతుకుల అలుపు
ఇది!

వ్యాసం

# చరిత్రకు తెలియని మన ప్రాచీన కవులు...

కాలం మూలలకు చిక్కిన కవుల వెలికితీత...



డా॥ కావూరి శ్రీనివాస్
98497 76157

మన తెలుగు సాహిత్యంలో కవిత్వాన్ని సుసంపన్నం చేసి వెలుగులను విరజిమ్మిన మన చరిత్రకు అంతగా (అసలే) తెలియని మరుగునపడిన మహా కవులు ఎందరో ఎందరెందరో. వారిలో 1) మడుపతి నాగయ్య (16-17 వ శతాబ్దపు కవి) 2) పిల్లలమఱ్ఱి పాపనార్యుడు 3)బాణాల శంభయ్య (శరభయ్య) 4) కంకంటి శివరాజు (కంకంటి పాపరాజు గారి వంశీకుడు అనుకుంటాను.) 5) ఎల్లదాసు మహాయోగి (సిద్దేశ్వర సంకీర్తనలు, తత్వాలను రచించారు.) 6) మఠం కవి సంగప్ప - వీరప్ప - వీరభద్రప్ప మొదలైన కవిసోదరులు కూడా శివాష్టకాలను రచించారు. 7) కైలాసం అడివయ్య 8) మడుపతి విశ్వేశ్వరయ్య గారు (పాతాళ భైరవాష్టకాన్ని రచించారు.) 9) శివరారాధ్యుడు (కవి జీవితకాలం తెలియకపోయినా శివశైవాగమనం" అనే ఆరు (6) ఆశ్వాసాల ద్విపద కావ్యాన్ని రాసి ఉంచారు. అట్టి గ్రంథాన్ని నేను పరిష్కరించి త్వరలో మన సాహితీ ప్రపంచానికి అందజేయగలను.) 10) సంస్కృత ఆగమశాస్త్ర ప్రావీణ్యుడైన విశ్వమంగళుడు వంటి సంస్కృత కవులు కూడా మన తెలంగాణ సాహిత్య చరిత్రకు ఇప్పటి వరకూ తెలియదు. అలాగే 11) తెలుగు - కన్నడ భాషల కవిగా, గుర్తింపు పొందిన గండేశిరి శిద్రామప్ప అనే వీరశైవ కవి కూడా ఉన్నారు. ఈయన తిట్టు పద్యాలను రచించినట్టు చరిత్ర. 12) తర్క శాస్త్రంలో పుళిందేషుడు మొదలగు ఎంతో మంది తెలియని మహాకవులు ఉన్నారు. ఆయుర్వేద ఆర్వా (ప్రా)చీన వైద్య విద్వాంసులు సైతం చరిత్రలో కనుమరుగైపోయినారు.

## మడుపతి నాగయ్య...

సర్వేశ్వర మహాత్మ్యం (శివదీక్షాబోధ నియమావళి) అనే ప్రాచీన తాళపత్ర గ్రంథాన్ని సేకరించి, పరిష్కరించి ఉన్నారు. ఈ వ్యాసకర్త ఇందులో ఈ కవి జన్మస్థానం కర్ణాటకలోని పర్గణ హవేలి అని చెప్పుకున్నారు. అయితే మన తెలంగాణలోని మెదక్ జిల్లాయందు నివాసమేర్పరచుకున్నారు. ఇట్టి ప్రాచీన తాళపత్ర గ్రంథం ఉమ్మడి మెదక్ జిల్లా (నేటి సంగారెడ్డి జిల్లా) సదాశివపేట వోదెల శిద్రామప్ప, సంగమేశ్వర్‌గారింట్లో లభ్యమయినది... ఈ గ్రంథంలో కవిగారు "శ్రీ మత్కోలనుపాక సోమేశ్వర అంభా మల్లేశ్వర పాదసేవ కుడవని శ్రీ సిద్ద లింగయ్య శిష్యుడనని, తండ్రి చన్నమల్లయ్య తల్లి వీరమ్మ పుత్రుండను, మడుపతి నాగయ్య అనునామంబు గలవాడను" అని స్పష్టంగా కవి నామ ముద్రను విశదపరిచినాడు. 265 పుటలు కలిగిన ఈ ప్రాచీన తాళపత్ర గ్రంథంలో శివ(హర) దీక్షా నియమావళి, భక్తితత్వము, పంచాక్షరి, (నమ:శ్శివాయ) షడాక్షరి (ప్రణవాక్షరి ఓం నమ:శ్శివాయ) మంత్రముల రహస్యములు, వాటి ఫలితముల రహస్యములు తత్వజ్ఞానము ద్వారా తెలియజేసినారు. ఇంతవరకు వెలుగులోకి రాని ఈ కవి మరియు ఈ కవి వ్రాసిన ఈ మహాద్విపద గ్రంథము "సర్వేశ్వర మహాత్మ్యం - శివదీక్షా బోధ నియమావళి అను ఈ గ్రంథము ముద్రణకు ఇప్పటివరకు నోచుకోలేదు. తెలంగాణ సాహిత్యంలోనే కాకుండా మన తెలుగు భక్తి సాహిత్యంలో ఒక ఒరవడిగా చెప్పుకోవచ్చు.

తను వ్రాసిన ఈ సర్వేశ్వర కావ్యంలో శివుడిని అక్షరమునకు లక్ష చొప్పున శివపంచాక్షర నామాన్ని జపించిన ఎడల

**ఆధ్యాత్మిక మోక్షమార్గముల వివరణలు ఉన్నాయి ఇందులో. పర్గణహవేళి(లి) అను గ్రామము తెలంగాణలో కరీంనగర్ జిల్లాలో కూడా ఉన్నదని చెపుతున్నారు. అయితే ఈ కవి కర్ణాటకలో జన్మించి ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నాడని మనం ఊహించు కోవాలి. శైవకవులు, వీరశైవ మహాకవులు జంగాలలో మహాకవులు లేకపోలేరు.**

వ్యాసం

మనకు ప్రత్యక్ష స్వప్న శివదర్శనం కలుగుతుందని స్పష్టంగా చెప్పినారు. అంతేకాకుండా "నమఃశ్శివాయ" అను మంత్రోచ్చారణ విపులంగా చేయాలని కూడా దాని ద్వారా మోక్ష మార్గం మనకు తప్పకు లభిస్తుందని కూడా విన్నవించి నారు. ఆధ్యాత్మిక మోక్షమార్గముల వివరణలు ఉన్నాయి ఇందులో. పర్గణహవేళి(లి) అను గ్రామము తెలంగాణలో కరీంనగర్ జిల్లాలో కూడా ఉన్నదని చెపుతున్నారు. అయితే ఈ కవి కర్ణాటకలో జన్మించి ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నాడని మనం ఊహించు కోవాలి. శైవకవులు, వీరశైవ మహాకవులు జంగాలలో మహాకవులు లేకపోలేరు. తెలంగాణ రాష్ట్రంలో చరిత్రకు కానరాక మరుగునపడిపోయిన మహాకవులను వారి మహాగ్రంథాలను వెలికితీసి మన భాషను సంస్కృతిని సుసంపన్నం చేయడమే మన కర్తవ్యం, విధి!

12వ శతాబ్దికి చెందిన శరభాంకుడు కవి, వ్రాసిన 'శరభాంక శతకం'లోని ఈ పద్యాన్ని గమనించండి.

*"ఉ. కన్నులు మూసి నాదు మది*
*గన్న త్రికూటము లోని గాలిచే*
*సన్నపు దిడ్డి దూరి జలజంబుల నిచ్చెన యెక్కి మింటిపై*
*వెన్నెలరాజు గాంచి నిశివేళల నీవును నేనె నీవయై*
*యున్న నిజస్వరూపమున నుండునయా శరభాంక లింగమా!!"*

అలాగే 13-14 వ శతాబ్దికి చెందిన ఈ కవిగారి పద్యాన్ని కూడా చూడండి.

*"ఎవ్వరు దేవతావిభులు ఎవ్వరు మాయామదాప హారులున్*
*ఎవ్వరు మన్మథాంతకులు, ఎవ్వరు బ్రహ్మ శిరోహరుల్ శివుల్*
*ఎవ్వరు కాలమర్దనులు ఎవ్వరు మృత్యు వినాశనుల్ ఘనుల్*
*ఎవ్వరు నీవే కాక ప్రభులేరి కరస్థల స్వామి శంకరా!!!"*

అయితే ఈ పద్యాలను రెండువందల సంవత్సరాల పూర్వం 1826 సంవత్సరం తాళపత్ర గ్రంథాల నుంచి పరిష్కరించి వెలువరించారు. అయితే పూర్తి శతకాన్ని ఈ వ్యాసకర్త సేకరించాడు. సదాశివ పేటలో, శివరత్న కందమాలలోని ఈ పద్యాన్ని కూడా చదవండి.

*"కం. నీయందే పుట్టి తనువును*
*నీయందే బుట్టె మనసు నీ పుత్రుడినై*
*నీయందు బుట్టునందున్*
*నీ యందైక్యమ్ము జేసి నిలుపు నను శివా!!"*

ఇలా ఎన్నో గ్రంథాలు చరిత్రకు కానరాకుండా ఉన్నాయి. తెలుగు భాషపై అభిమానమున్నవారు తెలుగుభాషను అంతర్జాతీయంగా బతికించాలను కునేవాళ్ళు, కేవలం ఉపన్యాసాల వరకే కాక, ఇలాంటి మరుగున మహాకవులను వెలుగులోకి తీసుకురావడం అందరి బాధ్యత.

కవిత

# అమ్మ ప్రేమ

**జోగునూరి అరుణ్ జ్యోతి**



వానజల్లులాంటి పరవశం నువ్వు
ఏ సందుగొందులలో వెతికినా దొరకదు నీ నవ్వు
జాబిల్లే అసూయపడే వెన్నెలలాంటి అందం నువ్వు
సూర్యుడే తల వంచుకునే జ్ఞాన ప్రకాశం నువ్వు
ఈ సమాజం చెబుతుం ....హ్మ తెరువు,
కాని ఆ బ్రహ్మని సృష్టించిందే నీవు.
నన్ను పొంత్తలో బొమ్మగా చేసావు.
నన్ను నీ ప్రేమగా మలిచావు
నీ ఆశలన్ని వదులుకొని నన్ను మోసావు
నీ కానరాని నొప్పులతో నన్ను ఈ లోకం...
నీ ఆనందాన్ని నా కళ్ళలో చూసావు
కాబట్టి అమ్మా నువ్వే నా దేవతవు.

కథ

# లత్కోరు సాబు

నాటి ప్రభుత్వాలు మరియు ప్రజలు...




నర్రా రాఘవరెడ్డి
మాజీ ఎమ్మెల్యే


లత్కోరు సాబు, ఓ లత్కోరు సాబు పోతుంది... పోతుంది... అన్నారంతా. ఏం పోతుందని నేను వెనుక్కు మళ్ళీ చూచేవరకు వెంకయ్య ఇంటి ముందరరంగ ఎఱ్రని జీవుకారు బుఱ్ఱున పోతున్నది. అదేందో అనుకొని నేను ఆడికి పోయిన.

అక్కడికి నేను పొయ్యే వరకు మా వూళ్ళో వున్న గొల్ల మల్లయ్య, చల్లా రంగయ్య మాదిగ ముత్తయ్య మాదిగ రామయ్య, సాలె పాపయ్య, మాల గోపయ్య, తంగెళ్ళ లచ్చయ్య మంగల పిచ్చయ్య, చాకలి సర్వయ్య, గురవయ్య మేరె రాంలింగయ్య, మేడబోయిన


**ఎందుకంటే ఇది వరకే లేకలేక బడి వస్తే కోమటాయనో కొట్టమిచ్చిండు. ఆ కొట్టంల పొద్దుందాక పోరగాళ్ళు తెల్లందాక బర్లుంటయ్. పోరగాళ్ళు బడికి పోతే, గోమారీలు అంబారీలు, బుడ్డ పిడుగులు, కరిచి కరిచి పోకుంట జేస్తున్నవి. వాటి భయానికి మా పోరగాడు బర్ల కాడికన్న బోతగని, బడికి మాత్రం పోనని, నన్ను బట్టుక వాడేడ్వ వాని బట్టుక నేనేడ్వ సరిపోతున్నది.**


**రచయిత గురించి....**

*నర్రా రాఘవరెడ్డి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో **1924**లో జన్మించారు. నకిరేకల్ నియోజకవర్గంలో నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శాసనసభాపక్ష నాయకునిగాసేవలందించారు. స్వచ్ఛందంగా రాజకీయాలనుండి తప్పుకున్నారు. నిరాడంబరతకు నీతికి నిజాయితీకి నిలువుటద్దమై నిలిచారు. ఆరు దశాబ్దాల రాజకీయ జీవితమంతా ప్రజల కోసమే తపించారు. ప్రజా కళాకారుడుగా బుర్రకథలను, లత్కోర్ సాబ్ వంటి హాస్య రూపకాలను ప్రదర్శించి ప్రజలను చైతన్యం చేశారు. **2015** ఏప్రిల్ **9**వ తేదీన మరణించారు.*

రామయ్య, ఏకే బడేసాబ్, పి.కె. గోపాలం వాళ్ళంతా కూడింఁడ్రు... కూడేం జేస్తున్న రనుకుంఁడ్రు?

రంగు రంగు కాగితాలు, రకరకాల కాగితాలు తిరిగేసి మల్లేసి చూస్తున్నారు. వీళ్ళందరి మధ్య జిట్టలాగు తొడుక్కొని, పొట్టి అంగి తొడుక్కొని బుట్ట నెత్తిన బెట్టుకొని, పోలీసు రంగు బట్టలతోని, పంచవర్ష ప్రణాళికని, ప్లానింగని డెవలప్ మెంటని, మాకు రాని కొత్త కొత్త మాటలన్ని నత్తి నత్తిగ జెప్పుతుండు. అప్పుడు నేను పంచవర్ష ప్రణాళికంటే పంచ విడిచే ప్రణాళికనుకొని, ఇట్టా జూస్తే ఈయనకు పంచ లేదు. ఈ వూళ్ళో అందరిని ఇట్లనే జేస్తడనుకొనుని నీ పంచవర్ష ప్రణాళికొద్దు నీవు వద్దు వచ్చినదారి పట్టమన్న....

అప్పుడాయన అట్లాగాదు లత్కోరు సాబ్ గ్రామాల బాగు కొరకు గవర్న మెంటు నాయం జేస్తుంది. అప్పులిస్తుంది. అసుపత్రులు పెడ్తుందన్నారు. మనుషులకా పశువులకా అని నేనడిగిన. మనుషుల కైనా పెడ్తం పశువులకైనా పెడతమన్నడు. అంతేకాదు బాటలు బాగు చేసుకోవాలి బావులు త్రవ్వ కోవాలి. - పెంటపోగులు చేసుకోవాలి పంటలు పడించుకోవాలి అంతాగలిసి ఆవులపైకి ఆబోతులిడుచుకోవాలి భజనలు నేర్చుకోవాలి. అన్నీ కావాలి అన్నీ జేస్తమన్నాడు.

ఎందుకంటే ఇదివరకే లేకలేక బడి వస్తే కోమటాయనో కొట్టమిచ్చిండు. ఆ కొట్టంల పొద్దుందాక పోరగాళ్ళు తెల్లందాక బర్లుంటయ్. పోరగాళ్ళు బడికి పోతే, గోమారీలు అంబారీలు, బుడ్డ పిడుగులు, కరిచి కరిచి పోకుంట జేస్తున్నవి. వాటి భయానికి మా పోరగాడు బర్ల కాడికన్న బోతగని, బడికి మాత్రం పోనని, నన్ను

బట్టుక వాడేడ్వ వాని బట్టుక నేనేడ్వ సరిపోతున్నది.

ఇంక పంతుళ్ళ జాతమా అంటే వచ్చే జీతాలు చక్కగ రావంట ఎప్పుడు టపా జవాను కెదురు చూస్తుంటారు...

ఇన్ని తిప్పలకన్నా బడికట్టుకోవడం కొంత బాగానే వుందనుకొన్న. 'బడి కట్టు కోవాలంటే ఏం చెయ్యాలయ్యా' అన్న. అప్పుడాయన ప్రభుత్వం రెండు పాళ్ళు ప్రజలొక పాలు పెట్టు కోవాలని పైసలొసూలు జేయటానికి పదిమందిని కమిటేసిండు. ఆ కమిటీల ఎవర్ని వేశాడను కున్నారు?..! మావూరి దొరాయన, మాలి పటేలు, పోలీసు పటేలు, పోలా లింగయ్య, పట్వారి రంగయ్య, పంగనామాల వెంకయ్య అష్టప్రధానులంతా తిష్ట వేసి కూర్చున్నరు. ఇన్నాళనుంచి ఏం దొర్కటం లేదు. ఇది బాగ వున్నది అదను అనుకొన్నరు. ఎల్లాయెకింత



**డిప్టిసాబ్ తాసీలుదారుకు రాసిండు. తాసీలుదారు బి.డి.వో.కు రాసిండు. బీడీవో ఎన్‌యిఓకు హుకుం... ఎన్ ఈ ఓ ఆ హుకుం దీసుకొని వూళ్ళోకొచ్చి 'మా కాగితాల పైన బడివున్నది. పిల్లలు చదువుతూనే వున్నరు. మీ వూరిలో బడి లేదేమయింది?' అన్నారు. వానొచ్చింది వరదకు పోయిందన్నం. అట్లెట్ల పోతుందని కూర్చొ బెట్టి నచ్చచెప్పి మల్లా బడి గట్టింద్రు. అయినా ఇటు ప్రభుత్వానికీ పైసలు నష్టం, ప్రజలకు పన్నులు నష్టం తప్పడం లేదు.**

ఎకరానికింతని వేయనే వేసింద్రు పట్టి. వెయ్యి ఎకరాలున్న మా దొర ఎంత ఇస్తారో చూతమని ఎదురు చూస్తూ కూచున్నాం మేమంతా. అప్పుడు మాదొరలేచి పైసలు నేనే ఇస్తాపట్టి నేనే రాస్తా, వచ్చేటోనికి బెద్దా పొయ్యేటోనికి బెద్దా. ఇక్కడికే చాల అవుతుంది ఇంకేంది ఇచ్చేదన్నడు. ఆడగూచ్చున పెద్దలంతా నిజమేనన్నరు అప్పుడు వూళ్ళో కెళ్లా, అర్ధ, పావుల అందరి దగ్గరవసూలు చేయమన్నారు.

ఇవ్వలేని వాడెవడన్నా వుంటే ఇంటి తలుపులూడదీసుక రమ్మన్నరు.

అప్పుడా జనం... పంచవర్ష ప్రణాళికనిరి, బాగుచేస్తమనిరి, ఇదేమిటి ఇంటి తలుపులు బోతున్నయని కొట్టుకుంట, మొత్తుకుంట బి.డి వో. సాబ్ దగ్గరికి పోయిన..

ఆయనగారు ...

పైసలివ్వకుంటె మానె పనిజేసినా చాలన్నాడు. ఇట్ల అయితే ఎట్లన్న ఏడువొచ్చు రెక్కల కష్టమనుకొన్నం...సరి

అప్పుడంతా కలసి అక్కడి నుండి ఎట్లనో ఎలుపడి కట్టె దెచ్చింద్రు మట్టి దెచ్చింద్రు అట్లనో ఇట్లనో ఐదారు నెలలు తిప్పలుబడి, బడిగట్టనే కట్టింద్రు, ప్రారంభోత్సవానికని పదిమాట్లు పట్నం తిరిగి మంత్రి గారొచ్చేవరకు మాంచి వాన బడ్డది. వానకు మా బడిగోడలు నాని పక్కన పగిలి పచ్చ బాసినై... ఇట్లవుంటే బాగుండదని ఇంత ఇసుక సున్నం దెప్పించి పూత పూయించింద్రు. ప్రారంభోత్సవమయింది పని దీరిపోయిందనుకొన్నాం.

మంత్రిట్ల బోయిండో లేదో మళ్ళీ గాలి వానొచ్చింది. గాలికి రేకులు లేచిపోయినయ్. వానకు గోడలు కూలిపోయినయ్. వరద కేమి మిగలలేదు.

కొనకు కోమటాయన కొట్టమే గతి అయింది. అప్పుడు మేమంతా కలసి కలెక్టర్ దగ్గరకెళ్ళి కలెక్టర్ కు దరఖాస్తు పెట్టినం. కలెక్టర్ డిప్టి సాబ్‌కు రాసిండు. డిప్టిసాబ్ తాసీలుదారుకు రాసిండు. తాసీలుదారు బి.డి.వో.కు రాసిండు. బీడీవో ఎన్‌యిఓకు హుకుం... ఎన్ ఈ ఓ ఆ హుకుం దీసుకొని వూళ్ళోకొచ్చి 'మా కాగితాలపైన బడివున్నది. పిల్లలు చదువుతూనే వున్నరు. మీ వూరిలో బడి లేదేమయింది?' అన్నారు. వానొచ్చింది వరదకు పోయిందన్నం. అట్లెట్ల పోతుందని కూర్చొ బెట్టి నచ్చచెప్పి మల్లా బడి గట్టింద్రు. అయినా ఇటు ప్రభుత్వానికీ పైసలు నష్టం, ప్రజలకు పన్నులు నష్టం తప్పడం లేదు. మీరెవరన్నా ఇట్లా జేసుకునేరు. ప్రభూ.. అందరికీ వందనాలు ఆలోచించండి మీ దయ మాపై చల్లగా వుంటే మళ్ళీవస్తా శలవ్.

వ్యాసం

# ఘంటసాల సేవకుడు వంశీ రామరాజు...

ఘంటసాల ప్రేమికుని గురించి...



షామీర్ జానకి దేవి

1949వ సంవత్సరంలో జన్మించిన రామరాజు పురుషోత్తం దాస్ టాండన్ 'వంశీ రామరాజు' గా పేరు ప్రఖ్యాతలు గడించారు.. 1968లో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ, ఫిలిం జర్నలిస్టుగా, పౌరాణిక, సాంఘిక నాటకాల్లో నటిస్తూ, రంగస్థలం నటుడిగా, గాయకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఎన్నో రంగాల్లో ప్రవేశం ఉన్న వంశీ రామరాజు గారు, నాటి మేటి రచయిత్రి డాక్టర్ తెన్నేటి లత రచించిన "మోహన వంశీ" నవలకు ప్రభావితుడై, 1972లో 'వంశీ ఆర్ట్ థియేటర్స్' అనే సాంస్కృతిక సాహితీ సంస్థను, ప్రముఖ కథానాయకులు 'నటభూషణ' శోభన్ బాబు గారిచే ప్రారంభింపజేసి గత 50 సంవత్సరాలుగా సాహితీ, సాంస్కృతిక రంగాలకు ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తున్నారు.. ఎన్నో సాహితీ గ్రంథాలను ముద్రించడమే కాకుండా, తానే స్వయంగా "అమెరికా అధ్యక్షులు", "అద్భుత జంతు ప్రపంచం" అనే రెండు పుస్తకాలను రచించారు..

ప్రతిష్ఠాత్మకమైన "వంశీ బర్క్ లీ" అవార్డులను స్థాపించి, సినీ ప్రపంచంలో అలనాటి మహా నటులు నాగయ్య గారితో మొదలుకొని నేటి నటీనటుల వరకు ఎందరినో సత్కరించారు..

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (ఇండియా శాఖ) కు మేనేజింగ్ ట్రస్ట్ గా మొట్ట మొదటి సారిగా 'నెల నెలా తెలుగు వెన్నెల'కు శ్రీకారం చుట్టి, ఇప్పటికి 170కి పైగా సాహితి కార్యక్రమాలు నిర్వహించారు..




హైదరాబాదులోని కుంట్లూరులో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం, శేష శిరిడి సాయిబాబా మందిరం మరియు సద్గురు ఘంటసాల దేవాలయం నిర్మించారు..

1988లో దివ్యాంగుల సేవ కొరకు ప్రవాస భారతీయుల సహకారంతో 'వేగేశ్న ఫౌండేషన్' స్థాపించి ఎందరికో సేవలు అందిస్తున్నారు.. వృద్ధులకొరకు 'డాక్టర్ టి సుబ్బిరాం రెడ్డి వృద్ధ శరణాలయం' యువతులకు 'శ్రీ లక్ష్మీనరసింహ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్' దివ్యాంగులకు 'డాక్టర్ సి. నారాయణరెడ్డి షెల్టర్ ఫర్ ది డిజేబుల్డ్' 'డాక్టర్ కిడాంబి రఘునాథన్ బాలికల వసతి గృహము' 'వంశీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల' ఇలా ఎన్నెన్నో సంస్థలను స్థాపించి 50 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించారు..

కాకతీయ విశ్వ విద్యాలయంలో ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి పేర, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య గారి పేర స్వర్ణ పతకాలు స్థాపించారు.. ఇటీవల ఘంటసాల గారి పేర తెలుగు విశ్వ విద్యాలయంలో స్వర్ణ పతకం స్థాపించారు..

ఆయన సేవలకు గుర్తింపుగా పూర్వ






రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ గారిచే 'శిరోమణి' అవార్డు అందుకున్నారు.. విదేశీ సంస్థలయిన తానా, ఆటా, నాటా, నాట్స్ సంస్థలచే ఎన్నో కమ్యూనిటీ సర్వీస్ అవార్డులను, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారిచే 'అక్కినేని అవార్డ్'ను, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారిచే 'కీర్తి' పురస్కారం, లయన్స్, రోటరీ, జెసీసి, మరికొన్ని సంస్థలచే 'కళాబ్రహ్మ' 'సేవా మహాత్మ' మరియు 'ఘంటసాల సేవా శిరోమణి' లాంటి పురస్కారాలు ఎన్నో అందుకున్నారు.. అక్కినేని గారిచే రెండుసార్లు స్వర్ణకంకణాలను, 'టిఎస్ఆర్ స్వర్ణకంకణం' అందుకున్నారు.. ఇలా రాసుకుంటూ పోతే వారు చేసిన ఎన్నో

**నాటి** మేటి రచయిత్రి డాక్టర్ తెన్నేటి లత రచించిన "మోహన వంశీ" నవలకు ప్రభావితుడై, 1972లో 'వంశీ ఆర్ట్ థియేటర్స్' అనే సాంస్కృతిక సాహితీ సంస్థను, ప్రముఖ కథానాయకులు 'నట భూషణ' శోభన్ బాబు గారిచే ప్రారంభింపజేసి గత 50 సంవత్సరాలుగా సాహితీ సాంస్కృతిక రంగాలకు ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తున్నారు.

సేవా కార్యక్రమాలకు, పొందిన పురస్కారాలకు లెక్కలేదు..

2010లో నిర్వహించిన 'ఘంటసాల స్వర రాగ మహాయాగం' కార్యక్రమంలో 51 రోజుల పాటు, ప్రతి రోజు 51 పాటలతో నిర్వహించి 'లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో పేరు నమోదు చేసుకున్నారు..



1983 నుంచి ఇప్పటి వరకు 40 సార్లు అమెరికా పర్యటించారు.. ఎంతోమంది కళాకారులను అమెరికా తీసుకెళ్లి ప్రోత్సహించారు.. దివ్యాంగుల సహాయార్థం, 2007 నుంచి వంగూరి ఫౌండేషన్ వారి సహకారంతో అమెరికాలో 'సద్గురు ఘంటసాల ఆరాధనోత్సవాలను, ఎస్పీ బాలు సంగీతోత్సవాలను నిర్వహిస్తున్నారు.. భారతదేశం నుండి మొట్ట మొదటిసారి ముగ్గురు దివ్యాంగ కళాకారుల ప్రదర్శనను అమెరికాలో ఏర్పాటు చేసిన ఘనత వీరికే దక్కింది..

వారి సతీమణి డాక్టర్ తెన్నేటి సుధాదేవి గారు ప్రముఖ రచయిత్రి.. తెలుగు అకాడమీలో ఉపసంచాలకులుగా పని చేశారు.. ప్రస్తుతం వంశీ సంస్థల అధ్యక్షురాలుగా వ్యవహరిస్తున్నారు.. వంశీ రామరాజుగారికి, ప్రతి కార్యక్రమంలోనూ తన వంతు సహకారం అందిస్తూ, ఆయన సహధర్మచారిణిగా తన భాధ్యతలను చక్కగా నిర్వహిస్తున్నారు..

మనసుంటే మార్గం ఉంటుందన్నట్టుగా, వారి కళాసేవ ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది.. కరోనా సమయంలో కూడా ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి, అంతర్జాలంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ, నూతన ఒరవడితో, అందరికీ మార్గదర్శకులు అయ్యారు..

శుభోదయం గ్రూపుతో కలిసి ఘంటసాలగారి శతజయంతి సందర్భంగా 366 రోజుల ఘంటసాల స్వరరాగ మహాయాగాన్ని' అంతర్జాలంలో నిర్వహిస్తున్నారు.. వంశీ స్వర్ణోత్సవాల సందర్భంగా అనేక గ్రంథాలు ముద్రించారు..

# విచ్ఛిన్నకారుల పట్ల కవులు కలానికి పదునుపెట్టాలి...

### వచ్చే ఏడాది నుంచి భారత్ జాగృతి ఫౌండేషన్ - ఇండియా టుడే సాహిత్య పురస్కారం
### ఆజ్ తక్ సాహిత్య సమ్మేళనంలో ప్రకటించిన టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న వారి పట్ల కలాన్ని పదును పెట్టి సమాజాన్ని ఐక్యంగా ఉంచేలా కృషి చేయాలని కవులకు, రచయితలకు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ, భారత్ జాగృతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఈ దేశంలో సమాజాన్ని విడదీసే వాతావరణాన్ని మనం చూస్తున్నా మని, ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో ఈ దేశంలో సహృద్భావ వాతావరణం సృష్టించడానికి సాహిత్య కారులు కృషి చేయాలని కోరారు. నవంబర్ 27, 2022న న్యూఢిల్లీలో జరిగిన ఆజ్ తక్ (ఇండియా టుడే) సంస్థ వారి సాహిత్య సమ్మేళనం కార్యక్రమంలో కవిత పాల్గొన్నారు.




సాహిత్య రంగానికి విశేషంగా కృషి చేసిన వారికి వచ్చే ఏడాది నుంచి భారత్ జాగృతి ఫౌండేషన్ - ఇండియా టుడే సంస్థ సంయుక్తంగా సాహిత్య పురస్కారాన్ని అందిస్తాయని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "సాహిత్యం జ్ఞానాన్ని ఇస్తుందటారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు రీత్యా దేశంలో మంచి వాతావరణం కల్పించే బాధ్యత కవులు, రచయితలపై ఉంటుంది. సాహిత్య కారులను ప్రోత్సహించడానికి, వారికి అండగా ఉండడానికి అవార్డును నెలకొల్పాము" అని వ్యాఖ్యానించారు. ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా కవులు, రచయితలు దేశం పట్ల మరింత బాధ్యతలో రచనలు చేస్తారని అభిప్రాయపడ్డారు. దేశంలో సమాజాన్ని విడగొట్టడానికి, మనస్సులను దూరం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్న పరిస్థితి నెలకొందని, కాబట్టి కలానికి పదును పెట్టాలని కవులు, రచయితలకు పిలుపునిచ్చారు. విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తే కవులు సమాజాన్ని కలిపేందుకు కృషి చేయాలని అన్నారు. ఆ కృషికి భారత్ జాగృతి ఫౌండేషన్, ఇండియా టుడేతో పాటు తామంతా అండగా నిలబడుతామని, కలిసి నడుస్తామని స్పష్టం చేశారు. సాహిత్యకారులను సన్మానించుకుంటే సమాజపు గౌరవం పెరుగుతుందని చెప్పారు.

యువతకు సాహిత్యం అర్థం కాదని... భారతీయ సంస్కృతిని ముందుకు తీసుకెళ్లడంలో కలిసి రావడం లేదని కొంత మంది అంటారని, కానీ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొనడం గర్వంగా ఉందని స్పష్టం చేశారు. దేశ సాహిత్యం భారత యువత చేతుల్లో భద్రంగా ఉందని భావిస్తున్నానని కవిత తెలియజేశారు. సాహిత్య ప్రేమికురాలిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని తెలిపారు. శబ్దమే శక్తి అని తాను బలంగా విశ్వసిస్తానన్నారు. ఒక శబ్దం లక్షాలది హృదయాలను కదిలిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నామని అన్నారు.

# డిసెంబర్ 25న తెలుగు భాష ఉపాధ్యాయుల సమ్మేళనం..

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డిసెంబర్ 25న హైదరాబాదులో తెలంగాణ తెలుగు భాష ఉపాధ్యాయుల సమ్మేళనం జరగనుంది. వక్తలుగా ప్రతినిధులుగా పాల్గొనగోరే తెలుగు ఉపాధ్యాయులు పేర్లు నమోదు చేసుకోవాలని పరిషత్తు కోరుతున్నది. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి పరిషత్తు ఉపాధ్యక్షులు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి పర్యవేక్షణలో తెలుగు భాష వర్తమాన స్థితి మన కర్తవ్యం ప్రధాన అంశంగా సమ్మేళనం జరగనుంది. ఇందులో 1. తెలుగు భాషా బోధన ప్రస్తుత స్థితి, సమీక్ష 2. మారిన పరిస్థితుల్లో భాషా బోధనలో కొత్త పద్ధతులు 3. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలు ఉపాధ్యాయుల చొరవ ప్రభుత్వపరంగా తీసుకోవలసిన చర్యలు 4. సమ్మేళన తీర్మానాలు ఈ విధంగా చర్చ జరుగుతుంది. ఆయా అంశాల మీద ప్రసంగించదల్చుకునే ఉపాధ్యాయులు తన పత్రానికి సంబంధించి ఒక పుటకు మించకుండా ఈనెల 30వ తేదీలోగా 960 37 27 234 వాట్సాప్ నెంబర్‌కు పంపించాలి. వాటిని పరిశీలించి ఎంపికైన వారికి సమయం కేటాయించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య తెలిపారు. ప్రతినిధులుగా పాల్గొనే ఉపాధ్యాయులు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని ఇటువంటి ప్రవేశ రుసుము అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

## 'తెలుగు సామెతలు-సమగ్ర సమాలోచన' ఆవిష్కరణ సభ



ఏ.వి. ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ కళాశాల తెలుగుశాఖ, యాద శంకర మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో డా॥ వై.సత్యనారాయణ సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు సామెతలు-సమగ్ర సమాలోచన' గ్రంథావిష్కరణ సభ నవంబర్ 14, 2022న ఉ.10గం.లకు ఏ.వి. కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని డా.సుద్దాల అశోక్ తేజ ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సామెతలు కాలక్షేపానికి కాదని కార్యక్షేత్రంలో నిలబెట్టి అనుకున్న గమ్యానికి దారి చూపిస్తాయని అన్నారు. ఈ సభలో ఆచార్య కె.రామచంద్రారెడ్డి, ఆచార్య సాగి కమలాకరశర్మ, డా.కె.గౌతమి, సంగిశెట్టి బాబు, డా.ఎం. భగవంత రెడ్డి, డా.సిహెచ్.రాజలింగం, డా.పి.పద్మ డా.అట్టెం దత్తయ్య, డా.కె.లక్ష్మీవిజయ, డా.బి.జ్యోతి, డా.జి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. -తెలుగుశాఖ, ఏ.వి. కళాశాల

## తెలంగాణ తత్వకవులపై పత్ర సమర్పణలు...



నవంబర్ 18 ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ సిద్దిపేట జిల్లా తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో బహుజన స్ఫూర్తి ప్రదాతలు అన్న అంశంపై రెండు రోజులు జాతీయ సదస్సు జరిగింది. ప్రముఖ కవి రచయిత వెల్దండి శ్రీధర్ ఈ సభలకు కన్వీనర్‌గా వ్యవహరించారు. ముఖ్య కార్య నిర్వాహకులుగా డాక్టర్ ఏ శ్రీనివాస్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ వ్యవహరించారు. ప్రారంభ సభలు నవీన్ మిట్టల్ ఐఏఎస్, డి. రవీందర్ ఉపకులపతి ఓయూ, జూలూరి గౌరీ శంకర్ సాహిత్య అకాడమీ చైర్మన్, చింతకింది కాశీం తెలుగు శాఖ అధ్యక్షులు, సంగిశెట్టి శ్రీనివాస్ ప్రముఖ సాహిత్య విమర్శకులు మొదలైన వాళ్ళు పాల్గొన్నారు. మొదటి సదస్సు గుంతక నరసయ్య పంతులు, వడ్ల వెంకటాచార్య, పరవస్తు చిన్నయ సూరి, మేర మల్లేశం, రజని, శ్రీ అంది నారాయణస్వామి, కోట్ల బాల బ్రహ్మచారి, కైరల భూమదాసు పైన జరిగింది. తనికెళ్ల భరణి, బూర్ల వెంకటేశ్వర్లు, శంకర్, మామిడాల రమేష్ బాబు, అన్నవరం దేవేందర్, జీవి శ్యాం ప్రసాద్, లాల్ కే సురేష్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.



## సంగనభట్ల నరసయ్య రచించిన రెండు నాటకాల ఆవిష్కరణ...

నవంబర్ 9, 2022 సాయంత్రం ఏడు గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్లో జరిగింది. సంగనభట్ల నరసయ్య రచించిన రెండు నాటకాలు ప్రతాప రుద్ర విజయం సర్వజ్ఞ సింగ భూపాలీయం ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కెవి రమణచారి ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణాచారి సంగనభట్ల కళామర్మం తెలిసిన రచయిత అని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన శతావధాని డా॥ జి.యం. రామశర్మ ఇద్దరు తెలంగాణ చక్రవర్తుల నాటకాలను పద్యాలలో పొదిగిన విశేషాలను విశ్లేషించారు. డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ప్రతాప రుద్ర విజయము నాటకాన్ని సమీక్షిస్తూ నాటి సాహిత్య వైభవం దాన్ని సంగనభట్ల నాటకీకరించిన రీతి అద్భుతంగా ఉందని తెలియజేశారు. సర్వజ్ఞ సింగభూపాలీయాన్ని విశ్లేషించిన గిరిజ మనోహర్ బాబు సాంప్రదాయ బద్ధమైన గొప్ప రచన అని ప్రస్తుతించారు. పద్య రచన సంవిధానాన్ని ప్రత్యేకించి పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి చారిత్రక నేపథ్యాన్ని చిత్రించడంలో నరసయ్య పూర్తిగా సఫలమయ్యారని పేర్కొన్నారు. అష్టావధాని అవుసుల భాను ప్రకాష్ కార్యక్రమాన్ని ఆద్యంతం చక్కగా నిర్వహించారు.



## రెక్కలు కట్టుకున్న పాట...

ఇటీవల తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ వాగ్గేయకారులు పాల్గొని పాట యొక్క ప్రశస్తిని వివరించారు. సినీ గీతాలు జానపద గీతాలు ఉద్యమ గీతాలు మొదలైన గీతాల గురించి సవివరమైన చర్చలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలోని వందలాది మంది సాహితీవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. పాట ఎలా వికసించింది, మానవ చరిత్రలో పాట స్థానం ఏమిటి, పాటలో ఉండే వివిధ వ్యక్తీకరణలు ఎలాంటివి అన్న విషయంగా విపులంగా చర్చ జరిగింది.

స్వీకారం




## అన్నవరం దేవేందర్ కవిత్వం

అన్నవరం దేవేందర్

**సాహితీ సోపతి**
కరీంనగర్
వెల : రూ.1000/-




## జరీపూల నానీలు

వడ్డేపల్లి సంధ్య

**నవతెలంగాణ బుక్ హౌస్**
వెల : రూ. 230/-




## గౌరహరి దాస్ కథలు

మూర్తి కెవివిఎస్

**నవోదయ బుక్ హౌస్**
సెల్ : 90004 13413
వెల : రూ.150/-




## వయ్యి దీర్ఘ కవిత

దారమకుంట శంకరయ్య
సెల్ : 9440876788

**సాహితీ సోపతి**
కరీంనగర్
వెల : రూ. 30/-




## ప్రతాపరుద్ర విజయము సర్వజ్ఞ సింగభూపాలీయము

డా॥ సంగనభట్ల నరసయ్య
సెల్ : 94400 73123,

**పాలపిట్ట బుక్స్**
వెల : రూ. 120/-




## జీవితం పియానో మెట్ల మీద

ఎలగొండ రవి
హైదరాబాద్
సెల్ : 94947 15445

వెల : రూ. 150/-




## పలుకు జెలి

డా॥ టి. శ్రీరంగస్వామి

**శ్రీలేఖ సాహితి**
వరంగల్
వెల : రూ. 100/-




## కరోనా కా కహ్రాం

వెన్న వల్లభరావు

**విశాలాంధ్ర పబ్లికేషన్స్**
వెల : రూ. 40/-




## తెలుగు సామెతలు - సమగ్ర సమాలోచన

సంగిశెట్టి బాబు
హైదరాబాద్
సెల్ : 98490 71105

వెల : రూ. 150/-



గ్రంథాలయోద్యమం నేత...

# కోదాటి నారాయణరావు

(డిసెంబరు 15, 1914 - నవంబరు 11, 2002)